

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్), హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


రాష్ట్రానికి 7 నవోదయాలు
కేంద్రమంత్రివర్గం నిర్ణయం

ఆటో కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

అలా విదేశీపర్యటనలు... ఇలా ఒప్పందాలు ఎలా!

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 11 | శనివారం | 07-12-2024 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదు

### తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** గ్రూప్–1 అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గ్రూప్–1 నోటిఫికేషన్ రద్దు కుదరదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతూ వేసిన పిటిషన్ కొట్టివేసింది. కొత్త నోటిఫికేషన్ చట్టవిరుద్ధమని కొందరు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్–1 మెయిన్స్ వాయిదా తరువాయి 2లో

# 6 కాదు.. 160

కాంగ్రెస్ ప్రజా పాలనలో తొలి ఏడాదిలోనే వినూత్న కార్యక్రమాలు

‘మహాలక్ష్మి’ పథకంతో మొదలు

రోజుకో వినూత్న ఆలోచనతో అడుగులేసిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

తెలంగాణలో అన్ని రంగాల్లో సమ్మిళిత అభివృద్ధి

ప్రజాపక్షం / హైదరాబాద్

“కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఆరు నూరైంది. మార్పు మొదలైంది. ప్రజలకు ఇచ్చిన మాటను ప్రజా ప్రభుత్వం నూటికి నూరు పాళ్లు నిలబెట్టుకుంది. తొలి ఏడాదిలోనే సుస్థిర ప్రజాస్వామిక పాలనతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టింది. అధికారం చేపట్టినప్పటిన తొలి రోజు నుంచే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని రంగాల్లో తెలంగాణ సమ్మిళిత అభివృద్ధికి నిరంతరం సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలకే పరిమితం తరువాయి 2లో






## కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానికి ఏడాది

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి శనివారం నాటికి ఏడాది పూర్తయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 2023 వరకు బిఆర్‌ఎస్ అధికారంలో ఉండగా, 2023 నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో 64 ఎంఎల్‌ఎ స్థానాలతో కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చింది. అనంతరం 2023 డిసెంబర్ 7న ఎల్. బి స్టేడియంలో అప్పటి టిపిసిసి అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత 2024 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఎనిమిది ఎంపి స్థానాలను కైవసం చేసుకుని, తన విజయ పరంపరను కొనసాగించింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పలు నిధులను రాబట్టడంతో పాటు ప్రత్యేక నిధులు, పలు ప్రాజెక్టుల నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ శాఖలకు తరువాయి 2లో





## ఇరిగేషన్ ఎఇకి 19 బ్యాంక్ లాకర్లు!

రెండు లాకర్లలోనే రెండు కిలోల బంగారం

ఇంకా 17 లాకర్లు తెరవాల్సి ఉంది

ఆరు నెలల నుంచి సోదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

నీటిపారుదల శాఖ హైదరాబాద్ విభాగంలో ఎఇఇ హేరూర్ నికేష్ కుమార్‌కు మొత్తం 19 బ్యాంక్ లాకర్లు ఉన్నట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. వీటిలో రెండు లాకర్లు నికేష్ కుమార్ పేరుతో ఉండగా మిగతా 17 లాకర్లు బినామీలైన స్నేహితులు, తరువాయి 12లో

# టియర్ గ్యాస్‌తో రైతులపై పోలీస్ దాడి

కొందరు రైతులకు గాయాలు, ఆసుపత్రికి తరలింపు

ఉక్కిరిబిక్కిరై వెనక్కు పరుగు తీసిన 101మంది జాతా రైతులు

అర్ధాంతరంగా ఆగిన ఢిల్లీ పాదయాత్ర

**శంభు :** పంజాబ్–హర్యానా సరిహద్దుల నుండి ఢిల్లీ వరకూ 101 మంది రైతులు ప్రారంభించిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. పెద్దసంఖ్యలో బాష్పవాయుగోళాలు ప్రయోగించి రైతులను ఉక్కిరిబిక్కిరి చేశారు. రైతులు నోళ్ళు, ముక్కులూ, కళ్ళూ మూసుకుని వెనక్కు పరుగులు తీశారు. భాష్పవాయువు పొగ మబ్బులా వారిని చుట్టుముట్టడంతో దాని నుండి తప్పించుకునేందుకు మరికొందరు రైతులు గోనె సంచులను తలమీదనుండి శరీరమంతా కప్పుకుని వెనక్కు వెళ్ళారు. బలప్రయోగంతో వారు బయలుదేరిన ప్రదేశం తరువాయి 2లో





# ఎవరికీ భయపడొద్దు

తగిన మేరకే ప్రోటోకాల్ పాటించాలి

బాధితులు, పోలీసులు ఫ్రెండ్లీగా ఉండాలి

హోంగార్డులకు జనవరి నుంచి జీతాల పెంపు

ఎస్‌డిఆర్‌ఎఫ్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పోలీసులు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, ప్రోటోకాల్స్ ఎంతవరకు పాటించాలో అంతే పాటించాలని సిఎం రేవంత్‌రెడ్డి పోలీసులకు సూచించారు. తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ మార్గ్‌లోని హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్‌లో జరిగిన ప్రజా పాలన విజయోత్సవాల్లో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే.. పోలీసులు బాధితులతో ఫ్రెండ్లీగా ఉండాలని.. తరువాయి 12లో


అరుణాంజలి



నీవు ఉన్న క్షణాలు ఆనందమయం
మా ఆశ, శ్వాస నీవై బతికాం
మా నుంచి దూరమై విషాదాన్ని మిగిల్చావు
నీ గమ్యం పేదల అభ్యున్నతి
నీ లక్ష్యం సమసమాజ నిర్మాణం
నీ గమ్యం వైపు నడుస్తూ
నీ లక్ష్యసాధనకు పున : రంకితమవుతూ...

అమరజీవి పోటు ప్రసాద్ గారు
సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి
జననం : 01-09-1960 మరణం : 27-11-2024

భాష్పాంజలి ఘటిస్తూ...

మాతృమూర్తి: పోటు సక్కుబాయి
సతీమణి : పోటు నిర్మల
కుమారుడు - కోడలు : పోటు రాజా సాత్విక్ - మౌనిక
మరియు కుటుంబ సభ్యులు

సంస్మరణ
ది.08-12-2024 ఆదివారం ఉదయం 10-00 గం॥లకు
స్థలం : ఎస్‌ఆర్ కళాశాల (పాత మమత మెడికల్ కళాశాల, పువ్వాడ ఆడిటోరియం) రోటరీ నగర్, ఖమ్మం .
గమనిక : ఇదే కార్డుగా భావించగలరు



అశ్రునివాళి



అనురాగం, ఆప్యాయత, మంచితనానికి
మారుపేరుగా నిలిచిన
మీ నిష్క్రమణం మాకు తీరని లోటు
మీ జ్ఞాపకాలు మా మదిలో
ఎల్లప్పుడు మెదులుతూనే
ఉంటాయి. మీ పవిత్రాత్మకు
శాంతి చేకూరలని
భగవంతున్ని ప్రార్థిస్తూ..
శోకతప్త హృదయాలతో...

కుటుంబ సభ్యులు

కీ॥శే॥ గరికపాటి రాఘవయ్య గారు
మరణం : 28-11-2024

సహచరిణి : గరికపాటి వెంకటరత్నమ్మ

కుమార్తెలు - అల్లుళ్లు :
చల్లా సత్యావతి - వెంకటరామారావు
బోయపాటి నాగశిరోమణి-అప్పారావు(లేటు)
మునగాల సంధ్యారాణి - వెంకటేశ్వరరావు

కుమారులు - కోడళ్లు :
గరికపాటి వెంకటరావు-అన్నపూర్ణ
గరికపాటి ఆంజనేయప్రసాద్-నాగమణి

మరియు మనుమలు, మనుమరాండ్రు

పెద్ద కర్మ : ది.08-12-2024 ఆదివారం
స్థలం : మా స్వగృహం సాయిబాబా టెంపుల్ రోడ్, కరుణగిరి ఎదురుగా, కేంద్రీయ విశ్వవిద్యాలయం దగ్గర, ఖమ్మం.

## అమెరికా జోక్యం లేకుండా ఉక్రేన్ క్షిపణి ప్రయోగించలేదు: రష్యా



**మాస్కో :** స్వీయ రక్షణకోసం రష్యా దేనికైనా సిద్ధంగా ఉంటుందని ఆ దేశ ఉన్నత స్థాయి దౌత్యవేత్త సెర్గీ లావ్ రోవ్ అన్నారు. ఒక ఇంట ర్వ్యూలో ఈ విషయం ఆయన చెప్పారు. రష్యా తనకు తానుగా అమెరికాతో యుద్ధాన్ని కోరుకోవడంలేదని ఆయన స్పష్టం చేశారు. ఐతే రష్యా స్వీయ ప్రయోజనాలు కాపాడుకునేందుకు తమ దేశం దేనికైనా సిద్ధంగా ఉంటుందని , అన్ని మార్గాల ద్వారా దేశాన్ని కాపాడుకుంటుందన్నారు. రష్యా—అమెరికాలు ప్రత్యక్ష యుద్ధంలో లేనప్పటికీ ఉక్రేన్‌కు శక్తిమంతమైన ఆయుధాలను సరఫరా చేస్తోందని ఆయన విమర్శించారు. రష్యాలో మారుమూల ఉన్న గ్రామీణ ప్రాంతాలపైకి కూడా దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించేందుకు ఉక్రేన్‌కు రష్యా అనుమతి ఇచ్చిందని లావ్‌రోవ్ విమర్శించారు. అమెరికా ప్రత్యక్ష జోక్యం లేకుండా ఉక్రేన్ సైన్యం ఈ దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించలేదని, అందువల్ల అమెరికా కూడా రష్యాపై యుద్ధంలో పాల్గొంటున్నదని అన్నారు. 20 సంవత్సరాలపాటు రష్యా విదేశాంగమంత్రిగా పనిచేసిన అనుభవం లోవ్‌రోవ్‌కు ఉంది. ఉక్రేన్‌పై ఇటీవల తాము శక్తిమంతమైన హైపర్ సోనిక్ మధ్యశ్రేణి ఖండాంతర క్షిపణి ఓర్ష్నిక్‌ను ప్రయోగించినట్లు ఆయన చెప్పారు. అమెరికా, దాని మిత్రదేశాలు కూడా ఉక్రేన్‌కు ఇదేవిధమైన క్షిపణులను సరఫరా చేస్తున్నాయని అన్నారు.

## ఆర్థిక సంక్షోభం మధ్య నేడు ఘనా పార్లమెంటు, అధ్యక్షపదవి ఎన్నికలు





**ఆక్రా :** పశ్చిమ ఆఫ్రికాదేశం ఘనాలో శనివారంనాడు అధ్యక్ష పదవికి, పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతాయి. ఘనా పార్లమెంటులో మొత్తం 275 స్థానాల్లో గెలిచేందుకు పలు పార్టీలు పోటీ పడుతున్నాయి. ప్రధానంగా న్యూ పేట్రియోట్రిక్ పార్టీ (ఎన్‌పిపి), నేషనల్ డెమొక్రటిక్ కాంగ్రెస్ (ఎన్‌డిసి) మధ్య పోటీ జరుగుతోంది. ఒకవైపు అమెరికా—చైనా రెండు అగ్ర రాజ్యాలూ ఆఫ్రికా దేశాలపై ప్రభావం చూపించేందుకు పోటీపడుతూ ఉండటం, మరోవైపు దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, యువకులలో తీవ్ర నిరాశానిస్పృహలు నెలకున్న తరుణంలో ఘనాలో అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్‌పిపి తరపున మహమదు బౌమియా, ఎన్‌డిసి తరపున జాన్ మహమ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ఘనాలో ఆర్థికసంక్షోభం తారాస్థాయికి చేరుకుంది. యువకులు ఉన్నతవిద్యపూర్తిచేసి ఐదు, పదేళ్ళు గడచినాగానీ అర్హతకు తక్కువగల ఉపాథి ఎంచుకుంటున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి అకౌంటెంట్‌గా స్థిరపడాల్సిన 29 ఏళ్ళ ఘనా యువకుడు నథానియల్ క్వాయ్‌నూ చివరకు టాక్సీ మెకానిక్‌గా బిజీ జీవితాన్ని గడుపుతున్నాడు. ఎన్నికల సందర్భంగా ఇలాంటి ఇంటర్వ్యూలను పాశ్చాత్య మీడియా వెలువరిస్తున్నది.మంచి జీవితం పొందడంకోసం దేశంనుండి మరో మంచి దేశానికి వలస వెళ్ళిపోవాలనుకుంటున్నానని నథానియల్ క్వాయ్‌నూ అన్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నుండి భారీగా ఎడాపెడా అప్పులు చేసిన ఘనాదేశంలో ద్రవ్యోల్బణం 54 శాతం మేరకు పెరిగింది. ప్రజలు జీవన సంక్షోభంలో ఉన్నారు.

# సిరియా స్వాధీనమే లక్ష్యంగా: రెబల్స్

## హమ్స్ నగరం వదిలిపోతున్న వేలాది ప్రజలు





**బీరూట్ :** సిరియాలో తిరుగుబాటుదారుల జైత్రయాత్ర కొనసాగుతోంది. సిరియా ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగాతిరుగుబాటుదారులు ముందుకు దూసుకుపోతున్నారు. హయత్ తహ్రిర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) సంస్థ నాయకుడు అబూ మహ్మద్ అల్ జవ్లానీ నాయకత్వంలో తిరుగుబాటుదారులు పురోగమిస్తున్నారు. శుక్రవారంనాడు వారు హమ్స్ నగరంలోకి వారు ప్రవేశించారు. అంతకుముందు హమా నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. తీవ్ర ఘర్షణ మధ్య హమా సెంట్రల్ జైలు నుండి ఖైదీలను విడుదల చేశారు. కానీ తర్వాత సిటీ వెలుపల సైన్యాన్ని మోహరించామని ప్రభుత్వం ప్రకటించింది. తిరుగుబాటుదారులు ముందుకు వెళ్ళకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వ దళాలు హమా—హమ్స్ నగరాలమధ్య ఉన్న పెద్ద వంతెనను గగనతల దాడుల ద్వారా కూల్చివేసింది. అధ్యక్షుడు అస్సాద్‌కు చెందినవ మైనార్టీ తెగలు ఎక్కువగా ఉండే మెడిటేరియన్ తీరాన్ని, దేశరాజధాని డమాస్కస్‌ను కలిసే అత్యంత ముఖ్యమైన నగరం హమ్స్ ఇప్పుడు తిరుగుబాటుదారుల చేతుల్లోకి వెళ్ళింది. ''ఇప్పుడు మీకు టైము వచ్చింది, ఇక కాలం మీదే'' అని తిరుగుబాటుదారులు హమ్స్ నగర వీధుల్లో ప్రచారం చేస్తున్నారు. తిరుగుబాటుదారులు ఊచకోత కోస్తారన్న భయంతో 0దేశాధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ వర్గానికి చెందిన అలవైట్ మైనారిటీ తెగల ప్రజలు వేలాదిమంది ఇళ్ళువదలి సురక్షిత ప్రాంతాలకు పారిపోతున్నారు. అధ్యక్షుడు అస్సాద్ సహా ఇతర శత్రువులను మానసికంగా దెబ్బతీసి ప్రజల మద్దతు కూడగట్టేందుకు తిరుగుబాటుదారులు సోషల్‌మీడియాను బ్రహ్మాండంగా ఉపయోగించుకుంటున్నారు.

తిరుగుబాటుదారుల నాయకుడు జులానీ వ్యూహంతో రాజధాని డమాస్కస్‌కు 213 కి.మీ దూరంలో ఉన్న అతిపెద్ద నగరం అలెప్పోను మూడు రోజుల్లో స్వాధీనం చేసుకున్నారు. తర్వాత గడచిన గురువారం నాడు హమా నగరాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత దానికి 46 కి.మీ సమీపంలో ఉన్న మూడవ అతిపెద్ద నగరం హమ్స్ లోకి కూడా ప్రవేశించారు. దీంతో శుక్రవారంనాడు వేలాదిమంది ప్రజలు ఇల్లు ఖాళీచేసి ఇతర ప్రాంతాలకు పారిపోతున్నారు.

ప్రపంచం

అస్సాద్ నాయకత్వానగల ప్రభుత్వ దళాలు పోరాడుతున్నప్పటికీ వారిశక్తి చాలడంలేదు. ఐతే వారికి రష్యా, ఇరాన్ దేశాల అండదండలు కూడా ఉన్నాయి. వారం రోజులక్రితం అతిపెద్ద సిరియా నగరం అలెప్పోను తిరుగుబాటుదారులు పూర్తిగా స్వాధీనం చేసుకోవడం ప్రపంచదేశాలను దిగ్భ్రాంతపరచింది. అస్సాద్ నాయకత్వానగల సుమారు 40 మంది ప్రభుత్వ దళాలను హతమార్చి అలెప్పోను తిరుగుబాటుదారులు స్వాధీనం చేసుకున్నారు.

**300 మంది ఉగ్రవాదులుహతం: రష్యా**

సిరియాలో గడచిన 24 గంటల్లో 300 మంది తిరుగుబాటుదారులను హతమార్చినట్లు రష్యా ప్రకటించింది. సిరియాలో అధ్యక్షుడు అల్ బషర్ అస్సాద్ ప్రభుత్వానికి ఇరాన్, రష్యా మద్దతుగా ఉన్నాయి. తిరుగుబాటుదారులు ప్రధాన నగరాలను స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వ దళాలు వెనుకంజలో ఉన్నాయి. రష్యా యుద్ధ విమానాల సహాయంతో అస్సాద్ ప్రభుత్వ దళాలు పోరాటం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 300 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు రష్యా చేసిన ప్రకటనను ఇరాన్ అధికార పత్రిక 'ఇర్నా' ప్రచురించింది. తిరుగుబాటుదారుల కేంద్రాలపై రష్యా, సిరియా దళాలు దాడులు చేసినట్లు బీరూట్‌లో రష్యా సెంటర్ డిప్యూటీ హెడ్ ఒలెగ్ ఇగ్నాసియుక్ చెప్పారు.

### ఇ.యు అనుకూల అధ్యక్ష అభ్యర్థి లాస్కొనీ గెలుపుకోసం

## రుమేనియాలో వేలాదిమంది నిరసన ప్రదర్శన



**బుఖారెస్ట్ :** యూరప్ అనుకూల ప్రభుత్వాన్ని కోరుతూ రుమేనియాలో వేలాదిమంది యూనివర్సిటీ స్క్వేర్ వద్ద నిరసన ప్రదర్శన జరిపారు. యూరోపియన్ యూనియన్ అనుకూల అధ్యక్ష అభ్యర్థి ఎలెనా వాలెరికా లస్కోనీ (52)కి, రష్యా అనుకూల%నాటో వ్యతిరేక స్వతంత్ర అభ్యర్థి కాలిన్ జార్జెస్క్యూ (62)లమధ్య దేశ అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి రేపు ఆదివారంనాడు జరిగే రన్ ఆఫ్ ఎన్నిక జరగనున్నది. ఇంతకుముందు జరిగిన మొదటి విడత ఎన్నికల్లో రష్యా అనుకూల స్వతంత్ర అభ్యర్థి కాలిన్ జార్జెస్క్యూ ఆధిక్యత సాధించారు. దీంతో ఆయన అధికారంలోకి వస్తే రుమేనియా యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వాన్ని తిరస్కరిస్తుందన్న భయంతో యూరోపియన్ యూనియన్ అనుకూల ప్రదర్శకులు వేలాదిమంది రోడ్లమీదకు వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ రష్యా అనుకూల స్వతంత్ర అభ్యర్థి జార్జెస్క్యూను గెలిపించకూడదని, అతడు గెలిస్తే దేశంలో హక్కులకు తీవ్ర భంగం కలుగుతుందని నిరసన ప్రదర్శకులు నినాదాలు చేశారు

## జార్జియాలో నిరసన ప్రదర్శనలు

### ఇ.యు వ్యతిరేక ప్రభుత్వ రద్దుకు డిమాండ్

**తిబ్లిసి :** జార్జియాలో యూరోపియన్ యూనియన్ వ్యతిరేక ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించేందుకు ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చింది. జార్జియాలోని అన్ని నగరాలలోనూ వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. గడచిన మంగళవారంనుండీ జార్జియాలో నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఈ నిరసనలు రోజు రోజుకూ ఉద్ధృతం అవుతున్నాయి. రష్యా అనుకూల అధికార డ్రీమ్‌పార్టీ రెండు నెలలక్రితం పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ సాధించి త్వరలో అధ్యక్ష ఎన్నికలకు కూడా అభ్యర్థిని ఖరారు చేసిన నేపథ్యంలో ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. యూరోపియన్ యూనియన్‌లో జార్జియాదేశం సభ్యత్వం తీసుకునే విషయంపై చర్చలను అధికార డ్రీమ్‌పార్టీ నిరవధికంగా వాయిదా వేసింది. అదేవిధంగా యూరోపియన్ యూనియన్‌కు నిధులు సమకూర్చే విషయాన్ని కూడా 2028 వరకూ వాయిదా వేసింది. దీంతో యూరోపియన్ యూనియన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తర్వాత దేశంలో నిరసన ప్రదర్శనలు హింసాత్మకరూపం దాల్చాయి. యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకునే చర్చలు పునరుద్ధరించాలని ప్రారంమైన నిరసన ప్రదర్శనలు క్రమంగా ఎనిమిదోరోజు నాటికి అధికారంలో ఉన్న మెజారిటీ డ్రీమ్‌పార్టీ వైదొలగాలన్న డిమాండ్‌ను తలకెత్తుకున్నాయి. డ్రీమ్‌పార్టీ రష్యా అనుకూల పార్టీ అని నిరసన ప్రదర్శకులు ముద్ర వేశారు. ఐతే ప్రతిపక్షాలే ఈ హింసాత్మక నిరసనలను రెచ్చగొడుతున్నాయని ప్రభుత్వం మండిపడుతున్నది. 11 మంది ప్రధాన ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపించింది.



### పాశ్చాత్యదేశాల విమర్శల మధ్య

## ఇరాన్ ఉపగ్రహ ప్రయోగం



**టెహ్రాన్ :** పాశ్చాత్యదేశాల తీవ్ర విమర్శలమధ్య ఫకర్—1 ఉపగ్రహాన్ని శుక్రవారంనాడు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన అణుపరీక్షలుగానీ, అంతరిక్ష ప్రయోగాలు గానీ ప్రజల ప్రయోజనం కోసమేనని కూడా ప్రకటించింది. 300 కేజీలు బరువుగల పేలోడ్స్‌ను మోసుకువెళ్ళడంలో మొదటిసారి తాము విజయం సాధించామని, ఒక కొత్త రికార్డు సృష్టించామని ఇరాన్ ఆర్మీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్ ఒక ప్రకటన చేసింది. భూమికి చాలా ఎత్తులో ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు ఉద్దేశించిన ''సిమోర్ఫ్'' అడ్వాన్స్‌డ్ వాహకనౌక ఫకర్—1 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. రాన్ సెమ్నన్ రాష్ట్రంలో ఉన్న ఇమామ్ ఖొమైనీ స్పేస్ పోర్టు నుండి ఫకర్—1 ప్రయోగం జరిగింది. ఇంతకుముందు అనేకసార్లు ప్రయోగాలు చేసినప్పటికీ అవన్నీ విఫలమయ్యాయి. ఈసారి ప్రయోగం విజయవంతమైంది. ఇరాన్‌కు చెందిన ఖండాంతర క్షిపణి కార్యక్రమాలపై ఐక్యరాజ్యసమితి విధించిన నిషేధం 2023 అక్టోబరుతో ముగిసిపోయింది. అణ్వాయుధాలను ప్రయోగించడానికి ఈ ఖాండాంతర క్షిపణులను ఉపయోగిస్తారు.

# అంచనాల్లో తగ్గిన వృద్ధి,పెరిగిన ద్రవ్యోల్బణం

### వడ్డీరేట్లు యథాతథం: సిఆర్ఆర్‌లో కోత వరుసగా 11వసారి ఎంపిసి రికార్డు నిర్ణయం



**ముంబయి:** రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లను యథాతథంగా 6.5 శాతంగానే కొనసాగిస్తుంది. ఐతే స్థూలజాతీయోత్పత్తి క్షీణించి, ఆర్థిక వ్యవస్థ మందగించడంవల్ల నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్ఆర్)లో కోత విధించింది. రిజర్వు బ్యాంకు కోరుకున్నట్టుగా ద్రవ్యోల్బణాన్ని కొనసాగించేందుకు ఈ సిఆర్ఆర్‌ను ఒక పనిముట్టుగా ఆర్‌బిఐ ఉపయోగిస్తుంది. అదేవిధంగా తొలుత 7.2 శాతంగా వేసిన జిడిపి వృద్ధి అంచనాలను 6.6 శాతానికి తగ్గించి, ద్రవ్యోల్బణం అంచనాలను 4.8 శాతానికి పెంచారు. ఈ ఏడాది అక్టోబరులో ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠస్థాయికి చేరుకుని 6.21శాతంగా నమోదైంది. రిజర్వు బ్యాంకు ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) మూడురోజుల సమావేశం ముంబయిలో శుక్రవారం ముగిసింది. సమావేశం 4 : 2 అనుకూల,ప్రతికూల ఓటింగ్‌తో రెపోరేటుపై తీర్మానం చేసింది. ఎలాంటి మార్పులూ లేకుండా వరుసగా 11వ సారి కూడా రెపోరేటు యథాతథంగా 6.5 శాతంగానే కొనసాగించడం ఒక రికార్డు. గడచిన 22 నెలలుగా రెపోరేటు 6.5 శాతంగానే ఉంది. ద్రవ్యోల్బణాన్ని నాలుగుశాతం స్థాయికి తీసుకురావాలనే లక్ష్యంతో ఆర్‌బిఐ కుస్తీ పడుతున్నప్పటికీ ఈ పరిస్థితిలో మార్పు రావడంలేదు. దాంతో ఆర్థిక విశ్లేషకులు ముందుగా ఊహించినవిధంగానే, దేశ ఆర్థిక స్థితులకు అనుగుణంగా రెపోరేటు (వాణిజ్యబ్యాంకులకు రిజర్వు బ్యాంకు ఇచ్చే రుణాలపై వడ్డీరేటు)ను మార్పులేకుండానే కొనసాగించాలని ఎంపిసి నిర్ణయించింది. ఎంపిసిలో ఉన్న మొత్తం ఆరుగురు సభ్యుల్లో నలుగురు సభ్యులు రెపోరేటు మార్పును అంగీకరించకుండా యథాతథంగా కొనసాగించాలని ఓటువేయగా, మిగిలిన ముగ్గురు సభ్యులూ తటస్థంగా ఉండిపోయారు. ఈ కమిటీలో బయటనుండి సభ్యులుగా వ్యవహరిస్తున్న నాగేశ్ కుమార్, రామ్ సింగ్‌లు ఒకటిలో నాలుగోవంతు పాయింట్ల కోత విధించాలని కోరుతూ ఓటు వేశారు. రిజర్వుబ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) జులై—సెప్టెంబరు త్రైమాసికంలో అనుకున్నదానికంటే తక్కువగా 5.4శాతంగా నమోదైంది. గడచిన ఏడు త్రైమాసికాలుగా జిడిపి కుంటినడక నడుస్తున్నది. రూపాయి తీవ్ర ఒత్తిడికి గురవుతుండగా, ద్రవ్యోల్బణం తారాజువ్వలా దూసుకుపోతున్నది. ఐతే దీన్ని అదుపు చేసేందుకు రిజర్వుబ్యాంకు వద్ద పరిమితమైన అవకాశాలు మాత్రమే ఉన్నాయి. ఆర్‌బిఐ వద్ద బ్యాంకులు నిల్వ చేసే డిపాజిట్ నిల్వలలో 50 బేసిస్ పాయింట్లమేరకు కోత విధించారు. దీనివల్ల బ్యాంకింగ్ వ్యవస్థలోకి అదనంగా మరో రూ.1.69 లక్షలకోట్లు చలామణీలోకి వస్తాయి. దీంతో స్వల్పకాలిక వడ్డీరేట్లకు ఉపశమనం కలుగుతుంది. బ్యాంకు డిపాజిట్ రేట్లపై ఒత్తిడి తగ్గుతుంది. ఈ సందిగ్ధపరిస్థితుల్లో పొదుపు చర్యలు, ఆచరణాత్మకమైన డిమాండ్లతో తాము చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని శక్తికాంత దాస్ చెప్పారు. కాగా 2024—25 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి 7.2 శాతంగా తొలుత అంచనావేసిన జిడిపిని 6.6 శాతానికి తగ్గించామని చెప్పారు. అదేవిధంగా మార్చి నాటికి ద్రవ్యోల్బణం అంచనాలను 4.5 శాతం నుండి 4.8 శాతానికి పెంచారు.

## నోటిఫికేషన్ రద్దు కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

వేయాలని హైకోర్టును కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టుల జోక్యంతో నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. మెయిన్స్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే టిజిపిఎస్‌సి గ్రూప్—1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఫిబ్రవరిలోగా మెయిన్స్ ఫలితాలు విడుదల చేస్తామని టిజిపిఎస్‌సి తెలిపింది.

## 6 కాదు..160

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా దాదాపు 160 వినూత్న కార్యక్రమాలను చేపట్టింది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకో వినూత్న ఆలోచనతో వీటికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం పదేండ్ల విధ్వంసపు ఆనవాళ్లను చెరిపేసి తెలంగాణ పునర్ వైభవాన్ని కొనసాగిస్తూనే అన్ని రంగాల్లో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చింది. తెలంగాణను 'ది ఫ్యూచర్ స్టేట్'గా, 'హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీ'గా ప్రపంచానికి పరిచయం చేసేందుకు ముఖ్యమంత్రి చేసిన ప్రయత్నం తొలి ఏడాదిలోనే ఫలితాలను సాధించింది. రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తటంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. తొలి ఏడాదిలోనే 55,143 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలతో ప్రజా ప్రభుత్వం లక్షలాది మంది నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చింది. ఫలితంగా తెలంగాణలో నిరుద్యోగిత శాతం తగ్గుముఖం పట్టడం విశేషం. జాతీయ స్థాయిలో కేంద్ర గణాంక శాఖ నిర్వహించిన 'లేబర్ ఫోర్స్ సర్వే' ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది 2023 జులై నుంచి సెప్టెంబర్ వరకు నిరుద్యోగిత రేటు 22.9 శాతం ఉండగా, ఈ ఏడాది 2024 జులై నుంచి సెప్టెంబర్ వరకు 18.1 శాతానికి తగ్గింది. ఈ వానాకాలంలో ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలబడింది. సుమారు 67 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా, దాదాపు 153 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి కావడం విశేషం. రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దేశం దృష్టిని ఆకర్షించింది. దేశాభివృద్ధిలో రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తుందని ఇటీవలే కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. జిఎస్‌డిపి వృద్ధిలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ఈగ్రస్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జిఎస్‌డిపి దాదాపు రూ.15.52 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. ప్రజాపాలన విజయోత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు గత ఏడాది డిసెంబర్ నుంచి ప్రభుత్వం చేపట్టిన 160 వివిధ అభివృద్ధి, సంక్షేమ వినూత్న పథకాలన్నీ వేటికవే ప్రత్యేకతను చాటుకున్నాయి.

**'మహాలక్ష్మి' పథకంతో మొదలు**

'మహాలక్ష్మి' పథకం అమలుతో ఆర్‌టిసి బస్సుల్లో సగటున రోజుకు 30 లక్షల మంది మహిళా ప్రయాణికులకు లబ్ధి. రూ.1500 కోట్ల ఆదా జరిగింది. రూ.500 లకే గ్యాస్ సిలిండర్, మహిళల వంటింటి కష్టాల నుంచి విముక్తి కలిగి రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలకు లబ్ధి కలిగింది. గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు విద్యుత్తు వాడే గృహాలకు ఉచిత కరెంట్‌తో అరకోటి కుటుంబాలకు లబ్ధి జరిగింది. ఇందిరమ్మ ఇండ్లతో గూడు లేని నిరుపేదల సొంతింటి కల నిజం చేయడానికి నియోజకవర్గానికి 3500 ఇండ్లు చొప్పున ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇండ్లను మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపిక, నిధుల మంజూరు కోసం మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. 'చేయూత' కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం.రూ.5 లక్షల పరిమితిని రూ.10 లక్షలకు పెంపుదల చేసింది. తద్వారా 91 లక్షల కుటుంబాలకు లబ్ధి జరగగా, ఏడాదికి రూ.484 కోట్ల అదనపు ఆర్థిక భారం పడినా గత బిఆర్ఎస్ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.670 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించింది. ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు చేపట్టి ప్రతి నెలా ఒకటో తారీఖున జీతాలు చెల్లిస్తున్నది. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు ఈహెచ్ఎస్ స్కీమ్‌లో మార్పులు చేపట్టింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీ యూనివర్సిటీల ఉద్యోగులకు 5 శాతం మధ్యంతర భృతిని ఇవ్వడమే కాకుండా పెండింగ్‌లో ఉన్న 5 డిఎల్లో ఒక డిఎను మంజూరు చేసింది. ఆర్‌టిసి ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు 557 కారుణ్య పోస్టులను భర్తీ చేసింది. జిఓ 317, 46లపై కేబినెట్ సబ్ కమిటీలు ఏర్పాటు చేసి బదిలీలకు ఆమోదం తెలిపింది. సింగరేణి ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా, కార్మికులకు పండుగ కంటే ముందే దసరా, దీపావళి బోనస్ చెల్లింపు, చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు చొప్పున బోనస్ అందించింది. వైద్య రంగంలో కొత్తగా 8 ప్రభుత్వమెడికల్ కాలేజీల ఏర్పాటుతో పాటు ఒక్కో కాలేజీలో 50 చొప్పున, మొత్తం 400 ఎంబిబిఎస్ సీట్లును కల్పించింది. గోషామహల్‌లో 32 ఎకరాల విస్తీర్ణంలో ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు రూ.2 వేల కోట్లతో సూపర్ స్పెషాలిటీ సేవలను విస్తరించే చర్యలను చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర గీతంగా అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంష్విష్కరణతో పాటు తెలంగాణ పునర్నిర్మాణం, సచివాలయంలో సబ్బండ వర్గాల తెలంగాణ తల్లి 17 అడుగుల విగ్రహావిష్కరణను చేపట్టింది. ఇలా దాదాపు 160 సంక్షేమ, అభివృద్ధి, పురోగమన కార్యక్రమాలను ప్రజాపభుత్వం చేపట్టినట్లు అధికార వర్గాలు వివరించాయి.

## ఏడాది పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన పలువురు మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశారు. లండన్‌లోని థేమ్స్ నదిని పరిశీలించారు. అలాగే దావోస్‌లోని విదే శీ పర్యటనలో పలు అంతర్జాతీయ సంస్థలను తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించారు. ఈ క్రమంలో పలు కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయు కూడా చేసుకున్నది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సక్సెస్ అయింది. ఏడాది కాలంలో జరిగిన ఓటాన్ అకౌంట్, సాధారణ బడ్జెట్ శాసనసభ సమావేశాల్లో పదేళ్ల పాలన తీరును వివరించడంతో పాటు, ఆర్థిక, సాగు , విద్యుత్ రంగాలపై శ్వేతపత్రం విడుదల చేసి, రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ పాలనపైన చర్చకు తెరలేపింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ల కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, చేసిన అప్పులు, రాబడులను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వైఫల్యాలను కూడా ప్రజా ప్రభుత్వం ఎండగట్టింది. విభజన హామీలను అమలు చేయడంలో కేంద్రం, అమలు చేసేందుకు కేంద్రంపైన ఒత్తిడి తీసుకురావడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని కాంగ్రెస్ ప్రభుత్వం బలంగా ప్రజల్లో కి తీసుకెళ్లింది. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలకు పూర్తి కాలం వైస్ చాన్స్‌లర్లను నియమించింది. తద్వారా విద్యా రంగానికి, వృత్తి నైపుణ్యం విశ్వవిద్యాలయం ఏర్పాటుతో ఉపాధి రంగానికి అధిక ప్రధాన్యత ఇస్తున్నామనే సంకేతాలిచ్చింది. టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేయడంతోపాటు పోటీపరీక్షలను నిర్వహించడంలో ఎక్కడా జాప్యం లేకుండా చూసుకున్నది.

## పోలీస్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

'శంభు' వరకూ తరిమికొట్టారు. వారు సృష్టించిన ఆటంకాలవల్ల పాదయాత్ర అర్థాంతరంగా ముగిసింది. పోలీసు దాడిలో కొందరు రైతులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రులకు తరలిస్తున్నామని, ఈ రోజుకు పాదయాత్ర అర్థాంతరంగా ఆగిందనీ రైతు నాయకుడు శర్వణ్ సింగ్ పాంధర్ ప్రకటించారు. రైతులు గాయపడినందువల్ల ఈ రోజుకు జాతాను ముగిస్తున్నట్లు శంభులో ఆయన మీడియాకు చెప్పారు. సంయుక్త కిసాన్‌మోర్చా (రాజకీయేతరసంస్థ), కిసాన్ మజ్దూర్ మోర్చా రైతు వేదికలు రెండూ సమావేశమై తదుపరి కార్యాచరణ రూపొందిస్తాయని చెప్పారు. ఒకలక్ష్యంకోసం మరణానికి కూడా వెనదీయనివిధంగా సిద్ధపడి వచ్చిన 101మందితో ఈ జాతా (మర్జీవర్స్) బయలుదేరిందనీ, కానీ హర్యానా ప్రభుత్వం రైతులను కనీసం పాదయాత్ర చేయడానికి కూడా అనుమతించడంలేదని విమర్శించారు. రైతులను ముందుకు వెళ్ళకుండా ప్రభుత్వం అడ్డుకుంటే అది రైతులు సాధించిన ''నైతిక విజయం'' కాగలదని పాంధర్ ముందుగానే ప్రకటించారు. ట్రాక్టర్లు తీసుకురాకపోతే తమకు అభ్యంతరం లేదని చెప్పిన పోలీసులు ఆ మాటను ఉల్లంఘించారు. అంబాలా జిల్లాలోని 11 గ్రామాలలో డిసెంబరు 9వ తేదీ వరకూ మొబైల్, ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సదుపాయాలు లేకుండా హర్యానా ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ళను అంబాలాజిల్లాలో మూసివేయాలని జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను చట్టబద్ధత చేయడంతోపాటు పలు డిమాండ్ల సాధనకోసం రైతులు చేపట్టిన నిరశన, జాతాలపై పోలీసులు అణచివేత చర్యలకు దిగారు. పంజాబ్—హర్యానా సరిహద్దుల్లో శంభు సరిహద్దులవద్ద రైతులపై నీటిగొట్టాలను ప్రయోగించేందుకు పెద్దసంఖ్యలో వాహనాలను పోలీసులు ముందుగానే సిద్ధం చేశారు. రైతులను పోలీసులు అడ్డగించారు. దీంతో ఉద్రిక్తతలు చెలరేగాయి. పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించడంతో పలువురు రైతులు గాయపడ్డారు. ఈ కారణంగా ఢిల్లీ వరకూ కొనసాగాల్సిన రైతుల పాదయాత్ర అర్థాంతరంగా ముగిసింది. అంతకుముందు ఉదయం శంభు సరిహద్దులలో దీక్షాశిబిరం దగ్గరనుండి 101 మంది రైతులు ఢిల్లీకి పాదయాత్ర ప్రారంభించారు. కానీ కొద్దిదూరం పాదయాత్ర చేయగానే పోలీసులు అడ్డగించారు. హర్యానా రాష్ట్ర పోలీసులు రైతులు ముందుకు ప్రయాణించకుండా పెద్ద సంఖ్యలో బారికేడ్లు నిర్మించారు. ఆ ప్రదేశానికి రైతులు చేరుకోగానే భద్రతా సిబ్బంది వారిపై అనేకసంఖ్యలో బాష్పవాయుగోళాలను ప్రయోగించారు. బలవంతంగా వారిని బయలుదేరిన ప్రదేశం వరకూ తరిమికొట్టారు.మొదట చాలామంది రైతులు తొలుత ఇనుము చక్రాలతో ఉన్న బలమైన కొన్ని బారికేడ్లను కష్టపడి అడ్డం తొలగించారు. రైతులు వెళ్ళకుండా రోడ్లపై మేకులు దింపారు. జాతా సందర్భంగా మార్గానికి అడ్డం లేకుండా రైతులు ఆ మేకులను పైకిలాగడం, వైర్లను తొలగించడం కనిపించింది. తర్వాత బాష్పవాయు దాడి జరిగింది. ''సత్నాం వాహెగురు..''అంటూ రైతులు నినాదాలు చేస్తూ జాతాలో నడిచారు. రైతుసంఘ పతాకాలను పట్టుకుని రైతులు జాతాలో ముందుకు నడిచారు. ఐతే పోలీసులు మొదటి వలయంగా సృష్టించిన బారికేడ్లను రైతులు సులభంగానే దాటుకుని ముందుకు వెళ్ళగలిగారు. కానీ ఆ తర్వాత ఏర్పాటు చేసిన బలమైన రెండో వలయం బ్యారికేడ్లను రైతులు దాటి ముందుకు వెళ్ళలేకపోయారు. ఘట్టార్ నదిపై నిర్మించిన వంతెన పల్లంలో భద్రతాదళాలు ఐరన్ మెష్‌ను అడ్డంగా పెట్టాయి. కొందరు రైతులు ఆ మెష్‌ను తొలగించే ప్రయత్నం చేశారు. భద్రతా దళం కాపలా ఉండేందుకు ఎత్తుగా ఏర్పాటు చేసుకున్న సిపాయిబల్లపైకి ఒక రైతు ఎక్కేందుకు ప్రయత్నించాడు. తర్వాత ఇతర పోలీసులు వచ్చి బలవంతంగా ఆ రైతును కిందికిదింపి ఈడ్చుకు వెళ్ళారు. ఇక ఒక్క అడుగు కూడా ముందుకు కదలవద్దని హర్యానా పోలీసులు రైతులను హెచ్చరించారు. అంబాలాజిల్లాపాలనాయంత్రాంగం భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) చట్టంలోని 163వ సెక్షన్ కింద నిషేధ ఆజ్ఞలు విధించిందని పోలీసులు వారికి చెప్పారు. ఐదుగురుకంటే ఎక్కువమంది రైతులు గుమిగూడకూడదని కూడా ముందుగా హెచ్చరించారు. అంతకుముందు రైతునేత జగ్‌జిత్‌సింగ్ దల్లేవాల్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను కూడా కొ ద్దిసేపటికే భగ్నంచేసి ఆయనను ఆసుపత్రి పేరుతో తరలించి నిర్బంధించారు.

**స్వామినాథన్ చెప్పినట్లు డిమాండ్లు నెరవేర్చేండి రైతులపై దాడికి రాహుల్‌గాంధీ ఖండన**

కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతోపాటు రైతులు అడుగుతున్న డిమాండ్లను ప్రభుత్వం సమ్మతించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కోరారు. వారు కోరిన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. రైతులపై బాష్పవాయుగోళాలు ప్రయోగించి వారి పాదయాత్రను భగ్నం చేయడాన్ని రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. పాదయాత్రగా వెళుతున్న రైతులను పోలీసులు గాయపరచారని విమర్శించారు. పాదయాత్రకు కూడా వారిని అనుమతించడంలేదన్నారు. పోలీసు చర్యలు ఏమాత్రం సమ్మతించదగినవికాదన్నారు. రైతులు చాలా తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి డిమాండ్లు ఏమిటో ప్రభుత్వం వినాలని కోరారు. ప్రతిరోజూ ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడన్నారు. మోదీ ప్రభుత్వంలో రైతులు చేసిన ఉద్యమంలో 700 మంది రైతులు చేసిన ప్రాణత్యాగాలను దేశం మరచిపోదన్నారు. రైతుల బాధలను, వారి సమస్యలను కాంగ్రెస్‌పార్టీ అర్థం చేసుకుందనీ, రైతులకు తమ పార్టీ మద్దతుగా ఉంటుందని అన్నారు. స్వామినాథన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు రైతులయ్యే ఖర్చుపై ఒకటిన్నర రెట్లు అధికంగా కనీస మద్దతు ధరను నిర్ణయించి ఇవ్వాలని, వారి రుణాలను రద్దుచేయాలని రాహుల్ గాంధీ కోరారు. రైతులు ప్రగతి సాధిస్తేనే దేశం కూడా ప్రగతి సాధిస్తుందని ఆయన అన్నారు.

# ఫోకస్




# భూమి దిగువ కక్షలో పెరుగుతున్న ఉపగ్రహాలు.. అంతరిక్ష శిథిలాలు

భూమి దిగువ కక్ష (లో ఎర్త్ ఆర్బిట్/ఎల్ఇఒ)లో పెరుగుతున్న ఉపగ్రహాలు, అంతరిక్ష శిథిలాలు సవాళ్లను విసురుతున్నాయి. ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో, ఈ సమస్యను పరిష్కరించకపోతే, భవిష్యత్తులో ఈ కక్షగల కీలక ప్రాంతం నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో ఐక్యరాజ్య సమితి ప్యానెల్ కూడా అంతరిక్ష ట్రాఫిక్ సమన్వయంపై చర్చించింది. తక్షణ పరిష్కారానికి చర్యలు అవసరమని సూచించింది. లో ఎర్త్ ఆర్బిట్ లేదా ఎల్ఇఒ అనేది సాధారణంగా భూమికి 180 నుంచి 2000 కిలోమీటర్ల ఎత్తులో, భూమి చుట్టూ ఆవరించి ఉండే కక్ష. ఈ ప్రాంతం భూమి ఉపరితలానికి దగ్గరగా ఉంటుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) ఈ కక్షలోనే ఉంది. అత్యంత తరచుగా ఉపగ్రహాలను తరచు ఈ కక్షలోనే ప్రవేశపెడతారు. ఏదైనా ఒక ఉపగ్రహం 'ఎల్ఇఒ'లో ఉండాలంటే, అది సెకనుకు దాదాపు 7.8 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించాలి. ఈ వేగంతో, ఉపగ్రహ చలనం ద్వారా ఉత్పన్నమయ్యే సెంట్రిఫ్యూగల్ ఫోర్స్ భూమికి ఉన్న గురుత్వాకర్షణ శక్తిని సమతుల్యం చేస్తుంది. తత్ఫలితంగా తన కక్ష్యలో ప్రయాణాన్ని కొనసాగించగలుగుతుంది. 'ఎల్ఇఒ'లోని ఉపగ్రహాలు భూమి చుట్టూ ఒకసారి భ్రమణాన్ని పూర్తి చేయడానికి దాదాపు 90 నిమిషాలు పడుతుంది. ఉపగ్రహాలు తిరిగి భూమికి తిరిగి వచ్చే సబ్‌ఆర్బిటల్ వస్తువులు లేదా ఎస్కేప్ వేగాన్ని (గంటకు 25,000 మైళ్ల వేగం) మించిన వస్తువులు కాకుండా, మిగతావన్నీ ఈ కక్షలవోనే తిరుగాడుతూ ఉంటాయి. పాడైన లేదా నిరుపయోగంగా మారిన లేదా కాలంచెల్లిన ఉపగ్రహాలు, అంతరిక్ష శిథిలాలు కూడా ఈ కక్షలో తిరుగుతుంటాయి. ఒకవైపు ఉపగ్రహాలు... మరోవైపు శిథిలాలు.. ఏదైనా అనూహ్యమైన మార్పులు సంభవించి, వాతావరణ డ్రాగ్ లేదా కక్ష క్షయం వంటి బాహ్య శక్తులు ప్రభావితం చేసే వరకూ 'ఎల్ఇఒ'లో తిరుగుతునే ఉంటాయి. భూ పరిశీలన ఉపగ్రహాలకు ఈ కక్షనే ప్రాథమిక ఎంపికగా పేర్కొంటారు. ఎందుకంటే అక్కడి నుంచి భూమి ఉపరితలంతో సామీప్యత కారణంగా అధిక రిజల్యూషన్ చిత్రాలు, డేటాను ఉపగ్రహాలు అందిస్తాయి. అనేక సమాచార ఉపగ్రహాలు, శాస్త్రీయ మిషన్లు కూడా మెరుగైన ప్రసార వేగం కోసం కూడా 'ఎల్ఇఒ'ని ఉపయోగించుకుంటాయి. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్స్ (జిపిఎస్S) కి కూడా 'ఎల్ఇఒ' ఉపగ్రహాలు కీలకం. గూగుల్ వంటి సర్చ్ ఇంజన్లు అందించే జిపిఎస్ సేవలను విస్తృతంగా ఉపయోగించుకుంటునే ఉన్నాం. ఈ కక్షలో ఉన్న ఐఎస్ఎస్ అనేక శాస్త్రీయ పరిశోధనలకు కేంద్రంగా మారింది. జియోస్టేషనరీ ఆర్బిట్ (జిఇఒ) వంటి అధిక కక్ష్యలలో ఉన్న ఉపగ్రహాలతో పోలిస్తే 'ఎల్ఇఒ'లోని ఉపగ్రహాలు ప్రయోగించడం సులభం. అంతేగాక ఖర్చు తక్కువ. కక్ష ఎంత ఎత్తులో ఉంటే, చేరుకోవడానికి అంత ఎక్కువ శక్తి అవసరమవుతుంది. అధిక శక్తికి అధిక వ్యయం తప్పదు. ఈ కారణంగానే 'ఎల్ఇఒ'లోకి ఉపగ్రహాలను పంపేందుకు ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. దీనితో ఉపగ్రహాలతోపాటు, అంతరిక్ష వ్యర్థాల సంఖ్య కూడా పెరుగుతున్నది. ఎందుకూ పనికిరాని అనేక ఉపగ్రహాలు, విరిగిన భాగాలు, కాలం తీరిన ఉపగ్రహాలు, ఈ కక్ష్యలో పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితి క్రియాశీల ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకలకు ఢీకొనే ప్రమాదాలకు కారణం కావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 'ఎల్ఇఒ'లో ప్రస్తుతం 14,000 కంటే ఎక్కువ ఉపగ్రహాలు ఉన్నాయి. వీటిలో 3,500 క్రియారహితమైనవే. వీటితో పాటు దాదాపు 120 మిలియన్ (1.2 కోట్లు) శిధిలాల శకలాలు కూడా



ఉన్నాయి. ఈ రద్దీ మరింత పెరుగుతుందని, 2024–29 మధ్యకాలంలో 556 మిలియన్ డాలర్ల నష్టం తప్పకపోవచ్చని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అదే విధంగా ఉపగ్రహాలు, గ్రహశకలాలు ఢీకొనే అవకాశం 3.13 శాతం పెరిగింది. గత ఏడాది ఒక్కో గ్రహం ఢీకొనే ప్రమాదం, అంతకు ముందు కాలంతో పోలిస్తే 17 శాతం పెరిగింది. స్పేస్‌ఎక్స్ చేపట్టిన స్టార్‌లింక్ (6,764 ఉపగ్రహాలు) వంటి ప్రాజెక్టుల కారణంగా, ఉపగ్రహ ప్రయోగాల్లో వేగం మరింత పెరిగింది. పోటీ ఏర్పడింది. సమర్థమైన నిర్వహణ, అంతర్జాతీయ సహకారం అనివార్యంగా మారింది.



సాధారణ మనిషి మెదడు స్టోరేజీ 2.5 మిలియన్ గిగాబైట్స్. అయితే, మెదడు అన్ని రకాల జ్ఞాపకాలను ఒకే దగ్గర స్టోర్ చేయదు. అనేకానేక విభాగాలు మార్చేస్తూ నిల్వ చేసుకుంటుంది.ఈ స్టోరేజీ ఫుల్ అవు తుందా? అనుమానం ఎవరికైనా రావచ్చు. అందుకు సమాధానం 'కాదు'. మెదడు స్టోరేజీ అవసరాన్ని బట్టి మరింత పెరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, మెదడు జ్ఞాపకశక్తికి ఎలాంటి ఎల్లలు లేవు. ఇంత మహత్తరమైన మెదడును సక్రమంగా వినియోగించుకోకపోతే నష్టపోయేది మనమే..

## తొలిసారి సమీప నక్షత్ర క్లోజప్ ఫొటో



సూర్యుడిలా కనిపిస్తున్నది మన సౌర మండలం వెలుపల ఉన్న నక్షత్రం. సూర్యుడు కూడా నక్షత్రమే.. కానీ, మన సౌర కుటుంబానికి చెందింది. డబ్ల్యుఒహెచ్ జి64గా పిలిచే ఈ నక్షత్రం మన సౌర కుటుంబానికి దూరంగా ఉన్నది. మన గెలాక్సీ ఆవల ఉన్న ఒక నక్షత్ర క్లోజప్ ఫొటోను యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీ (ఇఎస్ఒ)కు చెందిన అత్యంత పెద్దపైన టెలిస్కోప్‌లలోని 'ఇంటర్ఫెరోమీటర్'లను ఉపయోగించి తీశారు. ఆ నాలుగు టెలిస్కోప్‌ల సమాచారాన్ని సమ్మిళితం చేసి, మనకు అందించిన ఈ నక్షత్రం 'గుడ్డు' కారంలో ఉంది. దాని చుట్టూ ఉన్న వలయాలు వాయువు, ధూళి ఉద్గారాల కోకన్‌గా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మన పాలపుంత వెలుపల ఉన్న నక్షత్రానికి సంబంధించిన జూమ్‌ఇన ఫొటో ఎన్నో పరిశోధనలకు కొత్త రూపాన్నిస్తుందని అంటున్నారు. మన సూర్యుడి కంటే 1,500 రెట్లు పరిమాణం గల ఈ నక్షత్రం భూమికి 160,000 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. ఇది పాలపుంత చుట్టూ తిరిగే చిన్న గెలాక్సీ అయిన లార్జ్ మాగెల్లానిక్ క్లౌడ్ లోపల దర్శనమిచ్చింది. ఇప్పటి వరకు, డబ్ల్యుఒహెచ్ జి64ను స్పష్టంగా స్పష్టంగా ఫొటో తీయ డం దాదాపు అసాధ్యం అనిపించింది. అందుకు 100 మీటర్ల కంటే పెద్ద టెలిస్కోప్ అవసరం. బదులుగా, ఖగోళ శాస్త్రవేత్తలు నాలుగు 1.8 మీటర్ల టెలిస్కోప్‌ల నుండి సమాచారాన్ని కలిపి చిత్రాన్ని కలిపి ఉంచారు. ఒక నక్షత్రం పేలిపోవడానికి (సూపర్‌నోవా) ముందు ఏం జరుగుతుందనే వివరాలను ఈ ఫొటోలు అందిస్తాయని శాంటియాగోలోని యూనివర్శిడాడ్ ఆండ్రెస్ బెల్లోకు చెందిన ఖగోళ శాస్త్రవేత్త కెయిచి ఓహ్నాకా చెప్పారు. డబ్ల్యుఒహెచ్ జి64 ఒక సూపర్నోవాగా పేలడానికి 10,000 నుండి 100,000 సంవత్సరాల వరకు పట్టవచ్చు. అయితే, సూపర్‌నోవా క్రమాన్ని తెలుసుకోవడానికి ఇలాంటి చిత్రాలు ఉపయోగపడతాయి. నక్షత్రాలు చనిపోతున్నప్పుడు వాయువు, ధూళి కణాలు విడుదల చేసే పదార్థాన్ని అధ్యయనం చేయడానికి కూడా ఫొటోలు ఆధారమవుతాయి.

## శాస్త్ర సాంకేతికాభివృద్ధికి ఐఐఎస్ఎఫ్ బాటలు




ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్) గత తొమ్మిది సంవత్సరాలుగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి బాటలు వేస్తున్నది. గౌహతిలో నవంబర్ 30న ప్రారంభమై, డిసెంబర్ 3వ తేదీన ముగిసిన ఈ సదస్సులో పలు అంశాలపై దృష్టి సారించారు. ఈ ఏడాది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) నాయకత్వం వహించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ అండ్ టెక్నాలజీ (సిఎస్ఐఆర్ఎన్ఐఐఎస్‌టి) మద్దతునిచ్చింది. భారత దేశాన్ని గ్లోబల్ మానుఫాక్చరింగ్ హబ్‌గా మారచడం, పారిశ్రామిక వృద్ధితో శాస్త్ర సాంకేతికతను ఏకీకృతం చేయడం వంటి అంశాలను ఈసారి థీమ్‌గా నిర్ధారించారు. ఐఐఎస్ఎఫ్ అనేక రకాలుగా ప్రభుత్వ, ప్రైవేటు సంఘాల కోసం వివిధ కార్యకలాపాలను నిర్వహించింది. చంద్రుడి కళాత్మక నమూనాను ప్రదర్శించే 'చంద్రయాన్... ది మ్యూజియం ఆఫ్ ది మూన్' ఈ ఫెస్టివల్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మెగా సైన్స్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్ (ఎస్‌టిఇఎం)లో భారత్ సాధించిన విజయాలను హైలైట్ చేసే వివిధ అంశాలను పొందుపరిచారు.'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' పథకాల ద్వారా తయారీ రంగంలో ప్రపంచ దేశాలతో పోటీపడేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఈ సైన్స్ ఫెస్టివల్‌లో ప్రకటించారు. 'న్యూ నలంద' ఈవెంట్ ఇంటరాక్టివ్ ఎగ్జిబిట్ల ద్వారా ఎస్‌టిఇఎంతో విద్యార్థులను ఎంగేజ్ చేయడం లక్ష్యంగా పెట్టుకునాఇరు. 'ప్రజ్ఞా భారత్' కొత్త పరిశోధనా సరిహద్దులను అన్వేషిస్తుంది. ఎస్‌టిఇఎంకు 'నారీ శక్తి ' మహిళల సహకారాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. పలు రంగాల్లో స్వావలంబన కోసం భారత్ చేస్తున్న ప్రయోగాలు, సాధిస్తున్న వినూత్న పరిష్కారాలు, అందుకుంటున్న అభివృద్ధిని ఇందులో స్పష్టంగా చూపారు. ఎంతో మంది విద్యార్థులు ఈ పరిణామాలను ఆసక్తిగా గమనించడమేగాక, లోతైన అధ్యయనం కోసం ఉత్సాహం చూపించడం విశేషం. 'యంగ్ సైంటిస్ట్స్ కాన్క్లేవ్' ద్వారా యువ పరిశోధకులు, ఆవిష్కర్తలకు ప్రోత్సాహం లభిస్తుంది. 'థాట్ లీడర్స్ రౌండ్ టేబ్ల్ భారతదేశంలో సైన్స్ భవిష్యత్తు గురించి చర్చించడానికి విధాన రూపకర్తలను సేకరించింది. ఉపాధ్యాయులకు ప్రత్యేకించిన కార్యక్రమాలను ఇందులో చేర్చడంతో, శాస్త్ర సాంకేతిక విజ్ఞానంపై వారికి మరింత అవగాహన లభించింది. విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో ఈ అనుభవం వారికి ఉపయోగపడుతుంది. 2015లో ప్రారంభమైన ఈ ఐఐఎస్ఎఫ్ నిర్వహణ, క్రమం తప్పకుండా కొనసాగుతున్నది. దేశవిదేశాల నుంచి ఎంతో మంది శాస్త్రవేత్తలను, ఔత్సాహికులను ఆకర్షిస్తున్నది. ప్రత్యేకించి కొత్త ఆవిష్కరణల దిశగా యువ శాస్త్రవేత్తలు, సంస్థలు, కంపెనీలు అడుగులు వేయడానికి అవసరమైన సమాచారాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తున్నది.

# స్థానికులకే ఉద్యోగ అవకాశాలు

- పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లా వ్యాప్తంగా భూ పోరాటాలు ఉధృతం
- సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటి నరసింహ్మ

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముందు ఈ మద్యకాలంలో అమరులైనటువంటి ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ నాయకులు పన్నె వజీర్ బేగ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాల మల్లేష్‌కు నివాళులర్పించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇటి నరసింహ మాట్లాడుతూ దేశంలో త్యాగాలు, పోరాటాల చరిత్రలో 100 సంవత్సరాలలో అడుగుపెడుతున్న మహోన్నత చరిత్ర కలిగినటువంటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని అన్నారు. ముఖ్యంగా కార్మికులు పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అను నిత్యం ముందుండి పోరాడుతున్నటువంటి పార్టీ సిపిఐ అని కొనియాడారు. జిల్లాలో నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నారాయణ ఖేడ్ లాంటి వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఈ జిల్లాలో ఉమ్మడి మెదక్ జిల్లాలో పేదలకు వేలాది మందికి ఇళ్ల స్థలాలు



పంచినటువంటి చరిత్ర సిపిఐదేనని ఆయన అన్నారు. ఈ శతవార్షికోత్సవాల సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లాలో పూర్వ వైభవం తీసుకురావడం కోసం ప్రతి గ్రామ మండల స్థాయిలో ప్రజల వద్దకు వెళుతుందని ఆ దిశగా కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే ప్రభుత్వం ఇచ్చినటు వంటి హామీలు అమలు చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా రేషన్ కార్డులు నూతన పెన్షన్లు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ, ఇంటి ఋణాలు, వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని కోరారు. ఈ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వాడ వాడాల పల్లె పల్లెలా సిపిఐ జెండా ఎగరవేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.ప్రకాష్ రావు ,జిల్లా ప్రధాన కార్యదర్శి, సయ్యద్ జలాలోద్దీన్ జిల్లా కార్యవర్గ సభ్యులు బాల్‌రెడ్డి, ఆనంద్, మహబూబ్ ఖాన్, దత్తు, రెడ్డి రుబినా , బేగం జిల్లా కౌన్సిల్‌సభ్యులు అనురాధ, శంకరప్ప ,లక్ష్మి , చిరంజీవి, అశోక్ రమేష్, సత్యనారాయణ ,పూజ తదితరలు పాల్గొన్నారు.

# అమరుల ఆశయాలు సాధించాలి

బాల మల్లేష్, పోటు ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు



**ప్రజపక్షం/హనుమకొండ ప్రతినిధి :** అమరవీరుల ఆశయాలను సాధించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఇటీవల అమరులైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ జరిగింది. సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ ఉమ్మడి వరంగల్ జిల్లా సంస్మరణ సభలో తక్కళ్లపల్లి శ్రీనివాస రావు పాల్గొని మాట్లాడుతూ ఎర్ర జెండా నీడన చివరి వరకూ ప్రజల కోసం పోరాడిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బికెఎంయు బాల మల్లేష్, ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శి పోటు ప్రసాద్‌ల మృతి పార్టీ, ప్రజా సంఘాలకు తీరని లోటు అని అన్నారు. ఈ సందర్భంగా బాల మల్లేష్ చిత్రపటానికి సిపిఐ, బికెఎంయు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి బిక్షపతి హాజరై మాట్లాడుతూ బాల మల్లేష్ మృతి సిపిఐ పార్టీకి తీరని లోటు అని అన్నారు. సిపిఐ ఆద్వర్యంలో ఎర్రజెండా పోరాటాలకు విద్యార్థి దశలోనే ఆకర్షితులై విద్యార్థి ఉద్యమంలో పనిచేసిన బాల మల్లేష్, పోటు ప్రసాద్ జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉద్యమాలు నడిపారని గుర్తు చేశారు. పార్టీ, ప్రజాసంఘాల బలోపేతానికి, ప్రజా పోరాటాలకు వారు ఆదర్శంగా నిలిచి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. బాల మల్లేష్, పోటు ప్రసాద్ ఇద్దరూ అకస్మిక గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని, వారి ఆశయాలను ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చినారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహబూబాబాద్, జనగామ, వరంగల్, ములుగు జిల్లాల కార్యదర్శులు బి. విజయ సారథి, సిహెచ్ రాజారెడ్డి, మేకల రవి, తోట మల్లిఖార్జున రావు, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, బి. అజయ్, ఆదరి శ్రీనివాస్,నల్లు సుధాకర్ రెడ్డి, ఎస్కే బాషుమియా, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్**

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబా సాహెబ్ అంబేద్కర్ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి సిపిఐ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా గిరిజన, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. తన జీవితాంతం దేశంలో నిమ్న వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పోరాడిన అంబేద్కర్ అందరికీ స్ఫూర్తి దాయకంగా నిలిచారని కొనియాడారు.

## నిష్కలంక ప్రజా నాయకుడు పోటు ప్రసాద్

సంస్మరణ సభలో బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏ కళంకం అంటని నిష్కలంక ప్రజా నాయకునిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేరొందారని ఆయన మరణం ప్రజా పోరాటాలకు తీరని లోటని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. నిస్వార్థంగా పేదల అభ్యున్నతి కోసం ప్రసాద్ పాటు పడ్డారని ఆయన అన్నారు. దివంగత సిపిఐ నేత పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఖమ్మం హవేలీ సిపిఐ సమితి ఆధ్వర్యంలో స్థానిక సిటీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ సంపన్న, రైతు కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ కుటుంబం యావత్ కమ్యూనిస్టు పార్టీ కోసం అనేక త్యాగాలు చేసిందని, అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నదన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ కుటుంబం నుంచి వారసుడిగా వచ్చిన ప్రసాద్ విద్యార్థి దశలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా బహుముఖ పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. ఎఐటియుసి నాయకునిగా సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం, హక్కుల కోసం పోరాడారని తెలిపారు. శత వసంత సంబురాలను ఘనంగా నిర్వహించాలని భావించిన ప్రసాద్ ఆకస్మిక మరణానికి గురయ్యారన్నారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, సిపిఎం నాయకులు దొంగల తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కుమురం భీం అసిఫాబాద్ జిల్లాల్లో ఫారెస్ట్ నర్స రీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిఎఫ్ఒ కార్యాలయంలో ఎఒ వెంకటకృష్ణకు వేతనాలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ గత తొమ్మిది నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో రెబ్బెన, తిర్యాణి, సిర్పూర్(టి)



లోని పెదబండ ఫారెస్ట్ నర్సరీలలో పనిచేస్తున్న కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఫారెస్ట్ అధికారుల దృష్టికి పలు సార్లు తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారన్నారు. వేతనాలు చెల్లించని అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డిఎఫ్ఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫారెస్ట్ నర్సరీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం సంఘమిత్ర, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలు, కష్టజీవులు, కార్మికుల పార్టీ సిపిఐ



**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:** పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పునరుద్ఘాటించారు. శుక్రవారం స్థానిక పాత పాల్వంచ బొడ్రాయి సెంటర్‌లో జరిగిన సిపిఐ 1వ. 2వ వార్డు శాఖల సమావేశం ఎస్ఏ రెహమాన్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సిపిఐది వందేళ్ల చరిత్ర అని మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా ప్రజాక్షేత్రంలో మనగలుగుతామన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు.డిసెంబర్ 26 నాటి కి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో గ్రామ గ్రామాన వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పాల్వ పాల్వంచకు చెందిన 50 కుటుంబాలు సిపిఐలో చేరాయి. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీ సంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, రాహుల్, నాగరాజు, పద్మజ, సిపిఐ,ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సమాయత్తం

సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపు

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. వరంగల్ పట్టణంలో శివనగర్ తమ్మెర భవన్ సిపిఐ జిల్లా కార్యాలయంలో ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి హాజరై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం గత 11ల పాలన నుండి రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా కొనసాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను మానుకోవాలని, రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ తన జీవితాంతం కుల, మత తత్వాలకు వ్యతిరేకంగా కృషి చేశాడని, ఆయన ఆశయ సాధన కోసం నేటి తరం యువతీ యువకులు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, బుస రవీందర్, గుండె బద్రి, మహ్మద్ అక్బర్ బాషా, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు



# పార్లమెంట్‌లో మళ్లీ గందరగోళం



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయసభల్లో శుక్రవారం గందరగళ పరిస్థితులు నెలకొన్నాయి. లోక్‌సభలో యుఎస్ ఆధారిత బిలియనీర్ వ్యాపారవేత్త జార్జ్ సోరెస్‌తో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలను బిజెపి అంటగట్టే ప్రయత్నం చేయడంతో ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఇక రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపి సీటు వద్ద నోట్ల కట్టలను భద్రతా సిబ్బంది గుర్తించడంతో అధికార బిజెపి సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ఉభయసభలు కూడా సోమవారానికి వాయిదా పడ్డాయి. జీరో అవర్‌లో బిజెపి సభ్యుడు నిషికాంత్ దూబే బిలియనీర్ వ్యాపారవేత్త జార్జ్ సోరెస్‌తో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలను లేవనెత్తారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకు రావడంతో సభలో గందరగోళం ఏర్పడింది. సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్, తృణమూల్ సభ్యుడు సౌగతా రాయ్ కూడా తమ స్థానాల్లో నుంచి లేచినిలబడి కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. దూబే గురువారం కూడా ఈ అంశాన్ని లేవనెత్తారు, సోరోస్‌ను ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో అనుసంధానించడానికి బిజెపి చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సభ్యులు నిరసనలకు దిగారు. శుక్రవారం, కాంగ్రెస్ సభ్యులు గౌరవ్ గొగోయ్, కెసి వేణుగోపాల్ దూబే చేసిన ఆరోపణలను ఎదుర్కోవడానికి ప్రయత్నించడంతో లోక్‌సభ ఉదయం 11 గంటలకు సమావేశమైన నిమిషంలోపే మధ్యాహ్నం వరకు వాయిదా పడింది. మధ్యాహ్న సమయంలో సభ తిరిగి సమావేశమైనప్పుడు, సభాపతి స్థానంలో ఉన్న బిజెపి సభ్యుడు దిలీప్ సైకియా, గురువారం పూర్తి చేయలేకపోయిన అంశంపై మాట్లాడేందుకు దూబేని పిలిచే ముందు, సభ పార్లమెంటరీ పత్రాలను ఉంచడానికి అనుమతించారు. కాంగ్రెస్ సభ్యులు బిజెపి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభా వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో సైకియా విచారణను రేపటికి వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు కాంగ్రెస్‌కు చెందిన విపక్ష సభ్యులు కొన్ని అంశాలను లేవనెత్తేందుకు ప్రయత్నించగా స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మీరు ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించడానికి అనుమతించకూడదనుకుంటున్నారా? సభ ఉన్నత ప్రమాణాలను కలిగి ఉందని, దానిని తగ్గించడాన్ని అనుమతించలేను. సభ గౌరవాన్ని తగ్గించడాన్ని నేను అనుమతించలేను' అని ఆయన అన్నారు. సభను వాయిదా వేశారు. రాజ్యసభలో కరెన్సీ నోట్ల కట్ట సంచలనం సృష్టించింది. కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎంపి సీటు వద్ద దీన్ని గుర్తించినట్లు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖ ర్ శుక్రవారం సభలో ప్రకటించడం తీవ్ర దుమారానికి దారితీసింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని బిజెపి డిమాండ్ చేసింది.

# రాజ్యసభలో కరెన్సీ నోట్ల కలకలం

**న్యూఢిల్లీ :** రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించిన 222 నంబర్ సీటు వద్ద కరెన్సీ నోట్ల కట్టను గుర్తించినట్లు ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సభలో ప్రకటించారు. గురువారం రాజ్యసభ వాయిదా పడిన తరువాత యాంటీ సబోటేజ్ (కుట్ర నిరోధక) సిబ్బంది సమావేశ మందిరంలో సాధారణ తనిఖీలు చేపట్టారని సభకు వెల్లడించారు. ఈ క్రమంలోనే 222వ నంబరు సీటు వద్ద ఓ నోట్ల కట్టను గుర్తిం చారని, ఆ సీటు తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ ఎంపి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించిందని తెలిపారు.



ఈ విషయం తన దృష్టికి తీసుకురాగానే దర్యాప్తునకు ఆదేశించానని వెల్లడించారు. కొత్త రూ.500లతో వంద నోట్లు ఉన్న కట్టను గుర్తించినట్లు చెప్పా రు. ఆ నోట్లు అసలైనవో, నకిలీవో స్పష్టత లేదని, ఈ విషయాన్ని సభకు చెప్పడం తన బాధ్యత అని పేర్కొన్నారు.

**పేరు ఎలా చెబుతారు? : ఖర్గే**

దీనిపై రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పిన ఆయన, దర్యాప్తు పూర్తికాకముందే సభ్యుడి పేరు చెప్పడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖర్గే వ్యాఖ్యలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తప్పుబట్టారు. 'పేరు చెబితే తప్పేంటి? ఏ సీటు వద్ద కరెన్సీ నోట్ల కట్ట దొరికిందో, అక్కడ ఎవరు కూర్చుంటారో ఛైర్మన్ చెప్పారు. అందులో సమస్య ఏముంది? ఇలా నోట్ల కట్టలను సభకు తీసుకురావడం సరికాదు. దీనిపై లోతుగా దర్యాప్తు జరగాలి' అని పేర్కొన్నారు. మరోవైపు, రాజ్యసభ సమగ్రతకు అవమానం కలిగించారని కేంద్ర మంత్రి, బిజెపి అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు జె.పి.నడ్డా అన్నారు.

**చౌకబారు ఎత్తుగడలు: సింఘ్వీ**

ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపి అభిషేక్ మను సింఘ్వీ స్పందించారు. తాను రాజ్యసభ ఛైర్మన్ ప్రకటన చూసి ఆశ్చర్యపోయానని మీడియాతో వ్యాఖ్యానించారు. భద్రతా సంస్థలలో వైఫల్యం ఉంటే దానిని పూర్తిగా బహిర్గతం చేయాలని కోరారు. 'ఇలాంటి పరిస్థితిని నేనెన్నడూ చూడలేదు. గురువారం రాజ్యసభకు వచ్చేటప్పుడు నా జేబులో కేవలం ఒక రూ.500 నోటు మాత్రమే ఉంది. నేను మధ్యాహ్నం 12.57 గంటలకు సభ లోపలికి వచ్చా. ఒంటి గంటకు సభ వాయిదా పడటం వల్ల క్యాంటీన్‌కు వెళ్లా. సభలో మూడు నిమిషాలే ఉన్నాను. క్యాంటీన్‌లో ఒంటి గంట నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎంపి అయోధ్య ప్రసాద్‌తో కలిసి బోజనం చేసి పార్లమెంట్ నుంచి వెళ్లిపోయా' అని సింఘ్వీ తెలిపారు. తన సీటు వద్ద డబ్బులు రికవరీ చేసినట్లు చెప్పడం విచిత్రంగా ఉన్నదన్నారు. ఎంపిల సీట్ల చుటూ అద్దాలతో ఎన్‌క్లోజర్ పెట్టాలని, తద్వారా ఎంపి లేనప్పుడు ఆ సీటులో ఎవరైనా గంజాయి పెట్టకుండా నిరోధించవచ్చని సింఘ్వీ వ్యంగ్యంగా అన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూపిస్తూ వ్యవస్థను చెడుగా చూపిస్తున్నారని, సభలో జరిగే ప్రతిదానిపై చౌకబారు ఎత్తుగడల దిశగా పోకూడదని, ఆరోపణ, ప్రత్యారోపణలు మన స్థాయిని తగ్గిస్తాయన్నారు.

# బిజెపి ఎంపిలపై సభా హక్కుల నోటీసు

## రాహుల్ గాంధీపై అభ్యంతరక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై అభ్యంతరక వ్యాఖ్యల చేసిన బిజెపి ఎంపిలు నిషికాంత్ దూబే, సంబిత్ పాత్రలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శుక్రవారం సభా హక్కుల తీర్మానం నోటీసు ఇచ్చింది. రాహుల్ గాంధీకి విదేశీ పెట్టుబడిదారునితో సంబంధాలున్నాయని, ఆయన దేశద్రోహి అని బిజెపి ఎంపి నిషికాంత్ దూబే వ్యాఖ్యానించారు. మరో బిజెపి ఎంపి సంబిత్ పాత్ర మాట్లాడుతూ రాహుల్‌గాంధీ అత్యున్నత స్థాయి దేశద్రోహి అని అన్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపి హిబి ఎడెన్ సభా హక్కుల నోటీసును ఇస్తూ స్పీకర్‌కు లేఖ రాసారు. తాము బిజెపి ఎంపి నిషికాంత్ దూబే, సంబిత్ పాత్రలపై పార్లమెంటులో ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెట్టామని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ పేర్కొన్నారు. అయితే ప్రశ్నోత్తరాల సమయం వాయిదా పడిందని, ఎవరికి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ ప్రవేశపెట్టారో, ఆ వ్యక్తిని తిరిగి పార్లమెంటులో మాట్లాడటానికి అనుమతించారని తెలిపారు. పార్లమెంటు కొనసాగకుండా అడ్డుకునే కుట్రలో భాగమే ఈ చర్య అని మండిపడ్డారు. అదానీ అంశంపై భయపడి దాని నుండి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ఎంపి కె.సి. వేణుగోపాల్ కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాల ఎత్తుగడను అణిచివేసేందుకు మోడీ ప్రభుత్వం బుల్డోజింగ్ వైఖరిని అనుసరిస్తోందని దుయ్యబట్టారు. గురువారం పార్లమెంట్ వెలుపల బిజెపి నేత మరో సభ్యుడు కూడా కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేతపై తీవ్ర అవమానకర వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఇద్దరు నేతలపై కాంగ్రెస్ ప్రివిలేజ్ మోషన్ ఇచ్చిందని అన్నారు.

ఓ సభ్యుడిని కించపరిచే వ్యాఖ్యలు చేశారని తాము ఫిర్యాదు చేస్తే.. ఈ రోజు అదే సభ్యుని మాట్లాడేందుకు అనుమతించారని అన్నారు. స్పీకర్‌పై అధికార పార్టీ ఒత్తిడి తీసుకువస్తోందని అన్నారు.

**మా అన్నకు దేశం కంటే ఏదీ ఎక్కువ కాదు : ప్రియాంక గాంధీ**

తన సోదరుడి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి దేశం కంటే ఏదీ ఎక్కువ కాదని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ అన్నారు. ఆయనను దేశద్రోహి అంటూ బిజెపి ఎంపి సంబిత్ పాత్ర చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటు బిల్డింగ్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ ఆమె స్పందించారు. ఈ ఆరోపణలు కొత్తేమి కాదని, వారు మాజీ ప్రధానమంత్రులనే దేశ ద్రోహులు అని ఆరోపించిన వారు అని అన్నారు. దేశ స్వాతంత్ర పోరా టంలో 13 ఏళ్లు జైళ్ళో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూను , పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసిన ఇందిరాగాంధీని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీని వారు దేశద్రోహులు అన్నారని, రాహుల్‌ను కూడా అలా అ నడం లో కొత్తదేమి కాదని అన్నారు. దేశ సమైక్యత కోసం కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఆయన 4వేల కిలోమీటర్లు ప్రయాణం చేశారని గుర్తు చేశారు.
గురువారం బిజెపి ఎంపి కె.లక్ష్మ ణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి సంబిత్ పాత్ర మాట్లాడుతూ ధనికుడు జార్డ్ సోరస్, కొన్ని అమెరికా ఏజెన్సీలతో కూడిన ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ , రాహుల్ గాంధీ కలిసి ప్రమాదకరమైన త్రికోణంగా మారి భారతదేశాన్ని అస్థిరపరుస్తున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీని అత్యున్నత స్థాయి దేశద్రోహి అనడంలో తనకు ఎలాంటి సందేహం లేదని సంబిత్ పాత్ర ఆరోపించారు.

# నల్ల మాస్క్‌లు ధరించి ఎంపిలు నిరసన ర్యాలీ



**న్యూఢిల్లీ :** అదానీ అంశంపై గత వారం రోజుల నుంచి ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా శుక్రవారం కూడా పార్లమెంట్ కాంప్లెక్స్ లోపల కాంగ్రెస్ నేతృత్వంలో పలువురు ప్రతిపక్ష ఎంపిలు 'మోదీ అదానీ భాయి భాయి' అని రాసి ఉన్న నల్ల మాస్కులను ధరించి నిరసన ర్యాలీ చేశారు. గురువారం నాడు నల్లరంగుగల జాకెట్లు ధరించి నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కాగా, శుక్రవారం నాడు ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలకు చెందిన పలువురు నాయకులు రాజ్యాంగ ప్రతిని ప్రదర్శిస్తూ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. నిరసన ర్యాలీలో ఆర్‌జెడి, జెఎంఎం, వామపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు కూడా పాల్గొన్నారు. అయితే అదానీకి సంబంధించిన ఏ అంశంపైనా అయినా ప్రతిపక్ష ఎంపిలు నిర్వహించిన కార్యక్రమానికి టిఎంసి, సమాజ్‌వాది పార్టీలు హాజరు కావడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రతిపక్ష కూటమిలో చీలికలు వచ్చాయని బిజెపి ప్రచారం చేస్తోంది. కాగా, నిరసన ర్యాలీలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, ఆయన సోదరి, వయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ పాల్గొన్నారు. అందానీ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం భయపడుతోందన్నారు. ఎందుకు చర్చలు జరపడం లేదో అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. యుఎస్ కోర్టులో అదానీ, ఇతర కంపెనీల అధికారులపై వచ్చిన అభియోగాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్, పలువురు ఇతర పార్టీలకు చెందిన నాయకులు డిమాండ్ చేస్తున్న విషయం విదితమే.

# విపత్తులలో రాజకీయాలను ప్రజలు మన్నించరు

## వయనాడ్ ఎంపి ప్రియాంకగాంధీ వాద్రా

**న్యూఢిల్లీ :** విపత్తులలో రాజకీయాలు చేయడం సహేతుకం కాదని, వయనాడ్ ప్రజలు ఎట్టి పరిస్థితులలోనూ విపత్తు రాజకీయాలను ఎంతమాత్రం మన్నించరని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాం కా గాంధీ వాద్రా అన్నారు. కొండచరియలు విరిగిపడిన బీభత్సంలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న వయనాడు ప్రజలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలవైపు ఆశగా ఎదురుచూస్తున్నారు తప్ప వారికి 'సాకులు అవసరం లేదు' అని తెలిపారు. విపత్తులు రాజకీయాల కు సంబంధించినవి ఎంతమాత్రం కాకూడదు. అటువంటి విపత్తుల బాధితులను ఆదుకునే ప్రయత్నాలలో మా నవత్వం, కరుణతో ప్రాధాన్యతను కలిగినవిగా ఉండాలి అని వయనాడ్ ఎంపి శుక్రవారం నాడు సా మాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. గాయాలను నయం చేయడానికి, జీవితాలను పునర్నిర్మించుకోవడానికి ప్రభుత్వం యొక్క ప్రతీస్థాయిలోని వారు కలిసి పని చేసినప్పుడే భారతదేశం మరింత బలంగా ఉంటుందని ఆమె వివరించారు. ఈ విషయంలో కేంద్రం, రా ష్ట్రం సమన్వయంతో ముందుకు సాగుతూ వయనాడ్ ప్రజలకు తమ బాధ్యతలను నెరవేర్చాలని ప్రియాంకగాంధీ నొక్కిచెప్పారు. కేరళ ఎంపిలు అందజేసిన వినతిపత్రానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎంతగానో స్పందించారని ప్రియాంక గాంధీ ప్రజాప్రతినిధి హోదాలో తన భావాలను పంచుకున్నారు.

## మోదీ ప్రభుత్వం రైతుల అన్ని వ్యవసాయ ఉత్పత్తులనూ

# 'ఎంఎస్‌పి'కే కొనుగోలు చేస్తుంది

## ఢిల్లీకి రైతుల పాదయాత్ర కవాతు రోజున రాజ్యసభకు కేంద్రవ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ : రైతుల పాదయాత్ర కవాతు ప్రారంభరోజు ప్రభావం కేంద్ర ప్రభుత్వంపై బాగానే పడింది. తమ ప్రభుత్వంపై వ్యతిరేక ప్రభావం ప్రజలలో పడకుండా ప్రజలను నమ్మించే చర్యలకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమించింది. నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)కు కొనుగోలు చేస్తున్నదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శుక్రవారం రాజ్యసభకు తెలిపారు.రైతులకు కనీస మద్దతు ధర అంశంపై ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దీనిపై హామీ ఇచ్చారు.కనీస మద్దతు ధర సహా డిమాండ్ చార్టర్‌తో పాదయాత్ర కవాతు చేస్తూ రైతులు ఢిల్లీకి అడుగుపెడుతున్న రోజైన శుక్రవారం నాడు మంత్రి ఈ అంశంపై నొక్కిచెప్పారు. 'నేను మీ ద్వారా సభకు అన్నింటికీ భరోసా ఇవ్వాలని అనుకుంటున్నాను. రైతులు చేసిన ఉత్పత్తులన్నింటినీ కనీస మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం. ఇది మోదీ ప్రభుత్వం. మోదీ గ్యారంటీలను నెరవేర్చడానికి గ్యారంటీ ఇచ్చే ప్రభుత్వం' అని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజ్యసభకు చెప్పారు. అవతలి వైపు నుండి నా మిత్రులు అధికారంలో ఉన్నప్పుడు వారు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అంగీకరించలేదని వారు రికార్డులో పేర్కొన్నారు. ఉత్పత్తి వ్యయం కంటే 50శాతం ఎక్కువ మద్దతు ధర ఇచ్చినట్లు నా వద్ద రికార్డు ఉన్నది అని ఆయన తెలియజేశారు.ఆయన ఈ సందర్భంగా మాజీ కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కాంతి లాల్ భురియా, వ్యవసాయ మంత్రులు శరద్‌పవార్, కెవి.థామస్‌లకు మద్దతుగా చౌహాన్ తన మద్దతు పలికారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యాఖ్యలను విన్నటువంటి రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆయనను ఉద్దేశించి తన వాదనలను ధృవీకరించడానికి రికార్డు డాక్యుమెంట్లను తన ముందు ఉంచాలని కోరారు. దీనికి చౌహాన్ అంగీకరించారు. 'వారు రైతులను ఎన్నడూ గౌరవించలేదు. లాభదాయకమైన ధరల కోసం రైతులు చేస్తున్న డిమాండ్లను ఎన్నడూ తీవ్రంగా పరిగణించలేదు. నేను సభకు మీ ద్వారా హామీ ఇవ్వదలచుకున్నాను. 2019నుంచి రైతులకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభాన్ని ఇచ్చి కనీస మద్దతు ధరను లెక్కించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్ణయించుకున్నారని నేను సభకు మీ ద్వారా హామీ ఇవ్వాలనుకుంటున్నాను' అని మంత్రి శివరాజ్ సింగ్ పేర్కొన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఇప్పటికే రైతులకు రెమ్యునరేటివ్ ధరలను చెల్లిస్తోందన్నారు. వరి, గోధుమ, సోయాబీన్, జొన్నలను మూడేళ్ల క్రితం నాటినుంచి ఉత్పత్తి వ్యయం కంటే 50శాతం ఎక్కువ ధరను రైతులకు చెల్లిస్తున్నారని మంత్రి చెప్పారు. కనీస మద్దతు ధరపై కాంగ్రెస్ సభ్యుడు జైరామ్ రమేష్ ఆలోచనలు ఏమిటని శివరాజ్‌సింగ్‌చౌహాన్ ప్రశ్నించారు. 'నాకు మాత్రం కనీస మద్దతు ధరపై స్పష్టమైన ఆలోచన ఉన్నది. మేం కనీసమద్దతు ధరను 50శాతం కంటే ఎక్కువ లాభంతో కొనుగోలు చేసి రైతులకు కూడా చెల్లిస్తున్నాం' అని వివరించారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మీరెప్పుడైనా రైతుల ఉత్పత్తులను ఎంఎస్‌పికి కొనుగోలు చేసిన పాపానపోలేదని, మేం మాత్రం కనీస మద్దతు ధర కంటే ఎక్కువకే రైతుల ఉత్పత్తులకు చెల్లిస్తున్నామని తెలిపారు. కనీస మద్దతు ధర చెల్లించాలని రైతులు రక్తకన్నీరుతో మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని, మాకు మాత్రం రైతుకు సేవ చేయడం అంటే భగవాన్‌కు పూజచేయడం లాంటిదే అని వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ చెప్పారు. మంత్రి మాటలపై స్పందించిన జైరామ్ రమేష్ మాట్లాడుతూ రైతులకు కనీసమద్దతు ధర చెల్లిస్తున్నామని మంత్రి మాట్లాడుతున్నారని, రాజ్యసభకు చైర్మన్ హోదాలో ఉన్న మీరే మోదీ ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర చెల్లిస్తున్నారా? లేదా? అనే విషయమై వారితో స్వయంగా మాట్లాడితే బాగుంటుందని కోరారు. తాను వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి ప్రయాణించానని చైర్మన్ ధన్‌ఖడ్ చెప్పారు.



నేను మంత్రికి చెప్పాను. అంతేకాకుండా నాకు తెలిసిన 'లడ్డీ' అనే వ్యక్తి 'కిసాన్ కా లడ్లా' కూడా అవుతాడని నేను హామీ ఇచ్చాను. చాల శక్తిసంపన్నుడైన మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆయన పేరులోనే ఉన్నది 'శివరాజ్ 'అని, దానిని ఆయన సాధ్యం చేసి తీరుతారని ధన్‌ఖడ్ చెప్పారు. ఆర్‌జెడి ఎంపి జ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ఏర్పాటుచేసే విషయంలో ఏమైనా విధివిధానాలను రూపొందించే ఆలోచనలో ఉన్నదా? లేదా? అని అడిగిన ప్రశ్నకు మంత్రి శివరాజ్‌సింగ్ సమాధానమిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.బదులుగా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు కూడా తీసుకుంటోందని తెలియజేశారు. మోదీజీ ప్రభుత్వం దూరదృష్టితో పనిచేస్తోందని, ఉత్పత్తిని పెంచుతామని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తామని, రైతుల ఉత్పత్తులకు రెమ్యునరేటివ్ ధరలను కూడా అందిస్తామని, ఉత్పత్తిని నష్టపోయినప్పుడు నష్టపరిహారం అందించడం వల్ల ఉత్పత్తిలో వైవిధ్యంతను తెస్తుందని మంత్రి శివరాజ్ చెప్పారు. సహజవ్యసాయం వైపు మొగ్గు చూపేలా, రైతుల ఆదాయం అధికంగా పెరిగేలా మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని, తద్వారా రైతులు ఎలాంటి రుణమాఫీని పొందే స్థితిలో లేరని ఆయన సభకు స్పష్టం చేశారు.

# మణిపూర్‌లో పర్యటించండి

## శాంతిని నెలకొల్పండి : ప్రధానికి ఇండియా కూటమి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** గత సంవత్సర కాలంగా హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న మణిపూర్ రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటించాలని ఆ రాష్ట్రానికి చెందిన ఇండియా కూటమి పార్టీలు డిమాండ్ చేశాయి. ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని, మణిపూర్ ప్రజలతో చర్చలు జరపడం వల్లే శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొంటాయని పేర్కొన్నాయి. ఇండియా కూటమిలోని పది రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ప్రతినిధి బృందం శుక్రవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేసేందుకు అనుమతి నిరాకరించారన్నారు. ధర్నాకు అనుమతి కోరినప్పటికీ తిరస్కరించారని చెప్పారు. ఆందోళన చేసే తమ హక్కును అణిచివేశారని మండిపడ్డారు. అయినా ఇది తమకు ఎదురుదెబ్బ కాదని, వివిధ పద్ధతుల్లో తమ ఆందోళన కొనసాగిస్తామని మణిపూర్ కాంగ్రెస్ చీఫ్ కె. మేఘచంద్ర తెలిపారు. తమ డిమాండ్లకు సంబంధించిన మెమోరాండంను ప్రధాని మోదీకి సమర్పించామన్నారు. మణిపూర్ కూడా దేశంలో ఒక భాగమేనని, గత 18 నెలల నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల ఎందుకు నిర్లక్ష్యాన్ని వహిస్తుందని ప్రశ్నించారు. తాత్కాలికి శిబిరాల్లో దాదాపు 60 వేల మంది తల దాచుకుంటున్నారని, వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇంక ఎంతకాలం తాము ఇబ్బందులకు గురికావాలని మేఘచంద్ర నిలదీశారు. రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ శాంతి తీసుకురావాలని మణిపూర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర సర్కార్ ప్రత్యక్షంగా నియంత్రిస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి కాగితంపై వేసిన పులిలో వ్యవహరిస్తున్నారని, రాష్ట్రంలో అప్రకటిత రాష్ట్రపతి పాలన విధించినట్లుగా ఉందని మండిపడ్డారు. మణిపూర్‌లో కేంద్ర హోంశాఖే నేరుగా పరిస్థితులను నియంత్రిస్తుందన్నారు. మోదీ మణిపూర్‌లో పర్యటించకపోవడం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడకపోవడం ప్రధాని, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి ని దర్శనమని మండిపడ్డారు. చర్చలకు ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించకపోవడం దురదృష్టకరమన్నారు. 'మణిపూర్‌కు చెందిన ఇండియా కూటమి పార్టీలు రాష్ట్ర ప్రజల తరుపున తమ రాష్ట్రంలో పర్యటించాలని మిమ్మలను ఆహ్వానిస్తామని' ప్రధాని రాసిన లేఖలో కూటమి పార్టీలు పేర్కొన్నాయి. 'మే 3, 2023 నుండి మణిపూర్ ప్రజలు తమ నిస్సహాయ స్వరాన్ని వినిపించడానికి మీ రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఏడాది ముగిసేలోపు మణిపూర్‌లో పర్యటించాలని 10 పార్టీల నేతలు ప్రధానిని కోరారు. 'ఈ సంవత్సరం 2024 ముగిసేలోపు మణిపూర్‌ను సందర్శించడానికి సమయం లేకపోతే, మణిపూర్‌లోని అన్ని రాజకీయ పార్టీలను మీ కార్యాలయంలో లేదా న్యూఢిల్లీలోని అధికారిక నివాసంలో ఆహ్వానించవలసిందిగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము. మీరు ప్రధానమంత్రిగా ఉన్నందున, మీ ప్రత్యక్ష ప్రమేయం మణిపూర్ ప్రజలతో మీ మమేకమే మణిపూర్‌లో శాంతి, సాధారణ స్థితిని మాత్రమే తీసుకురాగలదని లేఖలో పేర్కొన్నారు.

# రాష్ట్రానికి 7 నవోదయాలు

## ఆంధ్రప్రదేశ్‌కు 8 కేంద్రీయ విద్యాలయాలు ప్రారంభించాలని కేంద్రమంత్రివర్గం నిర్ణయం




**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ విద్యాలయాలను ప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 8 కేంద్రీయ విద్యాలయాలు, తెలంగాణలో ఏడు నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ నూతన కేవీల ద్వారా దేశ వ్యాప్తంగా దాదాపు 82వేల మందికి పైగా విద్యార్థులకు ఉన్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య అందనుంది. తెలంగాణకు కొత్తగా 7 నవోదయ విద్యాలయాలను కేంద్రం ప్రకటించగా, జగిత్యాల, నిజామాబాద్, కొత్తగూడెం, మేడ్చల్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, సూర్యాపేటలో నవోదయా విద్యాలయాలను ఏర్పాటు చేయనుంది. అదే విధంగా ఎపిలోని అనకాపల్లి, చిత్తూరులోని వలసపల్లె, సత్యసాయి జిల్లాలోని పాలసముద్రం, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాళ్లపల్లె, రొంపిచర్ల, ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నందిగామ, నూజివీడు, నంద్యాల జిల్లాలోని డోన్‌లో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. 2025 – 26 నుంచి ఎనిమిదేళ్ల కాలంలో కొత్త కెవిల నిర్మాణానికి, కర్ణాటకలోని శివమొగ్గలో కెవిని విస్తరించేందుకు అంచనా వ్యయం రూ.5,872.08 కోట్లుగా నిర్ణయించారు. మాస్కో, కాఠ్మాండూ, టెహ్రాన్‌తో పాటు దేశ వ్యాప్తంగా 1,256 కెవిలు ఉండగా.. ఈ స్కూళ్లలో 13.56లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఢిల్లీ మెట్రో నాలుగో దశ ప్రాజెక్టు కింద 26.463 కి.మీల మేర రిథాలాకుండలి కారిడార్ కారిడార్ అభివృద్ధికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఢిల్లీ – హర్యానా మధ్య కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు రూ.6,230 కోట్ల వ్యయంతో చేపట్టబోయే ఈ కారిడార్‌ను నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS08UA 6252 | RAVINDER MALLURI | TATA ACE | 2016 |
| 2 | TS04UA 6336 | GUNDARAPU RAJU | TATA LPT 3118 CUMMINS FBT-T | 2015 |
| 3 | TS24T 2862 | HARISH SILIVERU | APE PICK UP XTRA LD | 2018 |
| 4 | AP36TA 3922 | MOIZUDDIN SYAD | TATA ACE | 2011 |
| 5 | TS03EF 3699 | VADDICHARLA NAGARAJU | CITY EMT DIESEL 5 SEATER | 2015 |
| 6 | TS07UF 9642 | NAMINDLA MAHESH | TATA ACE GOLD | 2018 |

AUCTION DATE 07-12-2024

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED,
H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Beside Guarduan Hospital, Opp : L B College, Mulugu Road , Cell : 9885526200 , 9700100937

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శనివారం, డిసెంబరు 07

## వడ్డీ రేట్ల తగ్గింపు కుదరదు : ఆర్‌బిఐ

జిడిపి వృద్ధిరేటు తిరోముఖంలో ఉన్నందున, ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహమిచ్చేందుకు వడ్డీరేట్లు తగ్గించాలని కొందరు ఆర్థికవేత్తలు, విధాన రూపకర్తలు చేస్తున్న డిమాండ్‌ను రిజర్వుబ్యాంక్ అంగీకరించలేదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం నియంత్రణకే దాని మానిటరీ విధానం ప్రాధాన్యం ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో వృద్ధిరేటు 5.4 శాతం మాత్రమే. తొలి త్రైమాసికం (ఏప్రిల్‌–జూన్)లో వృద్ధిరేటు 7.4శాతం. వస్తూత్పత్తి రంగంలో వృద్ధి 2.1శాతానికి దిగజారింది. అధిక వర్షాలవల్ల సిమెంటుకు డిమాండ్, ఉత్పత్తి రెండూ తగ్గాయి. అయితే వృద్ధిరేటు తీవ్రంగా 2 శాతం పడిపోవటానికి కారణాలను ఇంకనూ లోతుగా అంచనా వేయాల్సి ఉంది. అయితే కొందరు ఆర్థిక పండితులు వడ్డీరేట్లు హెచ్చుగా ఉన్నందున ఉత్పత్తి వ్యయం పెరుగుతోందని, అందువల్ల వడ్డీరేట్లు తగ్గించాలని, ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ధరలు పెరిగినా ఫరవాలేదన్నది వారి భావం. ఆహార పదార్థాల ధరలు హెచ్చు గా ఉండటంవల్లనే ద్రవ్యోల్బణ సూచీ ఆందోళనకరంగా కనిపిస్తోందని, అందువల్ల ద్రవ్యోల్బణం లెక్కకు తీసుకునే వస్తు సముదాయం(బాస్కెట్)నుండి ఆహార పదార్థాలను తొలగించాలని కూడా కొందరు సూచించారు. అత్యధిక జనాభా జీవనాన్ని ప్రభావితం చేసే ఆహార పదార్థాలను ద్రవ్యోల్బణ సూచీ బాస్కెట్ నుంచి తొలగిస్తే ద్రవ్యోల్బణ నిజరూపాన్ని మరుగుపరచవచ్చు. కాని జీవితాలను మెరుగుపరచగలరా? ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గుతాయనే పాత శుద్ధ డిమాండ్ – సరఫరా సిద్ధాంతం ఆ వాదనకు ప్రాతిపదిక కావచ్చు. అయితే రిజర్వుబ్యాంక్ మాత్రం శుక్రవారం ప్రకటించిన తాజా మానిటరీ విధాన సమీక్షలో ద్రవ్యోల్బణం నియంత్రణకు ప్రాధాన్యత కొనసాగిస్తూ, వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది.

ద్రవ్యోల్బణంలో పెరుగుదలను 4శాతం (2శాతం ఎక్కువ, తక్కువతో) వద్ద నియంత్రణలో ఉంచటం రిజర్వుబ్యాంక్ విధానం. అయితే ఈ సంవత్సరం ఇంతవరకు ఆందోళనకరంగా ఆపైనే నమోదవుతున్నది. వినిమయ వస్తువుల ధరల సూచీ (సిపిఐ)లో సగటు పెరుగుదల జులై–ఆగస్టులో 3.6శాతం కాగా, సెప్టెంబర్‌లో 5శాతానికి, అక్టోబర్‌లో 6.2శాతానికీ పెరిగింది. 2023 సెప్టెంబర్ నుండి పెరుగుదల తప్ప తిరోగమనం లేదు. కాగా ఆహార వస్తువుల ధరలు మరీ పెరుగుదలలో ఉన్నాయి. ఆ సూచీ సెప్టెంబర్‌లో 8.4శాతం కాగా అక్టోబర్‌లో 9.7శాతానికి చేరింది. జులై–ఆగస్టులో దాని సగటు 5.2శాతం. వినిమయ వస్తువుల ధరలు పెరుగుతూ కుటుంబ వంటింటి బడ్జెట్లు నెలనెలా పెరగటం సామాన్య కుటుంబాలన్నిటికీ అనుభవమే. సిపిఐ బాస్కెట్‌కు ఆహార పదార్థాల దోహదం 45.9శాతంగా ఉన్నందున, స్థూల ద్రవ్యోల్బణం జులై–ఆగస్టులోని సుమారు 68శాతం నుంచి అక్టోబర్‌లో 74శాతానికి చేరుకుంది. అన్ని రకాల కూరగాయలు, వంట నూనెలు, ముతకధాన్యాలు, పప్పులు, మాంసం, చేపలు, పండ్లు–ఒకటేమిటి అన్ని రకాల ఆహార పదార్థాల రేట్లు పెరిగాయి. ప్రస్తుత పంట, శీతాకాల కూరగాయలు మార్కెట్‌లోకి వచ్చేవరకు – అనగా వచ్చే మార్చి నెలాఖరు వరకు ధరలు పెరుగుదలలోనే ఉంటాయన్న అంచనాతో రిజర్వుబ్యాంక్ ముందు జాగ్రత్తగా వడ్డీరేట్ల తగ్గింపును తలపెట్టలేదు.

వచ్చే పండగల సీజన్‌లో వస్తువులకు పెరిగే గిరాకీ, గ్రామీణ కార్యకలాపాలు పుంజుకోవటంవల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని రిజర్వుబ్యాంక్ భావిస్తున్నది. ఖరీఫ్ పంట ఉత్పత్తి మంచిగా ఉండటం, రబీ సాగు మెరుగ్గా ఉండటం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుంది. పారిశ్రామిక కార్యకలాపాలు మెరుగవుతాయి. వర్షాకాలం ముగియటంతో సిమెంట్, ఇనుము, ఉక్కు రంగాలకు ప్రభుత్వ పెట్టుబడులవల్ల ప్రోత్సాహం లభిస్తుందని అంచనా. ఏదిఏమైనా, ఇప్పటికి పెరుగుతున్న ధరల విషయంలో శ్రద్ధ తీసుకుందామని రిజర్వుబ్యాంక్ నిర్ణయించింది. అధిక ధరలను అదుపులోకి తెచ్చాక, వృద్ధి గతిపై – అనగా వడ్డీ రేట్ల తగ్గింపు ఆలోచించుదామని ఆర్‌బిఐ భావించినట్లుంది.

# అలా విదేశీ పర్యటనలు..ఇలా ఒప్పందాలు

జనం కళ్లుమూసుకొని ఉన్నంత వరకు ఎవరేమనుకుంటే నాకేం అనుకొనే వాళ్లు రెచ్చిపోతూనే ఉంటారు. వివాదాస్పద కార్పొరేట్ అధిపతి అదానీ కంపెనీల అవకతవకల గురించి ఏ సంస్థ లేదా ఎవరైనా వెల్లడిస్తే వెంటనే బిజెపి, దాని అనుచరగణం, అమ్ముడు పోయిన మీడియా పెద్దలు కొందరు దేశ సార్వభౌమత్వం మీద జరుగుతున్న కుట్ర అంటూ గోలగోల చేస్తున్నారు. గట్టిగా నిలదీస్తే మాకు అధికారం రాకముందే అదానీ పెరిగాడు, అతనికీ మాకు సంబంధం ఏమిటి అని అడ్డంగా బిజెపి మాట్లాడుతుంది. అదానీ కంపెనీలు ఎప్పటినుంచో ఉన్నమాట నిజం, గత పదేండ్లలో అతని కంపెనీల విస్తరణను చూస్తే ''మోదానీ'' ని విడదీసి చూడలేము. తాజాగా అమెరికా న్యాయశాఖ, సెక్యూరిటీలు మరియు ఎక్స్ఛేంజ్ కమిషన్(సెక్) దాఖలు చేసిన కేసుల వెనుక కుట్ర ఉందని బిజెపి అంటోంది. అమెరికాలో కేసులు ఏమౌతాయి? ఏం జరుగుతుందో తెలియదు గానీ, కేసులు ఏమైనా అక్కడి మదుపుదార్లు మనదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తారు. అదానీ కంపెనీ ఇచ్చిన లేదా వాగ్దానం చేసిన 26.5కోట్ల డాలర్లు లేదా 2,200 కోట్ల రూపాయల ముడుపుల గురించి విచారణ జరిపేందుకు సుముఖత కేంద్ర ప్రభుత్వం నుంచి వెలువడలేదు. కొన్ని దేశాలు వెంటనే స్పందించిన తీరు చూస్తే మోదీ సర్కార్ మౌనం ఎందుకో ఊహించుకోవచ్చు.

నరేంద్రమోదీ విదేశాలలో మనదేశ ప్రతిష్ట పెంచేందుకు విరివిగా పర్యటనలు చేస్తున్నారు. ఎక్కడికి మోదీ వెళితే అక్కడ అదానీ ప్రత్యక్షం. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, గ్రీస్, మయన్మార్, ఇండోనేషి యా, ఇజ్రాయెల్, కెన్యా, టాంజానియా, నేపాల్, శ్రీలంక ఇలా అనేక ఉదంతాలు బహిరంగంగా తెలిసినవే ఉన్నాయి. అమెరికా కేసు ల గురించి తెలియగానే అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాల గురించి దర్యాప్తు జరపాలని ఆస్ట్రేలియాకు చెందిన బాబ్ బ్రౌన్ ఫౌండేషన్ తరపున అదానీ(పైనిఫూ) వాచ్ నిర్వహిస్తున్న సమన్వయకర్త జెఫ్ లా ఆ దేశ ప్రధాని అల్బనీస్‌కు విజ్ఞప్తి చేశాడు. ఆస్ట్రేలియాలో వాణిజ్య లావాదేవీలు నిర్వహిస్తూ పన్నులు ఎగవేసేందుకు లేదా నామమాత్రంగా చెల్లించేందుకు వీలుగా బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్ వంటి ''పన్నుల స్వర్గాల''లో కంపెనీలు ఏర్పాటు చేశారని, ఈ విషయాల్లో గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ ప్రముఖుడని హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడించిందని, అంతకు ముందు 2017లోనే ఆస్ట్రేలియా మీడియా సంస్థ ఎబిసి సందిగ్ధమైన అదానీ కంపెనీల గురించి బయటపెట్టిందని అన్నాడు.




గత ప్రభుత్వాలు 2009 నుంచి 2024వరకు కుదుర్చుకున్న వివిధ ఒప్పందాలు, వాటిమీద వచ్చిన అవినీతి ఆరోపణల గురించి సమీక్ష, దర్యాప్తు చేసేందుకు బంగ్లాదేశ్ ప్రభుత్వం విశ్రాంత హైకోర్టు జడ్జితో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. వీటిలో అదానీ కంపెనీతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలు కూడా ఉన్నాయి. వీటిలో మన దేశంలోని 1,234 మెగావాట్ల గొడ్డా బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు కూడా ఉంది. దీని నుంచి బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు ఒప్పందం కుదిరింది. ఇటీవల కేంద్రప్రభుత్వం సవరించిన చట్టం ప్రకారం ఎగుమతికి ఉద్దేశించి ఏర్పాటు చేసిన గొడ్డా విద్యుత్‌ను మన మార్కెట్లో కూడా విక్రయించుకొనేందుకు వీలు కల్పించింది. దీంతో బంగ్లాదేశ్ ఆందోళన వెల్లడించింది. ఇలాంటి విద్యుత్ ప్రాజెక్టు ప్రపంచంలో ఎక్కడా లేదు. బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్న జార్కండ్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ఉత్పత్తి మొత్తాన్ని బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేస్తారు. చిత్రం ఏమిటంటే దీనికి అవసరమయ్యే బొగ్గును తొమ్మిదివేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్ట్రేలియాలోని అదానీ గనుల నుంచి రవాణా చేసి ఒడిషాలోని అదానీ పోర్టుకు చేర్చి ఇక్కడ వినియోగిస్తారు. ఆ కేంద్రాన్ని బంగ్లాదేశ్‌లోనే నిర్మించవచ్చు. మనకు కాలుష్యాన్ని పంచి అదానీకి లాభాలు తెచ్చే ఈ ప్రాజెక్టును మోదీ సర్కార్ ఆమోదించింది. దీనికోసం ప్రత్యేకంగా రైలు మార్గాన్ని విస్తరించి అదానీకి అప్పగించింది. బంగ్లాదేశ్‌తో ఒప్పందం కుదిరిన తరువాత పన్నురాయితీలు ఇచ్చేందుకు ప్రత్యేక ఆర్థిక జోన్‌గా గుర్తింపు ఇచ్చింది. అదానీ కంపెనీకే ఎక్కువ లాభం కలిగే ఆ ప్రాజెక్టు వద్దని స్వదేశంలో వ్యతిరేకత వెల్లడైనా నాటి ప్రధాని హసీనా ఒప్పందం చేసుకున్నారు. బంగ్లాలో తయారయ్యే విద్యుత్ ధర కంటే ఐదు రెట్లు ఎక్కువ చెల్లించటంతో పాటు, విద్యుత్ ఉత్పత్తి చేయకపోయినా పాతికేండ్లలో 45కోట్ల డాలర్లను అదానీకి చెల్లించాల్సి ఉంటుంది. కొత్త ప్రభుత్వం దీన్ని సమీక్షిస్తామని ప్రకటించింది.

అదానీ కంపెనీలతో కుదుర్చుకున్న 250కోట్ల డాలర్ల విలువ గల ఒప్పందాలను రద్దుచేస్తూ కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రకటించాడు. అమెరికా కేసుల వార్త తెలియగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. వీటిలో జోమో కెన్యాట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండవ రన్‌వే, విద్యుత్ సరఫరా లైన్ల నిర్మాణం వంటివి ఉన్నాయి. ఈ లావాదేవీల గురించి తనకు దర్యాప్తు సంస్థలు, భాగస్వామ్య దేశా ల నుంచి వచ్చిన కొత్త సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రూటో చెప్పాడు. ఈ ఒప్పందాలలో పారదర్శకత లేదని, జనం సొమ్ము దుర్వినియోగం చేస్తున్నట్లు ప్రతిపక్షాలు, మీడియా ధ్వజమెత్తాయి. అదానీ కంపెనీల అక్రమాల గురించి హిండెన్‌బర్గ్ పరిశోధనా సంస్థ నివేదిక వెల్లడి తరువాత కూడా అధ్యక్షుడు రూటో ఒప్పందాలను గట్టిగా సమర్థించాడు. చిత్రం ఏమిటంటే అదానీతో ఒప్పందాలను రద్దు చేయనున్నట్లు ప్రకటించటానికి కొద్ది గంటల ముందు కెన్యా విద్యుత్ శాఖ మంత్రి ఓపియో వాండాయ్ పార్లమెంటు సభ్యులతో మాట్లాడుతూ ఒప్పందంలో ఎలాంటి అవినీతి లేదు గనుక విద్యుత్ లైన్ల నిర్మాణం ముందుకు సాగుతుందని ప్రకటించాడు. కెన్యా అధ్యక్షుడు రూటో 2023 డిసెంబరు ఐదున ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీని కలుసుకున్నారు. హైదరాబాద్ హౌస్‌లో వారి భేటీ సందర్భంగా అక్కడ గౌతమ్ అదానీ ప్రత్యక్షం. మోదీ–అదానీ మధ్య ఎంత సాన్నిహిత్యం లేకపోతే ఇద్దరు దేశాధినేతల మధ్య దూరగలరు ?

డిసెంబరులో మోదీ–రూటో భేటీ, మూడునెలలు తిరక్కుండానే ఈ ఏడాది మార్చినెలలో నైరోబీ విమానాశ్రయ రెండవ రన్‌వే ఏర్పాటుకు అదానీ కంపెనీ డిపిఆర్ సమర్పించటం వెంటనే ఆమోదం చకచకా జరిగిపోయాయి. అంతిమ ఒప్పందం మినహా ముప్పై సంవత్సరాల కౌలు అవగాహన, ఇతర నిబంధనల మీద ఏకీభావం కుదిరింది. దీనిమీద దేశంలో గగ్గోలుతో రూటో పరువు పోయింది. దాని వివరాలు బయటకు పొక్కనీయలేదు. జూలైనెలలో ఒక వ్యక్తి సామాజిక మాధ్యమంలో దీని గురించి పోస్టు పెట్టటంతో మరింత రచ్చయింది. సెప్టెంబరు పదకొండున విమానాశ్రయ సిబ్బంది ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా సమ్మె చేశారు. కౌలు గడువు ముగిసిన తరువాత 18శాతం వాటాను అదానీ కంపెనీకి ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటివి ఆరు రాయితీలు ఉన్నాయని, ఇతర విమానాశ్రయాల కాంట్రాక్టులు కూడా ఇచ్చేందుకు వీలు కల్పించే విధంగా ఒప్పందం ఉన్నట్లు బయటపడింది. విమానాశ్రయ విస్తరణ గురించి ఎలాంటి బహిరంగ ప్రకటన లేదు, అంతా గుట్టుగా జరిగింది. ఈ వ్యవహారం కోర్టుకు ఎక్కటంతో ఇంకా ఎలాంటి ఒప్పందం జరగలేదని ప్రభుత్వం చెప్పుకోవాల్సి వచ్చింది. అక్కడి సుప్రీం కోర్టు ఆ ఒప్పందాలను పక్కనబెట్టటంతో విధిలేక అధ్యక్షుడు రూటో రద్దు చేస్తున్నట్లు ప్రకటించక తప్పలేదు. తూర్పు ఆఫ్రికాలోని టాంజానియాలో బాగామోయో రేవు అభివృద్ధికి చైనా కంపెనీతో కుదిరిన అవగాహనను అక్కడి ప్రభుత్వం 2019లో రద్దు చేసుకుంది. ఆ రేవుతో పాటు మరో రెండు రేవులను అభివృద్ధి చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు అదానీ కంపెనీ, అబుదాబీ కంపెనీ, సంయుక్తంగా ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. 2023 అక్టోబరులో అధ్యక్షురాలు సమియా సులు హసన్ భారత సందర్శనకు వచ్చినపుడు మన దేశంతో అనేక ఒప్పందాలు కుదిరాయి. ఈ ఏడాది మే నెలలో అదానీ కంపెనీ టాంజానియా దారుసలామ్ రేవులో కంటెయినర్ జెట్టీని అభివృద్ధి చేసేందుకు 30 ఏండ్ల రాయితీ ఒప్పందం చేసుకుంది. విద్యుత్ లైన్ నిర్మాణం గురించి కూడా అదానీ కంపెనీ అమెరికా కంపెనీతో కలిసి చేపట్టేందు కు టాంజానియా సంప్రదింపులు జరుపుతోంది.

మయన్మార్‌లోని యంగూన్ రేవులో ఒక జెట్టీని అభివృద్ధి చేసేందు కు 2019లో కాంట్రాక్టు పొందినట్లు అదానీ కంపెనీ ప్రకటించింది. అంతకుముందు మయన్మార్ మిలిటరీ జనరల్ మిన్ అంగ్ లైయింగ్ తో గౌతమ్ అదానీ కుమారుడు కరన్ అదానీ భేటీ అయ్యాడు. సదరు అధికారి గుజరాత్‌లోని ముంద్రా రేవును సందర్శించాడు. ఆ సందర్భంగా మిలిటరీ జనరల్, అతనితో పాటు వచ్చిన అధికారులకు ''బహుమతులు'' ముట్టచెప్పారని వార్తలు వచ్చాయి. ఆ తరువాత అంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసి లైయింగ్ అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. నియంతలతో కూడా అదానీ తన కంపెనీల కోసం చేతులు కలిపారన్నది ఇక్కడ గమనించాల్సిన అంశం. తరువాత కాలంలో పశ్చిమ దేశాల ఆంక్షలు తీవ్రం కావటంతో ఆ రేవు ప్రాజెక్టు నుంచి వైదొలుగుతామని, పెట్టిన పెట్టుబడి 19.5 కోట్ల డాలర్లు ఇస్తే ఎవరికైనా విక్రయిస్తామని ప్రకటించింది. ఎవరూ ముందుకు రాకపోవటంతో 2023లో మూడు కోట్ల డాలర్లకే విక్రయించింది. తమకు 15.2కోట్ల డాలర్ల నష్టం వచ్చినట్లు పేర్కొన్నది.

శ్రీలంక ప్రభుత్వంతో గతంలో అదానీ కంపెనీ కుదుర్చుకున్న ఒప్పందాలను సమీక్షించనున్నట్లు ఇటీవల ఎన్నికైన అధ్యక్షుడు అనుర కుమార దిశన్నాయకే ప్రకటించాడు. ఈ మేరకు 44 కోట్ల డాలర్లతో తలపెట్టిన గాలిమరల విద్యుత్ ప్రాజెక్టు గురించి పునరాలోచించనున్నట్లు సుప్రీం కోర్టుకు ప్రభుత్వం నివేదించింది. భారత వత్తిడి కారణంగా గాలి మరల విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టినట్లు అక్కడి అధికారే స్వయంగా పార్లమెంటరీ కమిటీ ముందు వెల్లడించాడు, అతని ప్రాణానికి ముప్పురావటంతో ఆ ప్రకటనను వెనక్కు తీసుకున్నట్లు చెబుతున్నారు. అదానీకి కట్టబెట్టేందుకు పోటీ లేకుండా అక్కడి చట్టాన్నే మార్పించారు. మోదీ సర్కార్ దన్నుతో కొలంబో రేవులో సగం వాటాతో తూర్పు కంటెయినర్ జట్టీ అభివృద్ధి, నిర్వహణకు అదానీ రంగంలోకి దిగాడు. కీలకమైన ఆ ప్రాజెక్టు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని రేవు కార్మికులు, ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయి. ఇప్పుడు కొత్త ప్రభు త్వం వీటన్నింటినీ సమీక్షిస్తున్నందున ఏమవుతుందో చూడాలి.

ఎం. కోటేశ్వరరావు

# వలస జీవుల వెతలు

వ్యవసాయమే రైతుల జీవనాధారం. పంటలు పండించ డం తప్ప వేరే పనులు వారికి తెలియవు. దేశానికి తిండి పెట్టే రైతన్నలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, చేసిన అప్పులు తీర్చలేక, ఉన్న ఊరులో బతకలేక, ఆర్థిక భారాన్ని మోసుకుంటూ, భార్యా బిడ్డలతో పొట్ట చేతపట్టుకుని బతుకుతెరువుకోసం పట్టణాలకు వలసపోతున్నారు. ఇలా వలస వెళ్ళే వారిలో రైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉంటున్నారు. పూలు అమ్మినచోటే కట్టెలు అమ్మలేక ఆత్మగౌరవం చంపుకుని బంధువుల ముందు బతకలేని దుస్థితి వారిది. పనులకోసం పట్నం వలస వచ్చి అడ్డామీద కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. కాలాలు, రుతువుల్లో వచ్చిన మార్పును బట్టి ఫ్లెమింగ్ లాంటి పక్షులు కూడా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మన వలస కూలీలు లాగానే అవి కూడా వలస పోతుంటాయి. ఇవి ఆహారం కోసం మరియు తమను తాము పరిస్థితుల నుంచి రక్షించుకోవటానికి వలస వెళుతుంటాయి. ఈ ప్రయత్నంలో కొన్ని మార్గమధ్యంలోనే చనిపోతుంటాయి. రాజకీయ నాయకులు కూడా ఒక పార్టీ నుండి మరో పార్టీకి వారి అవసరాల కోసం వలస వెళుతుంటారు. వీరు కూడా మన వలస కూలీలు, వలస పక్షుల్లాంటి వారే. పక్షులు, కూలీలు వలస వెళ్ళేది మేతకోసం అయితే, రాజకీయ నాయకులు వెళ్ళేది మాత్రం వారి మేసింది దాచుకోవటానికి. పైన చెప్పిన వలస జీవులది జీవన పోరాటం. రాజకీయ వలస వాదులది ఆస్తులు కాపాడుకునే ఆరాటం. కాని రెండూ ఒకటి కాదు. మన రాష్ట్రంలో నల్గొండ, మెదక్, మహబూబ్ నగర్, రంగారెడ్డి తదితర జిల్లాల నుండి హైదరాబాద్ నగరంతో పాటు దేశంలోని ఇతర నగరాలకు కూలీలు వలసపోతున్నారు. వలసపోయి న కార్మికులకు ప్రతిరోజూ పని దొరకదు. నెలలో వారికి పని దొరికేది కేవలం పదిహేను రోజులే. మిగిలిన రోజులు పని లేక పస్తులుంటున్నారు. దీనికి ఉదాహరణ మల్లన్న సాగర్ నిర్వాసితులైన రైతు కుటుంబాలే. ఉదయం 6 గంటలకు లేబర్ అడ్డా మీదకు వెళ్ళి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎవరైనా పని ఇస్తారేమోనని ఎదురు చూస్తుంటారు. ఒక్కొక్క అడ్డామీద సుమారు 300 మంది పనులకోసం పడిగాపులు కాస్తుంటారు. పని దొరికితే సంతోషం, లేదంటే 5 రూపాయల భోజనంతో కడుపు నింపుకుంటున్నారు. అన్ని అడ్డాల దగ్గర ఈ సౌకర్యం లేదు. ఈ రైతు కూలీలతో పాటు వారి భార్యాబిడ్డలు కూడా కూలీ పనికోసం ఎదురు చూస్తున్నారు. రోజు కూలీ మగవారికైతే 800, మహిళలకైతే 600చొప్పున యజమానులు చెల్లిస్తుంటారు. ఎకరం, 2 ఎకరాలు ఉన్న రైతులు కూడా బతుకు బండి లాగటానికి వలస కూలీలుగా అవతారమెత్తాల్సి న దుస్థితి ఏర్పడింది. అతివృష్టి, అనావృష్టులతో పంటలు పండక, పండిన పంటలు వరద ముంపుకు గురవడం, అప్పులు తెచ్చి బోర్లు వేయించినా నీళ్ళు పడకపోవడంతో ఏం చేయాలో పాలుపోక గోస పడుతున్నారు. అన్నదాతలు. కొందరు మహిళలకి అడ్డామీద పనులు దొరకక ఇళ్ళల్లో పనిమనుషులుగా మారుతున్నారు. కొందరు మహిళలపై పని ప్రదేశంలో లైంగిక దాడులు జరుగుతున్నాయి. మరికొంతమంది అఘాయిత్యాలకు గురై హత్య చేయబడుతున్నారు. నాగర్ కర్నూల్‌లో ఓ మహిళా కూలీపై అత్యాచారం జరిగి, హత్యకు గురైన విషయం వార్తాపత్రికల్లో చూశాం. వికారాబాద్‌లో ఓ సైకో కిల్లర్ చేతి లో రోజువారీ మహిళా కూలీ హత్య చేయబడింది. ఇలాంటి నేరాలు, ఘోరా లు ప్రతిరోజూ ఎక్కడో ఓ మూల జరుగుతూనే ఉన్నాయి. గత 10 సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోతోంది. భూముల రేట్లు



ఆకాశాన్నంటుతున్నాయి. మారుమూల ప్రాంతా ల్లో కూడా ఎకరం కోటి రూపాయలు పైన ధర పలకడంతో అనేకమంది రైతులు తమ భూములను అమ్ముకొని వారి పొలాలలోనే వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. బహుళ జాతి సంస్థలు, బడా వ్యాపారవేత్తలు, రియల్టర్లు, రైతుల భూములపై కన్నేయడంతో యజమానిగా ఉన్న రైతు.. కూలీగా మారాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులను, వ్యవసాయ కూలీలను ఓటు బ్యాంకు గా చూస్తున్న పార్టీలు, ఎన్నికలైన తరువాత వారి సమస్యలు పట్టించుకోవడం లేదు. దేశానికి అన్నం పెట్టే అన్నదాత అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల పచ్చటి పొలాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారిపోతున్నాయి. దాని వల్ల వాతావర ణం వేడెక్కి పర్యావరణం సమతుల్యత దెబ్బ తింటుంది. గ్లోబల్ వార్మింగ్ వల్ల ప్రకృతి విధ్వంసమై మానవాళికి ప్రమాదం జరుగుతుందని స్టీఫెన్ హాకింగ్ లాంటి భౌతిక శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. వ్యవసాయ భూముల్లో ఆకాశ హర్మ్యాల నిర్మాణంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి రైతన్న చేయలేక పోతున్నాడు. ఫలితంగా దళారులు కృత్రిమ కొరత సృష్టించడం వల్ల దేశ ఎకానమీ దెబ్బ తింటోంది. ప్రభుత్వపరంగా కూడా కార్మిక శాఖ నుండి కూలీల కోసం కొన్ని సౌకర్యాలు కల్పించినా, ఆ విషయాలు చాలామంది కూలీలకు తెలియవు. కారణం నిరక్షరాస్యతే. రోజువారీ అడ్డమీద కూలీగా పనికి వెళ్ళేవారు 110 రూపాయలు మీ సేవలో చెల్లించి తమ పేరును రిజిస్టర్ చేసుకుని లేబర్ కార్డు పొందవచ్చు. ఈ కార్డు ఉన్నవారు ప్రమాదవశాత్తు మరణిస్తే 6,00,000, సహజ మరణం పొందితే 1,00,000 రూపాయలు పొందే వెసులుబాటు ఉంది. అంతేకాకుండా వారి కూతుర్ల పెళ్ళికి 30,000 రూపాయలు కార్మిక శాఖ నుండి ఇచ్చే సౌకర్యం కల్పించబడింది. గ్రామాల నుండి తాత్కాలిక జీవనోపాధి కోసం నగరాలకు వలస వచ్చినవారు రోజు కూలీ కోసం వెతుక్కుంటున్నారే తప్ప సౌకర్యాల గురించి ఆలోచిస్తున్నట్లు కనిపించదు. రోజువారీ కూలీ ల్లో అలజడి రేగినా, వారు సమ్మెలు చేసిన సందర్భాలలో చిన్న చిన్న పరిశ్రమ లు మూసివేతలకు గురవుతున్నాయి. ఆ పరిశ్రమల్లో పనిచేస్తున్న రోజువారీ కూలీలు వారి జీవనోపాధి కోసం వలస కూలీలుగా మారిపోవటం బాధాకరం. రాజన్న సిరిసిల్లా జిల్లాలోని టెక్స్ టైల్ పార్కులో ఉన్న ఇండస్ట్రీని మూసివేసినప్పుడు కార్మికులు రోడ్లమీదికి వచ్చి నిరసన తెలపడం జరిగింది. ఆ కార్మికులే తదుపరి లేబర్ అడ్డాల వద్ద రోజువారీ కూలీలుగా మారిపోయారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి కూడా అనేక మంది వలస వచ్చి భవన నిర్మాణ కూలీలుగాను, హోటళ్ళలో పనిచేసేవారిగానో, సెక్యూరిటీ సిబ్బంది గానో తమ జీవనం గడుపుతున్నారు. వలస కూలీల బ్రతుకులకు ఏమాత్రం భద్రత లేదు. ప్రభుత్వాలు కూడా ఈ కూలీల భద్రతకోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతన్న కన్నీరు కార్చిన ఏ దేశం కూడా బాగుపడిన దాఖలాలు లేవు. ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ లాంటి పైపూతలు పూస్తున్నారే తప్ప వారు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడం, దళారీలు లేకుండా వారి పంటలు వారే విపణి వీధుల్లో అమ్ముకోవడం లాంటి అవకాశాలు కల్పిస్తే వారి బతుకు లు బాగుపడటమే కాకుండా ఆర్థికంగానే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాల ను నడిపిస్తున్న రాజకీయ పార్టీలు 'సొంత లాభం కొంత మానుకొని పొరుగువాడికి తోడుపడవోయ్' అన్న గురజాడ వాక్యాన్ని గుర్తు పెట్టుకుని వలస జీవుల్ని ఆదుకునే దిశగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

ఎస్. బాబు, అధ్యక్షులు
టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్

# దేశ రక్షణకు కంకణం

సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు ఏడవ తేదిన జరుపుకుంటారు. సాయుధ దళాలు దేశరక్షణ కొరకు అహర్నిశలు చేయుచున్న కృషి, శత్రువుల బారినుండి దేశాన్ని రక్షిస్తూ వారుచేసిన త్యాగా లు గుర్తు చేసుకుంటూ వారు, వారి కుటుంబాలకు మనం అండగా ఉన్నట్లు తెలియచేయుట ఈ దినోత్సవం ప్రాముఖ్యత.

1949లో రక్షణ మంత్రి కమిటీ పతాకదినోత్సవం ప్రతి ఏటా డిసెంబరు 7న జరుపుకోవాలని నిర్ణయించారు. మన భారత సైన్యం, వైమానిక దళం, నావికా దళం దేశసరిహద్దులను కాపాడటమే కాకుండా దేశంలో అంతర్గతంగా జరిగే అనేక విపత్కర పరిస్థితులను చక్క దిద్దడంలో ముఖ్య పాత్ర పోషిస్తూ దేశ ప్రజల ధన, మాన ప్రాణాలను రక్షించడంలో సాయుధ ధళాలు ముందు వుంటారు. వివిధ రాష్ట్రాలలో వచ్చిన వరదలు, భూకంపాలలో వేలమంది ప్రజలు కొండలు, గుట్టల్లో చిక్కుకున్నపుడు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండ వారిని కాపాడి సురక్షిత స్థలాలకు చేర్చడం లో వారి పాత్ర ఎనలేనిది. పలుచోట్ల జరిగిన ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టుచూ వేలమంది ప్రజలను రక్షిస్తూ వీరమరణం పొందిన విషయం కూడా మనందరికీ తెలుసు. ఎరుపు, లోతైన నీలం, కాంతి నీలం రంగుల్లో టోకెన్ జెండా లు, కారు జెండాలు విరాళాలు ప్రతిఫలం గా కేంద్రీయ సైనిక్ బోర్డు ద్వారా రాజ్యసభ, జిల్లా సైనిక్ బోర్డ్ ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తారు. దేశరక్షణకోసం పోరాడే సైనిక సిబ్బంది కుటుంబీకులు, వారిపై ఆధారపడి జీవించేవారి పరిరక్షణ గురించి పట్టించుకోవాల్సిన బాధ్యత సాధారణ ప్రజలు పాలు పంచుకోవాలనే ఉద్దేశముతో విరాళాలు వసూలు చేస్తున్న దృష్ట్యా ఫ్లాగ్ డేకు అత్యధిక ప్రాధాన్యత లభించింది. ఫ్లాగ్ డే ప్రధానంగా మూడు ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుంటుంది.

1.యుద్ధంలో గాయపడినవారికి పునరావాసం కల్పించడం,
2.సర్వీసులో గల సిబ్బంది, వారి కుటుంబీకుల సంక్షేమం.
3. మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబీకుల సంక్షేమం. పునర్నివాసము కల్పించడం,




సైనిక సంక్షేమ శాఖ అమరవీరుల కుటుంబాలు, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా స్థాపించబడింది. ఈ శాఖ రాష్ట్రంలో హోం శాఖ ఆధ్వర్యం లో పనిచేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరుపున అందించే అన్ని రాయితీలను వారికి సక్రమముగా చేర్చుట కొరకు ఈ శాఖ ప్రత్యేకంగా కృషి చేస్తుంది.

ఇలాంటి వీర సైనికుల సంక్షేమం చూడటం మన వంతు బాధ్యత వారికి, వారి కుటుంబాలకు సహాయం చేయడం మన ప్రజల కర్తవ్యం. ఇందుకోసం సాయుధ ధళాల పతాక దినోత్సవ నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసారు. ఈ నిధికి గవర్నర్ చైర్మన్‌గా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వైస్ చైర్మన్‌గా, సంచాలకులు, సైనిక సంక్షేమ శాఖ వారు సెక్రటరీగా ఇంకా అనేకమంది సైనిక అధికార్లు, ప్రభుత్వఅధికార్లు మెంబర్లుగా వ్యవహరిస్తారు. ఈ నిధి నుండి మాజీ సైనికులకు, వితంతువులకు, వారిపై ఆధారపడిన వారికి ఆర్థిక సహాయం అందిస్తారు.

సంక్షేమ నిధుల్ని 1993లో రక్షణమంత్రిత్వ శాఖ 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్' గా మార్చింది. ఇతరత్రా నిధులు కూడా దీనిలో కలిసి ఉంటాయి. ఇందుకోసం సాయుధ దళాల పతాక దినోత్సవం డిసెంబరు మాసంలో జరుపుకొని సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు ప్రజల వద్దనుండి సేకరిస్తారు. ఇందుకోసంగాను స్టిక్కర్ ఫ్లాగ్, కార్ ఫ్లాగ్ లను ప్రజలకు అందచేసి వారినుండి విరాళాలను సేకరిస్తుంది, కొన్ని హుండీ డబ్బాల ను వివిధ విద్యాలయాలకు, కార్యాలయాలకు పంపి వాటి ద్వారా కూడా విరాళాలు స్వీకరిస్తారు. భారతదేశ రక్షణలో సాయుధ దళాల పనితీరు అమోఘం. అజరామరం. అమరులైన వారికి నివాళులు అర్పిద్దాం. సాయుధ దళాల కీర్తిని దశ దిశన వ్యాప్తి చేద్దాం. వారిని ఉన్నతంగా గౌరవిద్దాం.

కామిడి సతీష్ రెడ్డి,
9848445134.

# గిరిజన సాంప్రదాయాలకు పునర్వైభవం రావాలి

తెలంగాణలో సుసంపన్నమైన జానపద గిరిజన సంగీతాన్ని ప్రపంచవ్యాప్తం చేయడానికి సంగీత కచేరీని పెద్ద ఎత్తున తెలంగాణ సాంస్కృతిక సారథి ఏర్పాటు చేస్తుంది. తెలంగాణ ప్రాంతం విభిన్న సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించడానికి ఇది అద్భుతమైన మార్గం. ఈ కచేరీలో తెలంగాణలోని వివిధ వర్గాల నుండి ప్రతిభావంతులైన జానపద, గిరిజన సంగీత కళాకారులు ప్రజావేదిక ద్వారా ప్రదర్శిస్తారు, అంతరించిపోతున్న కళలు, ప్రత్యేక సంగీత సంప్రదాయాలు, వాయిద్యాలను హైలైట్ చేస్తుంది. వేదికను తెలంగాణ సాంప్రదాయ మూలాంశాలతో, అలంకారాలతో అలంకరించి మ్యూజియం ఏర్పాటు చేస్తుంది. తెలంగాణ లంబాడీ, గుస్సాడి, డప్పు, కోలాటం, పేరిణి వంటి విభిన్న జానపద కళా ప్రక్రియలకు ప్రసిద్ధి చెందింది. ఈ రూపాలను గోండ్, కోయా మారియా వంటి గిరిజన సంగీత శైలులతో పాటు ప్రదర్శించాలి. ప్రతి ప్రదర్శన ఆయా వర్గాల ప్రత్యేక లయలు, శ్రావ్యత నృత్య రూపాల్లో ఒక సంగ్రహావలోకనం అందిస్తుంది. కచేరీ జానపద మరియు గిరిజన సంగీతకారుల మధ్య సహకారాన్ని కూడా కలిగి ఉంటుంది, వారి విభిన్న శైలుల యొక్క అందమైన కలయికను అనుమతిస్తుంది. ఈ ఏకీకరణ తెలంగాణ సంగీతంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించడమే కాకుండా వివిధ వర్గాల మధ్య ఐక్యత సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తుం ది. ఇది లీనమయ్యే అనుభూతిని సృష్టిస్తుంది, ప్రేక్షకులు జానపద సంగీతం సంస్కృతితో మరింత లోతుగా కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. ప్రతి ప్రదర్శనకు ముందు సంక్షిప్త కథనా లు లేదా పరిచయాలను చేర్చడం అర్థవంతంగా ఉంటుంది, ఇక్కడ సంగీతకారులు వారి సంగీతం యొక్క చారిత్రక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యతపై అంతర్దృష్టు



లను పంచుకోవచ్చు. ఇది తెలంగాణ విశిష్ట సంగీత సంప్రదాయాలపై ప్రేక్షకులకు అవగాహన ప్రశంసలను పెంచుతుంది. బుర్ర వీణ తెలంగాణకు ప్రత్యేకమైన తంత్ర వాయిద్యం, ఇది త్వరలో అంతరించిపోవచ్చు. నారాయణ పేట జిల్లాలోని దామరగిద్ద గ్రామానికి చెందిన దాసరి కొండప్ప వాయించగల చివరి సంగీత విద్వాంసుడు. కొండప్ప కూడా బుర్రవీణతో పాటలు పాడు తూ కథలు చెబుతూ జీవనం సాగించేవాడు. 'బుర్ర వీణ 'భూమి వీణ' మరియు గిరిజనుల 'విల్లాడి వద్యాలు' (విల్లు తీగతో వాయించే వాయిద్యం)కి సంబంధించినది. బుర్ర వీణ వాయించగల ఏకైక సజీవ మానవుడు కొండప్ప. తెలంగాణలో చిన్న చిన్న జలదరింపు గంటలతో వాయించి, 24 శబ్దాలను వినిపించగలరు, తాను వాయించే రాగాలను వదిలేయగలడు. 'బుర్ర వీణని సమాజంలోకి తీసుకుదానికి అడ్డంకి దాసరి కొండప్ప కులం కావచ్చు. అతను మాల దాసరి (దళితుడు.) అందుకే ప్రజలు తన వద్దకు రాకపోవడానికి కారణం. షెహనాయి ఒక సంగీత వాయిద్యం, ఇది భారత ఉపఖండం నుండి ఉద్భవించింది. కిక్రి అనేది ఖోన్ అని పిలువబడే విల్లుతో వాయించే ఒక సున్నితమైన గోండ్ వాయిద్యం, దీని తయారీలో చెట్టు కాండంపై రంధ్రం చేసి మేక చర్మంతో కప్పి చతురస్రాకారపు రెసొనేటర్ను తయారు చేయడం చాలా శ్రమతో కూడుకున్న ప్రక్రియ. ఒకసారి అందులో వెదురు ముక్కను అమర్చారు, పూటీలు అని పిలువబడే మూడు రంధ్రాలలో చెక్క కర్రలు వేయబడతాయి. ఇది మధురమైన ధ్వనిని సృష్టిస్తుంది.

డా జి. వెన్నెల గద్దర్,
8374057569

# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

* ఆడబిడ్డ వైద్యానికి అందించే ఆర్థిక సాయం
* స్వాగతించే పథకాలు
* కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
* రూ.2.15కోట్ల విలువ చేసే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ
* సిఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.40.50లక్షల విలువ చేసే చెక్కులు అందించిన ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపలి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద వర్గాలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు లబ్ధిదారులకు సూచించారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కొత్త గూడెం మున్సిపాలిటీ, లక్ష్మీ దేవిపల్లి,చుంచుపల్లి, సుజాతనగర్ మండలా లకు చెందిన 215మంది లబ్ధిదారరులు రూ.2.15కోట్లు విలువ చేసే కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, అదేవిధంగా 110మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.40.50లక్షలు విలువ చేసే చెక్కు లను శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అందజేశారు. నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా కూనంనేని మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ఆడ బిడ్డలు ఉన్న పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందని, ఆడపిల్లలకు వివాహం చేయడం భారంగా మారుతున్న ప్రస్తుత రోజుల్లో ఈ పథకం తల్లి దండ్రులకు ధైర్యాన్ని అందిస్తుందన్నారు. ఎన్నికల వాగ్దానం మేరకు తులం బంగారం పాత, కొత్త లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. అత్య వసర పరిస్థితిలో వైద్యం చేయించుకున్న తర్వాత అందించే సిఎం రిలీఫ్‌ఫండ్ పరిమితిని ఎత్తివేసి పూర్తిస్థాయిలో చేసిన ఖర్చును అందించాలని కోరారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అదేవిధంగా సిఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులో సాంకేతిక సమస్యల వలన చాలా జాప్యం జరుగుతుందని, దీనిని అదిగ మించే చర్యలకు ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు, ఆసుపత్రి యాజమా న్యాలు పూనుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ మధు, తహసీల్దార్‌లు పుల్లయ్య, కృష్ణ, ప్రసాద్, మున్సిపాల్ చైర్‌పర్సన్, కాపు సీతా లక్ష్మి, కమీషనర్ శేషాంజన్‌స్వామి, మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ షేక్ సాబీ ర్‌పాషా, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, నాయకులు చంద్రగిరి శ్రీనివాస రావు, స్థానిక కౌన్సిలర్ ధర్మరాజు, పలువురు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## లైంగిక దాడి కేసులో పదేళ్లు జైలు శిక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నింది తుడు బానోత్ దీప్లాకు పదేళ్లు జైలుశిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ ఖ మ్మంజిల్లా ఫోక్స్ 2 ఇంచార్జి న్యాయాధికారి కె. ఉమాదేవి శుక్రవారం తీర్పు నిచ్చారు. కేసు వివరాల్లోకి వెళితే... 2021 ఆగస్టు 25న దీప్లా మైనర్ బాలి కకు మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకునిపోయి లైంగిక దాడికి పాల్ప డ్డాడని నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి బంధువులు ఫిర్యాదు చే శారు. ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసిన పోలీసులు అ రెస్టు చేసి చా ర్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నే రం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎండి ఇర్షాద్ , లైజన్ అధికారిగా శ్రీనివాస్, హోంగార్డ్ చిట్టిబాబు సహకరి ంచారు.

## అదనపు గదుల నిర్మాణానికి రూ కోటి 80లక్షలు

శంకుస్థాపన చేసిన ఎంఎల్ఎ పాయం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల పరిధిలోని అనంతోగు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ 1 కోటి 80లక్షల అంచనాతో నూతన పాఠశాల అదనపు గదులకు శుక్రవారం ఎంఎల్ఏ పాయం వెంక టేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరూ, శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యా ర్థులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తూ పెద్దపీట వేసిందని , ఈ పాఠశా లలో తరగతి గదులు భారపడటంతో నూతన అదనపు తరగతి గదులను కొరకు సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ 1కోటి80లక్షల నిధులు మంజూరు చేశానని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువు చదివి మంచి ఉద్యోగాలు సాధించి కుటుంబానికి దేశానికి ఆదర్శంగా నిలవాలని తెలి పారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాయం నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

## కూసుమంచి పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఓ

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రజాపక్షం దినపత్రిక కథనం శుక్రవారం నాడు ప్రచురితం కాగా (కూసుమంచి పిహెచ్‌సిలో కిష్కిందకాండ ) అదే రోజు వెంటనే స్పందించిన ఖమ్మం జిల్లా మెడికల్ ఆఫీసర్ కళావతి భాయ్ శుక్ర వారం మధ్యాహ్నం కూసుమంచి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న అధికారులు సిబ్బంది మధ్య ఉన్న పలు రకాల తగాదాలు ఇంకా వివిధ విషయాలను పని పద్ధతులు మొదలైన అంశాలు సిబ్బందితో మాట్లాడారు. పల్లె దా వ ఖానా డబ్బులు పర్మిషన్ లేకుండా డ్రా చేసిన డబ్బులకు సంబంధించి మరికొద్ది రోజుల్లో స్పష్టత రానున్నది.

## అదనపు భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఉన్నటు వంటి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల కళాశాల ప్రాంగణంలో అదనపు భవనమును నిర్మించుట కొరకు శంకుస్థాపన కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శిలాఫలకం ముందు కొబ్బరికాయను కొట్టి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అన్ని గురుకులాలు విద్యాసం స్థలు అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వం ఇచ్చే విద్యార్థులకు ఇచ్చేటువంటి అన్ని వసతులను సౌకర్యాలను అవకాశాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో కూడిన విద్యను అందిపుచ్చుకొని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను ఎదగాలని విద్యార్థినిలకు తగు సూచనలు సలహాలు చేశారు. ఈకార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల డిఇసిఒ అన్నామని మండల విద్యాశాఖ అధికారి ఆనంద్, ఏఈ దుర్గప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వర్లు, బాణావతు భీముడు, మండల నాయకులు అధ్యక్షులు వేముల నరేష్, యువజన నాయకులు నాగేంద్ర బాబు, వేణు, పూర్ణ, రాజాలాలు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో విద్యార్థులతో పనులు!



**ప్రజాపక్షం/పాల్వంచ:** మండల పరిధిలోని లక్ష్మీ దేవిపల్లి గ్రామంలో గల బాలుర సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులతో గత నాలుగు రోజులు పనులు చేయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జాతీయ రహదారి పక్కనే గురుకులం ఉండటంతో ప్రహరీ గోడ వెంబడి భారీగా పెరిగిన ముళ్ల కంపలు, చెట్ల కొమ్మలను తొలగించారు. రోజు ఉదయం నుండి మధ్యహ్న వరకు విద్యార్థులు తరగతులను వదిలి పనులు చేయడం జరుగుతుందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈవిషయంపై ఆశాఖ అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వెచ్చి చూడాలి.

## ఆమరణ నిరాహార దీక్షకు దిగుతాం

వివిధ కుల సంఘాల నాయకులు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు అక్రమాలకు గురికాకుండా మండల ప్రజల ప్రయోజ నాల కొరకు సర్వే చేసి హద్దులు నిర్మించాలని రెవెన్యూ అధికారులకు, ఇరి గేషన్ అధికారులకు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని బి.ఎస్.పి పార్టీ వివిధ కుల సంఘాల నాయకులు శుక్ర వారం జూలూరుపాడు తహశీల్దార్ కార్యాలయం ముందు శాంతియుత దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు కానీ ఇరిగేషన్ అధికారులు కానీ స్పష్టమైన హామీ ఇచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వని పక్షంలో ఆమరణ నిరా హార దీక్షకు కూర్చుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భార తీయ గోర్ బంజర పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు భానోత్ దుర్గ ప్రసాద్ నాయక్, బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు, సురేష్ నాయక్, హతిరాం నాయక్, రాము నాయక్, రాజు, లాలూ నాయక్, హర్ష నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దీక్ష శిబి రంలోనే ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

## కలెక్టర్ గారూ... జర న్యాయం చేయండి

బిళ్ల కంటి రాములు మొర



**ప్రజాపక్షం/మధిర:** ఆనాటి నిజాం కాలంలో తాలూకాగా ఉన్న మధిర గ్రామపంచాయతీలోని ప్రధాన రైల్వే గేటు మెయిన్ రోడ్డు పక్కన బిళ్లకంటి రాములు మొట్టమొదటగా రెండు అంతస్థుల డాబా కట్టి హోటల్ నిర్వహించగా బిళ్ల కంటి రాములు హోటల్ అంటే ఆనాటి వారికి తెలియని వారు ఎవరూ ఉండరు. బిళ్లకంటి రాములు సొంత తమ్ముడు బిళ్ల కంటి లక్ష్మ య్య కుమారుడు వారసుడైన బిళ్లకంటి నాగేశ్వర రావు అనలో 21గజాలు కలిగిన రెండు గదుల ఆస్తిని మాత్రమే ఇచ్చారు. రిజిస్ట్రేషన్ హక్కు కలిగిన ఈ రెండు గదు లను బిళ్లకంటి నాగేశ్వరరావు గత కొన్నేళ్లుగా షాపులుగా కొన సాగించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రధాన దక్షిణ మధ్య రైల్వే ట్రాక్‌కు పక్కన ఉండటంతో ఇటీవల రైల్వే మూడవలైన్ కోసం నలుగురు వాటాదారులుగా ఉన్న డాబాలో బంధువులైన ముగ్గురు వాటాదారులకు చెందిన కొంత స్థలాన్ని తీసుకుని స్థలంతో పాటు పాత బిల్డింగ్ కావ టంతో పడిపోయే ప్రమాదం ఉందని బిల్డింగ్ మొత్తాన్ని రైల్వే అధికారులు నష్టపరిహారం చెల్లించారు. ఈ డాబాలో రిజిస్ట్రే షన్ హక్కు కలిగిన నాల్గొవ వాటాదా రునిగా ఉన్న నాకు బిల్డింగ్ మొత్తానికి చెల్లించిన నగదులో 21గజాల గల రెండు గదులకు రావాల్సిన నష్టపరిహా రాన్ని బంధువులైన ముగ్గురు వాటా దారులు ఇవ్వకుండా పంచుకున్నా రని, బిల్డింగ్ మొత్తం మాదే అని వారి వద్ద ఉన్న పాత రిజిస్ట్రేషన్ దస్తావేజులను సర్వేకు వచ్చిన అధి కారులకు చూపిస్తూ నోటీసులు రాకుండా, నాకు ఎటువంటి విషయాలను తెలియకుండా జాగ్రత్త పడి అధికారులను తప్పుదొవ్వ పట్టించి నాకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహా రాన్ని కాజేసి నా కుటుంబాన్ని రోడ్డు మీద పడేలా చేసి తీవ్ర అన్యాయం చేశారని బాధితుడు నాగేశ్వరరావు తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల డాబాను తొలగించేందుకు రైల్వే అధి కారులు మార్కింగ్ చేసి స్వాధీనం చేసుకోగా ఈవిషయం తెలుసుకుని ముగ్గురు వాటాదారులను అడుగగా మాకు ఎటు వంటి సంబంధం లేదని చెప్పుతున్నారని, షాపులు కూలిపోతే కట్టుకోలేని పేద కుటుంబం నాదని తెలిపాడు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి దీనిపై తగిన విచారణ జరిపించి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుని నా కుటుంబానికి న్యా యం చేయాలని బాధితుడు నాగేశ్వరరావు కోరుతున్నాడు.

## ఇందిరమ్మ ఇండ్ల యాప్‌పై అవగాహన

* దరఖాస్తు విచారణ ప్రక్రియ ప్రారంభించాలి
* ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇందిరమ్మ ఇండ్ల యాప్ పై క్షేత్ర స్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కలిగేలా శిక్షణ ఇవ్వాలని జిల్లా కలె క్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్ట రేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల యాప్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి జిల్లాకు ఇంది రమ్మ ఇండ్ల యాప్ అందిందని, లాగిన్ ఐడిలు ఇచ్చారని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంపివోలు, ఏపి వోలు, మున్సిపల్ కమిషనర్లకు శిక్షణనిచ్చి వారి ద్వారా పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికా రులకు శిక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం క్రింద స్వీకరించిన దర ఖాస్తుల్లో 357869 దరఖాస్తులు ఇండ్ల నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. ఇందులో అత్యధికంగా ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 53990 దర ఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. రోజుకొక అధికారిచే కనీసం 40 దరఖాస్తుల పరిశీలన లక్ష్యంగా చేపట్టి ఈనెల 20లోగా దరఖాస్తుల విచారణ పూర్తయ్యేలా కార్యాచరణ చేయాల న్నారు.ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, డిఆర్‌వో రాజేశ్వరి, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, డిపివో ఆశా లత, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె. శ్రీనివాసరావు, అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకం

* పోలీసు కమిషనర్ సునీల్‌దత్



**ప్రజాపక్షం / ఖమ్మం క్రైం :** పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలక మని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ కొనియాడారు. 62 వ హోంగార్డు ఆవి ర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ పెరడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీసులతో సమా నంగా నిరంతరం విధులు నిర్వహిస్తూ హోంగార్డులు అందిస్తున్న సేవలను అభినందించారు. ఇటీవల సంభవించిన వరదలకు కొందరు హోంగార్డ్ ఆఫీసర్లు, సిబ్బంది ఇల్లు దెబ్బతిని కుటుంబాలు ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అంకితభావంతో సమాజసేవలో నిమగ్నమైయ్యారని అన్నారు. సాధర ణతో పాటు క్లిష్టమైన విధులను సైతం నిబద్ధతతో నిర్వహిస్తూ పోలీసుశా ఖలో కీలకంగా మారారన్నారు. శాంతిభద్రతలు, ప్రజారక్షణలో సేవలు అందించడంతో పాటు తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీ స్‌గఢ్ రాష్ట్రాలో జరిగిన ఎన్నికల్లో విధులు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీ సుల ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వహించాలని సూచించారు. తొలుత సాయుధ హోంగార్డు ప్లాటూన్ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం హోంగార్డులకు స్పోర్ట్ మీట్ నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు నరేష్ కుమార్, ప్రసాదరావు, ఏఆర్ అడిషినల్ డిసిపి కుమారస్వామి, ఏసీపీలు సాంబరాజు, సునీల్‌సింగ్, నర్సయ్య, హోంగార్డు ఆర్ఐ సురేష్, శ్రీశైలం, అప్పల నాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం సూచించిన విధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ లూథర్ విల్సన్ రఘునాథపాలెంలోని మైనార్టీ బాలికల పాఠశాలను సంద ర్శించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని మండల వైద్యాధికారి రమే ష్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థిని లతో కలిసి వారు భోజనం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లా డుతూ ప్రభుత్వం విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుం టుందని తెలిపారు. ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అదేవిధంగా సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌లో తహ సీల్దార్ లూథర్ విల్సన్ శుక్రవారం రాత్రి బస చేశారు. అక్కడ విద్యార్థు లకు అందుతున్న సౌకర్యాలను పరిశీ లించారు.

## పోటు ప్రసాద్ ధన్యజీవి

- సిపిఐజిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్
- వరంగల్‌క్రాస్‌రోడ్డులో ఘనంగా సంస్మరణ సభ





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** తనతుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టుగా కడదాక కొనసాగిన కామ్రేడ్ పోటు ప్రసాద్ ధన్యజీవి అని సిపిఐ జిల్లా సహాయ కార్య దర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో గల సిపిఐ కార్యా లయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో సంస్మరణసభను నిర్వహించారు. తొలుత డిబిఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన పోటు చిత్రపటానికి సిపిఐ శ్రేణులు పూలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వెంపటి సురేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దండి మాట్లా డారు...ఇంత త్వరగా తమను విడిచి వెళతారని కలలో కూడా ఊహించుకోలేదని భవోద్వేగానికి లోనయ్యారు. నిరంతరం కమ్యూనిస్టు పార్టీ బలోపేతం, కార్యకర్తల సమస్యలపై శ్రమించే గొప్ప నాయకుడ్ని కోల్పోవడం బాధాకరం అన్నారు. కానీ ఓ కమ్యూనిస్టు నాయకునిగా ఆయన ఆకరి మజిలీలో దక్కిన గౌరవం ఎంతో గొప్ప నీరాజనంగా కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేసిన నాడే మనం ఇచ్చే ఘనమైన నివాళి అవుతుందన్నారు. అలాగే పలువురు నాయకులు, కార్య కర్తలు, సంఘాల సభ్యులు పోటుతో ఉన్న సాన్నిహి త్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్య వర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, గిరిజనస మైక్య రాష్ట్ర నాయకులు అజ్మీర రామ్మూర్తినాయక్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, పగీళ్ల వీరభద్రం, ఏదులాపురం సొసైటీ డైరెక్టర్ పొసంగుల చంద్రరావు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు రాయల అప్పయ్య, దండి రంగారావు, వెన్నం భాస్కర్‌పాల్గొన్నారు.

**కార్మిక పక్షపాతి పోటు ప్రసాద్ : ఇయు నేత అప్పారావు**

సుదీర్ఘ కాలం ఏఐటియుసి నాయకునిగా, సంఘటిత, అసంఘటిత కార్మికుల కోసం పనిచేసిన పోటు ప్రసాద్ కార్మిక పక్షపాతి అని ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు తెలిపారు. తుది శ్వాస వరకు కార్మిక హక్కుల కోసం, సంక్షేమం కోసం కృషి చేసిన ప్రసాద్ ధన్యజీవి అని ఆయన తెలి పారు. పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఆర్టిసి ఎంప్లా యీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈయు కార్యా లయంలో రీజినల్ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో అప్పారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రగతిశీల భావాలతో పనిచేసిన ప్రసాద్ ఏఐటియుసి నాయకునిగా పలు ఉద్యమాలకు నాయకత్వం వహిం చారన్నారు ఆయన సంస్మరణ వేళ ఆయన ఆశయ సాధ నకు పునరంకితమవ్వాలని అప్పారావు స్పష్టం చేశారు. ఈ సభలో ఎంప్లాయీస్ యూనియన్ మహిళా నాయకు రాలు కె. అరుణమ్మ, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లి కొండ వెంకన్న, రీజినల్ అధ్యక్షులు గుడిబోయిన శ్రీని వాస్, ఖమ్మం డిపో అధ్యక్షులు దేశబోయిన జగన్నాథం, డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు పాల్గొన్నారు.

**రేపు పోటు ప్రసాద్ 'సంస్మరణ సభ' :**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యదర్శి పలు విద్యార్థి, యువజన, కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి ఆకస్మిక మరణం పొందిన పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఈనెల ఎనిమిదిన ఆదివారం జరుగు తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. రోటరీనగర్‌లోని పాత మమత మెడికల్ కళాశాల (ఎస్ఆర్ కళాశాల)లోని పువ్వాడ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని సురేష్ తెలిపారు. ఈ సంస్మరణ సభలో ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎఐఎ స్ఎఫ్ మాజీ నేత అమర్‌జిత్ కౌర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ నాయకులు కె. రామకృష్ణ (ఎపి సిపిఐ కార్యదర్శి), చాడ వెంకటరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు లు పాల్గొంటారన్నారు. ఈ సంస్మరణ సభలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఎంఎల్‌సి తాతా మధు, సిపిఐ(ఎంఎల్) ఎన్డి రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య, వివిధ పార్టీల నాయకులు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొంటారని సురేష్ తెలిపారు.

## అంబేద్కర్ ఆశయ సాధన కోసం పోరాడాలి

* సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య
* సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ 68వ వర్ధంతి

**ప్రజాపక్షం/మణుగూరు :** అంబేద్కర్ ఆశయ సాధన కోసం యువత పాటుపడాలని, ఆయన కలలు కన్నా స్వేచ్ఛ సమానత్వం అందరికీ అందాలని, దీని కోసం ప్రభుత్వం పాలకులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. శుక్రవారం అంబేద్కర్ 68వ వర్ధంతిని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సమితి సింగారం గ్రామ పంచాయతీ ఆఫీస్ ముందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు బి.అయోధ్య, మండల కార్యదర్శి జంగం మోహన్ రావులు పూలదండ వేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జన్మించిన అంబేద్కర్ కష్టపడి అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఉన్నత చదువులు చదివి, విదేశాలకు వెళ్లి ఎన్నో పట్టాలు పొందిన టువంటి మహా గొప్ప వ్యక్తి అని, అంబేద్కర్ 1956 డిసెంబర్ 6న స్వర్గస్తులైనారన్నారు. అంబేద్కర్ ఈ దేశ రాజ్యాంగ నిర్మాణం కోసం ఎనలేని సేవలు చేశారని, చిన్ననాటి నుండే ఆయన ఎదుర్కొన్నటువంటి అనేక అవమానా లను దృష్టిలో పెట్టుకొని ఉన్నత చదువులు చదు వుకొని, చదువుల ద్వారానే దారిద్ర్యాన్ని, ఈ దేశంలో ఉన్నటువంటి అంటరానితనాన్ని , రూపుమాపవచ్చని అందరికీ విద్య ఉండాలని, విద్యఉన్నత శిఖరాలకు చేర్చుతుందని వారు నమ్మారన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, ఎఐటియుసి మణుగూరు మండల కార్యదర్శి గద్దం వెంకటే శ్వర్లు, మహిళా సమైక్య మండల కార్యదర్శి నాగేల్ల నిర్మల, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సురేందర్ రెడ్డి, నాయకులు తుపుదు శీను, ఎస్డి ఉమర్, కన్నెబోయిన ప్రసాద్, మంగి మల్లికార్జున్, బాబురావు పాల్గొన్నారు.




## సెల్ మార్ట్‌ను ప్రారంభించిన తుమ్మల యుగంధర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని నెహ్రూ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహా సెల్ మార్ట్‌ను కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు డా॥ తుమ్మల యుగంధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన పరికరాలు అందించి వారి అభిమా నాన్ని చూరగొనాలని తుమ్మల యుగంధర్ తెలిపారు. ఈ సందర్భంగా షాపు యజమాని షేక్ మోసిన్‌ను తుమ్మల యుగంధర్ అభినందించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక కార్పొరేటర్ బిజి క్లెమెంట్, దండా పుల్లయ్య, షేక్ మదార్, కాంపాటి వెంకన్న, సురేష్‌బాబు చౌదరి, గౌస్, మౌలానా, రాజా, నాగులమీరా, ఫరీద్‌బాబా, బోడన్ సాబ్, అఫ్జల్, తాజుద్దీన్, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



## 'వోపా' ఆధ్వర్యంలో జాయింట్ కమిషనర్‌కు శుభాకాంక్షలు



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : రాష్ట్ర పన్నుల, వాణిజ్య శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లా జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన విశ్వబ్రాహ్మణ జాతియులు రావుల శశిధర్‌ను వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) ముఖ్య సలహాదారు అకోజు సురేందర్ రావు ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వరంగల్ డివిజన్ రాష్ట్ర పన్నుల, వాణిజ్య శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన శశిధర్‌కు వోపా నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. వోపా రాష్ట్ర సలహాదారులు, తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మత్స్య సంఘం ప్రధాన కార్యదర్శి వొల్లేటి కృష్ణమాచార్యులు, ఉమ్మడి జిల్లా వోపా అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ పాడిచెట్టి విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం భిక్షపతి తదితరులు ఉన్నారు.

## అవినీతి వ్యతిరేక వారోత్సవాల ర్యాలీని ప్రారంభించిన పోలీస్ కమిషనర్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 9వ తేదీక వరకు నిర్వహిస్తున్న అవినీతి వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. హనుమకొండ జూనియర్ కాలేజీ నుంచి హనుమకొండ చౌరస్తావరకు ఈ ర్యాలీని నిర్వహించారు. విద్యార్థి దశ నుంచి అవినీతిని వ్యతిరేకించాలని, లంచం తీసుకోవడం, ఇవ్వడం నేరమని సిపి తెలిపారు. ఈ కార్యక్రమం సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, ఎసిబి డిఎస్‌పి సాంబయ్య, ఇన్స్‌స్పెక్టర్ సట్ల రాజుతో పాటు కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి



ప్రజాపక్షం/కాజీపేట : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బిఆర్ అంబేద్కర్ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎఆర్‌నగర్ కాలనీలో ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా మునిగాలా భిక్షపతి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలకు చెందిన వారందరికీ రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు కల్పించాలని పోరాడి భారత రాజ్యాంగాన్ని రచించిన బాబాసాహెబ్ అంబేద్కర్ మనం మర్చిపోకూడదని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఎవరికీ లేదని, అంబేద్కర్ ఆశయసాధనకు అందరం కలిసి పోరాటాలు చేస్తామని ప్రతిన భూనారు. సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు రాసమల్ల దీన అధ్యక్షతన జరుగగా కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాసమల్ల కుమార్, బండ్లోజు స్వాతి, బండ్లోజు ఉషారాణి, శంకర్పల్లి మౌనిక, రాయపురం వనజ, స్వామి, పిట్టల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులతో సమానంగా హోంగార్డులు విధులు

హోంగార్డ్ రైసింగ్ డేలో ఎస్‌పి సుధీర్ రాంనాధ్ కేకన్




ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: పోలీసులతో సమానంగా హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారని, సమయానుసారంగా విధులకు హాజరవుతూ క్లిష్టపరిస్థితుల్లో కూడా వారితో సమానంగా పనిచేస్తూ హోంగార్డ్‌లు మన్ననలు పొందుతున్నారని మహబూబాబాద్ జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాధ్ కేకన్ అన్నారు. హోంగార్డ్ రైసింగ్ డే లో భాగంగా ఆయన కేక్ కట్‌చేసి హోంగార్డ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. తమకు కేటాయించిన విధులు సక్రమంగా పాటిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి విజయ్ ప్రతాప్, ఆర్‌ఐ వెల్ఫేర్ నాగేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## హమాలీలకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్



ప్రజాపక్షం/ఐనవోలు : హమాలీలకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం హమాలీలతో జక్కు రాజు గౌడ్ మాట్లాడుతూ ఈనెల డిసెంబర్ 8, 9 తేదీల్లో హనుమకొండలో హమాలి కార్మికుల జిల్లా మహాసభ జరుగుతుందని,హమాలీలందరూ హనుమకొండకు ఎనిమిదిన ఉదయం తొమ్మిది గంటలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 7న జరిగి రాష్ట్రవ్యాప్తంగా ఆటో బంద్ విజయవంతం చేయాలని కోరుతో గురువారం పరకాలలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదరి రమేష్, ఐనవోలు మండల కార్యదర్శి ఇసాక్,రాజు, సైదులు, వెంకటయ్య, ప్రవీణ్, దాదాపు 30 మంది పాల్గొనడం జరిగింది.

# నగర సమగ్రాభివృద్ధికి కృషి

రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ




ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి: రాష్ట్ర రెండవ రాజధానిగా వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మాత్యులు కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 38వ డివిజన్ పడమర కోటలో జిడబ్ల్యుఎంసి ఆధ్వర్యంలో కోటి 23 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు శుక్రవారం నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలసి మంత్రి కొండా సురేఖ శంకుస్థాపనలు చేశారు. పడమర కోటలోని 38వ డివిజన్‌లో మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించే మహిళా కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి, రూ.23 లక్షల వ్యయంతో మహిళల కమ్యూనిటీ హాల్ మిగిలిన పనులకు, లక్షల రూపాయల వ్యయంతో పడమర మధ్య కోటలో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి, రూ.20లక్షల వ్యయంతో ఖిలా వరంగల్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నగర సమగ్ర అభివృద్ధికి రూ. 6 వేల కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారని మంత్రి గుర్తు చేశారు. గతంలో తాను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఈ డివిజన్‌కు రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. 38వ డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమ దామోదర్ యాదవ్ బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్రతో పాటు కమ్యూనిటీ హాల్ స్థల దాత గద్దల రమేష్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### స్వీయ రక్షణకు కరాటే అవసరం

ప్రస్తుత సమాజంలో స్వీయ రక్షణ కోసం బాల బాలికలకు కరాటే విద్య ఎంతో అవసరమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయశాఖ మాత్యులు కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఖిలా వరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రాణీ లక్ష్మీ బాయి ఆత్మరక్ష ప్రశిక్షన్ ద్వారా బాలికల కోసం ఏర్పాటుచేసిన స్వీయ రక్షణ శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాతో కలిసి మంత్రి కొండా సురేఖ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చట్టాలు ఎన్ని తెస్తున్నా, షీ టీంలను నియమిస్తున్న బాలికలు, యువతులు, మహిళలపై దాడులు ఆగడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి బాలికలు తమకు తాము రక్షించేందుకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా రాష్ట్ర సిఎం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులందరికి ఒకే చోట నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 20 నుండి 25 ఎకరాల విశాలమైన స్థలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లను ఏర్పాటు చేస్తున్నట్లు, వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేయుటకు ఇటీవల శంకుస్థాపక చేశామన్నారు. తెలంగాణ ప్రజా పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న పాలన విజయవత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీలలో గెలుపొందిన విజేతలకు మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక కార్పొరేటర్ ఉమా దామోదర్, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డిఆర్‌డి ఓ కౌసల్యాదేవి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో మంత్రుల పర్యటన

కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ పైలాన్ ఆవరణలో నేడు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జిల్లా మంత్రి కొండా సురేఖ జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై శుక్రవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ పైలాన్ ప్రాంగణంలోని కైటెక్స్, గణేష్ ఏకోటె యంగ్ వన్ కంపెనీలను పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దుల శ్రీధర్ బాబు సందర్శించనున్నందున జిల్లా అధికారులకు కార్యచరణ ప్రణాళిక, రూట్ మ్యాప్‌తో పాటు పకడ్బందీ ఏర్పాట్లు పై సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ సందర్శన అనంతరం కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ నిర్మాణంలో భూమి కోల్పోయిన 863 మంది రైతులకు లక్కీ డ్రా ద్వారా ప్లాట్ నెంబర్స్ అలాట్ చేయడం జరిగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ జి. సంధ్య రాణి, డిఆర్‌ఓ విజయలక్ష్మి , వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జడ్పి సీ ఈవో రాంరెడ్డి, డిపిఓ అనురాధ, డిఆర్‌డిఓ కౌసల్యాదేవి, టిజిఐఐసి జోనల్ మేనేజర్ స్వామి, జిఎం ఇండస్ట్రీస్ సాల్మన్ రాజ్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మృతదేహాల అప్పగింత

హైకోర్టు తీర్పును భేఖాతరు చేసి పోస్టుమార్టమ్



ప్రజాపక్షం/ఏటూరునాగారం: ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు ఏటూరునాగారం, మహాదేవపూర్ ఏరియా కమిటీ దళ సభ్యుడు ఎగోలపు మల్లయ్య మధు మృతదేహాన్ని హైకోర్టు తీర్పు మేరకు పోలీసులు బంధువులకు అప్పగించారు. ఏటూరునాగారం మండలం చెల్పాక పూలకొమ్మ వాగు సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ఏడుగురు మావోయిస్టులలో ఎగోలపు మల్లయ్య బంధువులు ఆరోపణల మేరకు హైకోర్టు తీర్పు పోస్టుమార్టం నిలిపివేయాలని స్టే తెచ్చినా పోలీసుల పట్టించుకోకుండా పోస్టుమార్టం నిర్వహించారని మల్లయ్య భార్య మీన ఆరోపించారు. ఎన్‌కౌంటర్ మృతులపై విష ప్రయోగం చేసి హతమార్చారని అనుమానంతో తమ సమక్షంలోనే పోస్టుమార్టం నిర్వహించాలని కోరినా పోలీసులు మృతదేహాలను చూడడానికి కూడా అనుమతించకుండా పోస్టుమార్టం పూర్తి చేసి తమకు అప్పగించారని మీన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ బిడ్డ, విప్లవ సారథ్యంలో పని చేశారని చెప్పుకొని తిరిగే మంత్రి సీతక్క ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై ప్రకటన విడుదల చేయకపోగా మృతదేహాలను చూడకుండా బాధిత కుటుంబాలను పరామర్శించకపోవడంపై కాంగ్రెస్ పాశవిక పాలనపై తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విప్లవకారులను, ప్రజా సంఘాలను అణిచివేతకు గురి చేస్తుందని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో బుద్ధి చెప్పాలని అమరుల బంధుమిత్రుల సంఘం కోరారు.

## బిసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ అమలు చేయాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్



ప్రజాపక్షం/ నర్సంపేట : బిసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా బిసి హక్కుల సాధన సమితి నర్సంపేట మండల సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించిన బిఆర్ అంబేద్కర్ పేద, మధ్యతరగతి అట్టడుగు వర్గాల ప్రజలకు మన రాజ్యాంగంలో సముచిత న్యాయం జరగాలని, రిజర్వేషన్ల కల్పన ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు రిజర్వేషన్లు చెందే విధంగా రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య పద్ధతిని పాటించకుండా, మను ధర్మ శాస్త్రాన్ని అమలు చేసే విధానాల వైపు, మతతత్వ శక్తులు రాజ్యాంగాన్ని తీసుకపోవడానికి ప్రయత్నం సాగిస్తున్నారన్నారు. ఆ ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, సిపిఐ నర్సంపేట మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పాలక కవిత, ఇల్లందుల సాంబయ్య, బిసి హక్కుల సాధన సమితి నాయకులు బర్ల సందీప్, బాదరబోయిన యాదగిరి, పిట్టల సతీష్, మమత, శైలజ, శ్రీకళ, అయిత యాకూబ్, సాంబరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సంక్షేమం మరిచి బిఆర్ఎస్, బిజెపి రాద్ధాంతం

టిపిసిసి అధికార ప్రతినిధి, మహబూబాబాద్ జిల్లా ఇంచార్జ్ బండి సుధాకర్ గౌడ్



ప్రజాపక్షం/మహబూబాబాద్ : గత శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటి నెరవేర్చుతూ ఇప్పటికే అన్ని రంగాల సంక్షేమం కోసం 60 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదని, డిసెంబర్ 7 2023 రోజు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రేవంత్ రెడ్డి, రబీ సీజన్లో మొదటి ఆరు నెలలకు గాను 7600 కోట్లు జమ చేయడం జరిగిందని, రెండో ఆరు నెలలకు గాను దాదాపు 26 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసి మొత్తం రైతంగానికి 28,600 కోట్ల రూపాయలు వెచ్చించిన రైతు బిడ్డ అని నిరూపించుకున్నారని తెలంగాణ పిసిసి అధికార ప్రతినిధి, మహబూబాబాద్ జిల్లా ఇంచార్జ్ బండి సుధాకర్ గౌడ్ అన్నారు. తెలంగాణ విజయోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆయన మహబూబాబాద్‌లో విలేఖరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో రెండు విడుతల రైతుబంధు కింద 14000 కోట్లు ఇచ్చారని, రైతంగానికి ఏ ప్రభుత్వం ఎక్కువ ఖర్చు చేసిందో మీరే అర్థం చేసుకోవాలనీ కోరుచున్నానని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 80 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారని, 50 లక్షల మంది గృహాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తూనే, పది లక్షల ఆరోగ్య భీమా, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఉద్యోగాల భర్తీ, యువత నైపుణ్యానికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, హైదరాబాద్ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడానికి హైడ్రా, మూసి ప్రక్షాళన, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, ధరణి ప్రక్షాళనతో భూ సమస్యలు పరిష్కారం, విద్యార్థులకు మేస్ చార్జీలు పెంచడం, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, సచివాలయంలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు లాంటి ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో వాస్తవాలు ఈ విధంగా ఉంటే ప్రతిపక్షాలు ఓర్వలేక నేల విడిచి సాము చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలు అన్ని అమలు చేస్తాం, ప్రజలు ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దని, 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్, బిజెపి, తెలంగాణ సంపదను దోచుకొని దాచుకున్నారని, గత ప్రభుత్వంలో జరిగిన అన్ని అవకతవకలను వెలికితీసి ప్రజల ముందు ఉంచి ప్రజాక్షేత్రంలో శిక్షిస్తాం అని ఆయన హెచ్చరించారు.

## నూతన అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/దేవరుప్పుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన నూతన అంబులెన్స్ సేవలను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు మరింత ఆరోగ్య సేవలను అందించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మారుమూల ప్రాంతంలోని ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పేద ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ఆపద సమయంలో ఈ అంబులెన్స్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నల్ల శ్రీరాములు, కాంగ్రెస్ పార్టి ముఖ్య నాయకులు, వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదామ్‌లను పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఇవిఎం గోదాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా నమోదు పుస్తకం, సిసి కెమెరాల పనితీరు, మండల నియంత్రణ పద్ధతులను పర్యవేక్షించారు. భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీస్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బి భాస్కర్, రావెల రవి, ఎ విజయ్ భాస్కర్, జోగు ప్రకాష్, గోపిరాం, ఎన్నికల సూపరిండెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నాలుగు లైన్ల రోడ్డుకు మహర్దశ

రూ.18 కోట్ల పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర



ప్రజాపక్షం/గణపురం: గణపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి కి నాలుగు లైన్ల రోడ్డు మంజూరు కాగా శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తన్న మాట్లాడుతూ ప్రస్తుతం 18 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, ఈ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గాంధీనగర్ నుండి. జంగాలపల్లి క్రాస్ వరకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 18 కోట్ల రూపాయలతో రెండున్నర కిలోమీటర్ల వరకు నాలుగు లైన్ల రోడ్డు పనులు ప్రస్తుతం చేస్తామన్నారు. ఈ పనులు వేగవంతంగా ప్రారంభించి పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి డిఈ కి ఆదేశాలు జారీ చేశారు. ముందుగా సైడ్ డ్రైనేజీలు విద్యుత్తు, పైప్ లైన్ సెంట్రల్ లైటింగ్ సిస్టం చేస్తామన్నారు. అనంతరం రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయన్నారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలన్నారు.

## ఎస్‌బిఐ బ్యాంక్ దోపిడీ దొంగల ముఠా అరెస్టు

వివరాలు వెల్లడించిన సిపి అంబర్ కిషోర్ ఝా



ప్రజాపక్షం/రాయపర్తి:గత నెల 18వ తేదీ అర్ధరాత్రి రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్.బి.ఐ బ్యాంక్‌లో దోపిడికి పాల్పడిన ఉత్తరప్రదేశ్, మహరాష్ట్రకు చెందిన ఏడుగురు సభ్యుల ముఠాలోని ముగ్గురు దొంగలను వరంగల్ పోలీసులు అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడితో సహా మరో నలుగురు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పోలీసులకు పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు సుమారు ఒక కోటి ఎనభై లక్షల నాలుగువేల రూపాయల విలువ గల రెండు 2కిలోల 520 గ్రాముల బంగారు అభరణాలు, ఒక కారు, పదివేల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1. అర్షాద్ అన్సారీ, తండ్రి పేరు అన్సారీ అహ్మద్, వయస్సు 34, షేహవాజ్‌ర్పు, బుడాన్ తాలుకా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. 2. షాఖీరాఖాన్ ఆలియాస్ బోలెఖాన్, తండ్రి పేరు నవాబ్ ఖాన్, వయస్సు 28, బుడాన్ తాలుకా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. 3. హిమాన్సు బిగాం చంద్ జాన్వర్, తండ్రిపేరు బిగాం చంద్, వయస్సు 30, మోటల గ్రామం, తాలుకా, బుల్టనా జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా. ప్రస్తుతం పరారీలో వున్న నిందితుల వివరాలు: మహమ్మద్ నవాబ్ హసన్, తండ్రి పేరు జకీర్ అలీ, వయస్సు 39, కక్రలా గ్రామం, బదౌన్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. 2. అక్షయ్ గజానన్ అంబోర్, తండ్రి పేరు గజానన్, వయస్సు 24, సైగావ్ గ్రామం, చికిల్లి తాలుకా, మహారాష్ట్ర. 3. సాగర్ భాస్కర్ గోర్, తండ్రి భాస్కర్ గోర్, వయస్సు 32, పునై మోటాల గ్రామం, బుల్తానా జిల్లా, మహరాష్ట్ర. 4.సాజిద్ ఖాన్, తండ్రిపేరు జకీర్ అలీ ఖాన్, వయస్సు 35, కక్రలా గ్రామం, బదాయు జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుర్తించబడ్డారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడిస్తూ ప్రస్తుతం పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు నిందితులతో పాటు, పరారీలో మరో నలుగురు నిందితులు ఏడుగురు సభ్యులు ముఠా ఏర్పాడ్డారు. పరారీలో వున్న ప్రధాన నిందితుడు మహమ్మద్ నవాబ్ హసన్ కొద్ది రోజుల కిందిత ఉత్తరప్రదేశ్ నుండి వచ్చి రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లో వుండే బ్యాంక్లు, బ్యాంక్ భద్రత ఏర్పాట్లపై రెక్కీ నిర్వహించాడు. అనంతరం నిందితుడు ఉత్తర ప్రదేశ్, మహరాష్ట్రలకు చెందిన మిగితా నిందితుల కలిసి హైదరాబాద్కు చేరుకున్నారు. వ్యాపారం ముసుగులో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఈ ముఠా ముందుగా గుగూల్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని బ్యాంకుల సమాచారాన్ని సేకరించడం జరిగింది. సేకరించిన సమచారంలో నిందితులు వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో ఎస్.బి.ఐ బ్యాంక్ చోరీ అనువైనదిగా గుర్తించి ఈ బ్యాంక్లో చోరీ చేసేందుకు ఈ ముఠా సిద్ధపడ్డారు. ఈ చోరీలో భాగంగా నవంబర్ 18తేదీ అర్ధరాత్రి తెలవారితే 19 తారీకున నిందితులు హైదరాబాద్ నుండి నిందితుల్లో ఒకడైన హిమాష్ను డ్రైవింగ్ చేస్తున్న ఒక కారులో రాయపర్తి గ్రామ శివారు ప్రాంతాని చేరుకున్నారు. అనంతరం కారును తిరిగి తెల్లవారుజామున నాలుగు గంటలకు రమ్మని కారుని వెనక్కి తిప్పి పంపారు. అనంతరం మిగితా అరుగురు నిందితులో పంట పోలాల ద్వారా నిందితులు రాయపర్తి కేంద్రంలోని ఎస్.బి.ఐ బ్యాంక్ దక్షిణ భాగానికి రాత్రి 11 గంటలకు చేరుకోని అక్కడ వున్న కిటికిని నిందితులు తోలగించి బ్యాంక్ లోనికి చోబడిన ఈ ముఠా సభ్యులు ముందుగా బ్యాంక్ సెక్యూరీటీ అలారంతో పాటు, సీసీ కెమెరాల వైర్లను నిందితులు కట్ చేసి ఇద్దరు నిందితులను తొలగించిన కిటికి వద్ద కాపలగా వుంచి ప్రధాన నిందితుడితో సహ మరో నలుగురు నిందితులు బ్యాంక్ స్ట్రాంగ్ రూం తాళాలు పగులగొట్టి, స్ట్రాంగ్ రూంలో వున్న మూడు లాకర్లను ఈ ముఠా తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్లను వినియోగించి లాకర్లను కట్ చేసి అందులోవున్న సుమారు 13కోట్ల 61లక్షల రూపాయల విలువ గల బంగారు అభరణాలను వారి వెంట తెచ్చుకున్న సంచుల్లో వేసుకోని వారి వెంట తెచ్చుకున్న గ్యాస్ సిలిండర్ ఇతర స్వామగ్రిని బ్యాంక్లో వదిలి వేయడంతో పాటు అక్కడి నుండి వెళ్ళే ముందుగా సిసి కెమెరాల సంబంధించిన డివిఆర్ను ఈ ముఠా ఎత్తికెళ్లారు. చోరీ అనంతరం నిందితులు వచ్చిన కారులో తిరిగి హైదరాబాద్ కిరాయి తీసుకున్న ఇంటికి చేరుకొని నిందితులు చోరీ సోత్తును ఏడు సమాన వాటాలు పంచుకున్నారు. నవంబర్ 19వ తేదిన నిందితులు మూడు బృందాలు వీడిపోయిన మహరాష్ట్ర, ఉత్తరప్రదేశ్కు తిరిగివెళ్ళిపోయారు. ఈ భారీ చోరీపై అప్రమత్తమైన వరంగల్ కమిషనరేట్ పోలీసులు వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ నేతృత్వంలకో వర్ధన్నపేట ఏసిపి నర్సయ్య, సిసిఎస్ ఏసిపి భోజరాజు, నర్సంపేట ఏసిపి కిరణ్ కుమార్ ల అధ్వర్యంలో పది కి పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితుల పట్టుకోవడ కోసం ఈ ప్రత్యేక పోలీస్ బృందాలు దేశంలో వివిధ ప్రాంతాల్లో నిఘా పెట్టి నిందితుల కదలికలపై ఎప్పటికప్పుడు సమచారాన్ని సేకరించి ముగ్గురు నిందితులను గుర్తించి వారిని అరెస్టు వారి నుండి చోరీ సోత్తున స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ భారీ చోరీని అతి స్వల్పకాలంలో చేదించడంతో పాటు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోవడం ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ధర్నా



**ప్రజాపక్షం/చండూరు :** సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసి కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు చండూరు మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవా రం చండూరు మండల విద్యాధికారికి సమ్మె నోటీసు ఇచ్చి ఎంఇఒ కార్యాలయం ముందు మొదటి రోజు ధర్నా నిర్వహించి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భీమ రాజు సాయిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యూలర్ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఎస్ఎస్ఎలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ చేయడానికి సమయం తీసుకుంటే వెంటనే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎంఆర్‌సి స్టాఫ్ రవికుమార్ , కోఆర్డినేటర్ నాగభూషనాచారి, డాటాఎంట్రీ ఆపరేటర్ సాయులు, మెసెంజర్ సిఆర్పీలు సైదులు , మహేష్, స్వామి, ఐఆర్పిలు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా



**ప్రజాపక్షం/ (నల్లగొండ)తిప్పర్తి :** తిప్పర్తి లో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంఆర్ సీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు పే స్కేల్ ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ .10 లక్షలు, ఆరోగ్య బీమా కింద రూ. 10 లక్షలు ఇవ్వాలని, పదవీ విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి రూ. 25 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నపార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ , వర్క్ ఎడ్యుకేషన్ టీచర్లకు రి ఎంగేజ్ విధానం లేకుండా 12 నెలల జీతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ నరసింహా నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి లు కునుకుంట్ల కొండయ్య, రాజ్ దాస్, సత్యనారాయణ, బృ హిని, పుష్పలత, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్లు, ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఏంటి ఆపరేటర్లు, ఐ.ఇ.ఆర్.పిలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్–2 ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు



**ప్రజాపక్షం/యాదాద్రి :** టిజిపిఎస్‌సి గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అధికారులకు సూచి ంచారు. శుక్రవారం కలెక్టరేట్ మినీమీటింగ్ హాల్‌లో టిజిపిఎస్‌సి గ్రూప్2 పరీక్ష నిర్వహణపై సమావేశం నిర్వ హించారు. సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు సూచ నలు చేశారు. పోలీస్, మెడికల్ అండ్ హెల్త్, ఆర్టీసీ, ట్రెజరీ, విద్యా సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఏసిపి రవికిరణ్ రెడ్డి, పిల్ల ట్రాన్స్పోర్ట్ అధికారి సాయి కృష్ణ, రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ బాలాజీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గురు ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని సిసిబ్యాంక్ పక్కన ఎండి కళ్లెం సైదులు, డైరెక్టర్ భవాని, మెడికల్ హాల్ ఫార్మాసిస్ట్ సాపిడి రాంప్రసాద్ నూతనంగా ఏర్పాటు చేసిన గురు ఆసుపత్రిని ఎమ్మెల్యే వేముల వీరే శం శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కోట్యానాయక్, కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, గుత్తా నర్సిరెడ్డి, కూనూరు సాయికుమార్, గాదె శోభారాణి, మాదూరి జ్యోతి, గోదాసు పృథ్వీరాజ్, బత్తుల కృష్ణ, ఎండి.అక్రమ్, మోటె రమేష్, ఎండి.నాసర్, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకార ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల సంక్షేమం కోసం స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు తొగిటి మురళి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షులు కర్రి వేణు మాధవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన పాత్ర పోషించిన స్వర్ణకార, వృత్తి కళాకారులు నేడు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం కేంద్ర బ్యాంకు లోన్ ద్వారా బంగారు బిస్కట్లను స్వర్ణకారులకు అందిస్తున్నారని, స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేసి స్వర్ణకారుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు నారాయణ్ దాసు రామాచారి, జిల్లా ఉపాధ్యక్షులు అనుముల బ్రహ్మచారి, రాగి శ్రీనివాసచారి, అనుముల గోవిందచారి, భాస్కరచారి, రహీం, రమేష్, తంగేళ్ళపల్లి లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## దేవాలయ భూమి పరిశీలన



**ప్రజాపక్షం/చింతలపాలెం:** చింత్రియాల గ్రామలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలోని దేవాలయ భూమి 601,602 సర్వే నెంబర్‌లో ఎ.507 గుంటలు గతంలో ప్రభుత్వంవారు బలహీన వర్గాల కేటాయించగా ఇంత వరకు నష్ట పరిహారం దేవస్థానానికి రానందున, ఈ భూమిలో ఇంత వరకు నిర్మా ణాలు చేపట్టకపోవడంతో హు జూర్‌నగర్ ఆర్డీవో ఉత్తర్వుల మేరకు దేవాదాయ ధర్మదాయశాఖ సహయ కమిషనర్ అన్నెపర్తి సులోచన, చిం తల పాలెం తహసిల్దార్ తుమ్మల సురేందర్‌రెడ్డిలు ఆ భూమిని పరిశీలించారు. రెవిన్యూ సిబ్బంది సత్యనారాయణ, సర్వేయర్ వాసుదేవరావు, దేవాలయ నిర్వాహణాధికారి యంపి లక్ష్మ ణ్‌రావు, దేవాలయ అర్చకులు అగ్నిహోత్రం కిషోర్‌బాబు, ఈవోలు గుజ్జుల కొండారెడ్డి, తదితరులున్నారు.

# అత్యాధునిక పద్ధతుల్లో బస్టాండ్ నిర్మిస్తాం

* ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తాం
* బస్టాండ్ ముందు బంక్ ఏర్పాటు చేస్తాం
* 50 ఏళ్ళ వరకు ఇబ్బందులు లేని రీతిలో నిర్మాణం

మంత్రులు పొన్నం ప్రభాకర్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** అత్యాధునిక పద్ధతుల్లో హుజూర్‌నగర్‌లో నూతన బస్టాండ్‌ను నిర్మిస్తామని రవాణా శాఖా, బిసి సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో జరిగిన వివిధ కార్యక్రమాలలో భారీనీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి పాల్గొన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్, పాతబస్టాండ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేలా బస్టాండ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. 40 ఏళ్ళ క్రితం కట్టిన బస్టాండ్‌ను పునర్నిర్మిస్తామమన్నారు. బస్టాండ్‌లో అదనపు ప్లాట్ ఫామ్,షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి, బస్టాండ్ ముందు పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. భవిష్యత్తులో 116 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేసినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక ఆర్‌టిసి లాభాల బాటలో పయనిస్తుందన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. అనంతరం ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్లో రూ. 8 కోట్లతో నిర్మించనున్న ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్, ఆర్అండ్‌బి సబ్ డివిజనల్ కార్యాలయంకు, రూ.2 కోట్లతో నిర్మాణాలు చేపట్టనున్న గోవిందాపురం బ్రిడ్జ్‌లకు శంకుస్థాపనలు చేశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరికీ ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి చేస్తామని రాష్ట్ర భారీనీటిపారుదల,పౌరసరఫరాల శాఖా మాత్యులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో లిఫ్ట్‌లను మరమ్మత్తులు చేయించి పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చేసి ఆయకట్టును పెంచుతామన్నారు. రహదారులన్నీ డబుల్ రోడ్లుగా చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం సాగునీరు, విద్య, వైద్యం రహదారలతో ప్రగతి సాధిస్తుందని తెలిపారు. ఫణిగిరి సీతారామస్వామి గట్టు వద్ద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన వారికి అందజేస్తామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మెస్ చార్జీలు,కాస్మోటెక్ చార్జీలను ప్రభుత్వం పెంచడం జరిగిందన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/చింతలపాలెం:** అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు ఉస్తేల నారాయణరెడ్డి అ న్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మం డల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలువేసి నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చింతరాల రవి, గ్రామ కార్యదర్శి దొంగల అంకరాజు, సిపిఐ నాయకులు జియాలుద్దీన్, బాషా, గోనే అంకయ్య, సత్యం, తోకల సైదులు, ఉస్తేల కొండారెడ్డి, పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అనగారిన వర్గాల అభ్యునతికి, సమాజంలోని అసమానలతను రూపుమాపడానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మేకల శ్రీనివాస్, బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి, వెంకన్న పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలన



**ప్రజాపక్షం/దేవరకొండ :** మండల పరిధిలోని పెంచికల్ పహాడ్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు గురువారం అస్వస్థతకు గురికావడంతో శుక్రవారం దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ అధికారులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించామని, ఆహారాన్ని స్వయంగా భోజనం చేసి పూర్తిగా నాణ్యమైనదిగా ఉండడంతో పాటు విద్యార్థుల్లో ఆహారం కారణంగా అస్వస్థత సమస్యలు లేవని గుర్తించామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పట్ల పాఠశాల సిబ్బంది శ్రద్ధ చూపాలని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐ నర్సింహులు, మండల విద్యాధికారి మాతృనాయక్, ఆర్ఐ గోపరాజు, విద్యార్థి, యువజన, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి



ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా :** మహిళలు హార్థిక అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్ర అభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హాలియాలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో సాగర్ నియోజకవర్గం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలపై చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు వెన్నుదన్నుగా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలో 28,290 మహిళా సంఘాలు ఉన్నట్లు తెలిపారు. వీరిలో 4272 సంఘాలకు రూ.191.41 కోట్ల రుణాలను టార్గెట్‌గా నిర్ణయించినట్లు చెప్పారు. 1105 సంఘాలకు 132.72 కోట్ల మేర రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ 100 ఏళ్ల ప్రస్థానం అజేయం..అజరామరం

సిపిఐ 100 వసంతాల బహిరంగ సభను జయప్రదం చేయండి : పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/డిండి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 ఏళ్ల సుధీర్ఘ పోరాట ప్రస్థానం అజేయం, అజ రామ రం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. గురువారం రాత్రి డిండి మండలంలోని ఖానా పూర్ సిపిఐ గ్రామశాఖ సమావేశం కొత్తగొల్ల పెద్ద జంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, దున్నేవాడికి భూమి కావాలని పేద ప్రజల పక్షాన పోరాటం చేసి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ సిపిఐదని, నిజాం నిరంకుశ పాలనను అంతం చేసేందుకు మట్టి మనుషులే మర ఫిరంగులై బడిసెలు, ఒడిసెల రాళ్లతో దేశ్ ముఖ్‌లు, జగిర్దార్లకు వ్యతిరేక పోరాటం చేసి నైజం నవాబును పరుగెత్తించిన చరిత్ర సిపిఐ పార్టీదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల్లో పార్టీ నిర్మాణం ఉన్నటువంటి గ్రామాల్లో ప్రతిని ధ్యం ఉండేలా పోటీకి సిద్ధం కావాలని, నూతన సభ్యత్వం అందించి పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. డిసెంబర్ 26న సిపిఐ 100 వసంతాల సందర్భంగా గ్రామ గ్రామాన ఎర్ర జెండాలను ఎగరవేసి, దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో జరిగే రెడ్ షర్ట్ కవాతును జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ అనంతరం ఎన్జీ కళాశాలలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని,ఈ బహిరంగ సభ విజయవంతానికి పార్టీ కార్యకర్తలు, నా యకులు, మహిళలు, శ్రామికులు, రైతులు, పార్టీ ప్రజా సంఘాల నాయకులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి,మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, మండల సహాయ కార్యదర్శి విజేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు హుస్సేన్, గ్రామశాఖ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సినియర్ నాయకులు లచ్చయ్య, సింగిల్ విండో డైరెక్టర్ మల్లికార్జున్, వెంకటయ్య, శాఖ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, రచయిత, గొప్ప పండితుడు అయిన అంబేద్కర్ ఆలోచనలు, నిర్ణయాలు నేటికి మూలాధారాలేనన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి, స్కైలాబ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బలహీనవర్గాల అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ సయిద్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వలపట్ల వెంకన్నలు అన్నారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కె.రహీం, వెంకన్న, బాబా పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు పటిష్ట భద్రత ఏర్పాట్లు

* భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవత్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా నార్కట్ పల్లి మండలం బ్రమ్మణవెళ్ళంల ప్రాజెక్ట్, మెడికల్ కళాశాల ప్రారంభ కార్యక్రమం హెలిప్యాడ్, సభా ప్రాంగణం,దామరచర్ల థర్మల్ విద్యుత్ పరిశీలించి ఏలాంటి అవాంచనీయ సం ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. సిఎం పర్యటనలో భాగంగా బందోబస్తుగా ఐజి, డిఐజి, ఐదుగురు ఎస్‌పిలు,10 మంది అడిషనల్ ఎస్‌పిలు,25 మంది డిఎస్‌పిలు,75 మంది సిఐలు 170 మంది ఎస్.ఐలు సిబ్బంది 2500 మందితో పటిష్ట బందోబస్తు, భద్రతా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్ కళాశాల ప్రారంభ అనంతరం పబ్లిక్ మీటింగ్ కి వచ్చే ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మార్గదర్శకాలు, పార్కింగ్ స్థలాలు తదితర ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి పోలీస్ అధికారులు సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశలలో అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వర్తించే సమయంలో సంయమనం పాటించాలని, ట్రాఫిక్ డైవర్షన్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని తెలిపారు. సభ పూర్తి అయ్యేవరకు పటిష్ఠ భద్రత కల్పించాలని ఆదేశించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ హనుమంతరావు





**ప్రజాపక్షం/యాదాద్రి :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వలన గావించి యోగా కార్య క్రమం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగ చాలా ము ఖ్యమైందని తెలిపారు. జీవితంలో సాధించాలంటే మొ దట ఆరోగ్యంగా ఉండాలన్నారు. యోగా వల్ల మానసిక పరిపక్వతతో పాటు శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ఈ యోగా అనేది ఒక్క రోజుకే పరిమితం కాదని, సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని సూచించారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులకు యోగ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాఠ్యాంశాలలో కూడా యోగ ప్రాముఖ్యత గురించి పొందుపరచాలన్నారు. యోగా వలన మెదడు కు ఆక్సిజన్ సంపూర్ణంగా అందుతుందన్నారు. ఉద్యోగంలో పని ఒత్తిడి తగ్గించుకోవాలంటే యోగా వలన ఒత్తిడిని తగ్గించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా రెవిన్యూ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి ధనంజేయ, యోగ మాస్టర్ శివ పాల్గొన్నారు.

# నెర్మటలో పెద్దమనుషులతో పంచాయతీ!

### గ్రామ ప్రజలు విస్మయం

**ప్రజాపక్షం/చండూరు :** నల్లగొండ జిల్లా చండూరు మండలం నెర్మట గ్రామంలో. మండల కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో నెర్మట గ్రామానికి చెందిన కొంత మంది ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను ఎవ్వరితో చెప్పుకుందామని వెళ్లిన కొద్ది గంటల్లోనే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ తమ వైపు తిప్పుకొనికూడా తమ సమస్యను వినడానికి చేస్తూ అలాగే ఉంచి ఈ సమస్యను మేమే పరిష్కరించాలి గాని మీరు ఎవరు అని ఇబ్బందులకు గురి చేస్తూ కొంత కాలంగా సమస్యలు సృష్టించే పనిలో నాలుగు దోతులు ఆరు పా యింట్ల పెద్దమనుషులు చెలా మణి అ వుతున్నారు. గత కొంత కాలంగా చదువుల ని మిత్తం ,ఉద్యోగాల కోసం హైదరాబాద్‌లో చదువుతున్న విద్యార్థులను కూడా గ్రామ పంచాయితీ సమస్యలలో ఇరికించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, మహిళలను కుడా చేయని తప్పులకు బాధ్యులను చేస్తూ పోలీస్ స్టేషన్ పిటిషన్‌లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తూ తమ పంతం నెగ్గించుకుంటున్నారు. ఇదిఅన్యాయం అని ప్రశ్నిస్తే భూమి తగాదాలు , హద్దు రాళ్లను పీకడం , బాట సమస్యలు సృష్టించడం, ఒకరి భూమినుండి మరొకరి భూమిలోకి నీరు పోకుండ ఆపడం వంటి సమస్యలను సృష్టిస్తారని పలువురు తెలిపారు. ఈ పెద్ద మనుషులు చేసే ఆగడాలను చూసి గ్రామ ప్రజలు బెంబేలెత్తే పరిస్థితి వచ్చిందంటున్నారు.

### పెద్దమనుషులతో తీవ్రమైన ఇబ్బందులు

బాధితుడు నారపాక ముత్తయ్య



తమ సమస్యను పరిష్కరించమని పెద్దమనుషుల దగ్గరికి వెళ్లి తే సమస్య పరిష్కా రం కాని వ్వడం లేదని, ఇంత తొందరగా సమస్యను పరిష్కరిస్తే మేమేట్ల బతకాలని అంటున్నారని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దోతు లు ఆరు పాయింట్ల గ్రామ పెద్దమనుషులో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నారపాక ముత్తయ్య అన్నారు.

## యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కిన్నెర హరికృష్ణ ఎన్నిక



**ప్రజాపక్షం/దేవరకొండ :** యువజన కాంగ్రెస్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో భాగంగా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలంలోని తేల్దేవరపల్లి గ్రామానికి చెందిన కిన్నెర హరికృష్ణ నియోజకవర్గ అధ్యక్షులుగా రెండవసారి ఎన్నికయ్యారు. తాను విద్యార్థి దశ నుండి నమ్ముకున్న రాజకీయ గురువు ఎంఎల్‌ఏ బాలునాయక్ అడుగు జాడల్లో నడుస్తూ 2007 నుండి కాంగ్రెస్ విద్యార్థి సంఘంమైన ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కిన్నెర హరికృష్ణ బాలునాయక్ ప్రోత్సాహంతో నిరంతరం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తూ అంచెలంచ లుగా రాజకీయంగా అభివృద్ధి చెందాడు. 4 సంవత్సరాల పాటు ఎన్ఎస్‌యూఐ లో పనిచేసిన అనంతరం 20 12లో యువజన కాంగ్రెస్ చందంపేట మండల అధ్యక్షులుగా పనిచేశారు. దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సమావేశాలు, ర్యాలీలు ఏర్పాట్లు చేస్తూ, తన బాధ్యతగా యువజన కాంగ్రెస్‌నీ బలోపేతం చేస్తూ, అనాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై పోరాటాలు సాగించి, బాలునాయక్ నమ్మకస్తుల్లో ఒకరిగా ప్రధాన అనుచరునిగా ఎదిగిన హరికృష్ణని గత సెప్టెంబర్ నెలలో జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికలలో ఎంఎల్‌ఏ మరోసారి అవకాశం కల్పించి పోటీలో ఉం చా రు. ఇటీవల వెలువడి ఫలితాల్లో రెండోసారి దేవరకొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా కిన్నెర హరికృష్ణ ఘన విజయం సాధించారు.

## సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రజలందరికి విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఇండ్ల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు నల్ల నరేందర్ అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ విద్య,వైద్యం, ఉపాధి సాధన జేఏసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు రెండవ రోజు కొనసాగాయి. బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కొత్త నర్సింహాస్వామి, సాయిని యాదగిరిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నల్ల నరేందర్ మాట్లాడుతూ ప్రజలందరికి విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రిప్రసెంటేషన్ ఇచ్చినప్పటికీ, ధర్నా నిర్వహించినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేనందున రిలే నిరాహారదీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే నిరుపేదలైన బిసి,ఎస్సి,ఎస్టీలకు నాణ్యమైన ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలని, నిరుద్యోగుకు ఉపాధి, అర్హులైన వారికి సాగునీటి వసతి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని డి మాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆమరణ నిరాహారదీక్షకు సైతం పునుకుంటామని హెచ్చరించారు. ఈ దీక్షలకు సామాజికవేత్తలు బట్టు రాంచంద్రయ్య, కొడారి వెంకటేష్, కర్తల శ్రీను, బర్రె సుదర్శన్, రవివర్ధన్, మెడి కోటేష్, ఎస్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర నాయకులు రాజేష్ నాయక్, జిల్లా నాయకులు రాజు నాయక్, భాస్కర్ నాయక్, సంతోష్ నాయక్, శేకర్‌లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు లిం గస్వామి మహారాజ్, మహేష్ మహారాజ్, శ్రీకాంత్ మహారాజ్, పాల్గొన్నారు.

## విమానాశ్రయ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి: ఎంపి అరవింద్



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం నిర్మిస్తామని గత టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడు కూడా కేంద్ర ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకోలేదని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ పనులు చేపట్టడం పేపర్లలో కాదు చేతల్లో చూపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేము ఇది చేస్తాం అది చేస్తాం ఎక్కడ మీటింగ్ అయితే అక్కడే ఏదోకటి కొత్తడి చెబుతున్నారని, ప్రగల్భాలు పలకడమే తప్ప కేంద్రానికి ఇప్పటివరకు సిఫారసు చేయలేదని విమర్శించారు. తాను పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురలీధర్ మోహుల్‌ను కలిసి అడగగా కేంద్ర ప్రభుత్వానికి గత 11 సంవత్సరాల నుండి రాష్ట్రం నుండి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని తెలిపారని వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలో బ్రౌన్‌ఫీల్డ నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి సాంకేతికంగా వీలున్నట్లు వారు తెలిపారన్నారు. విమానాశ్రయ ఏర్పాటు అంశంలో టీపీసీసీ చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి కేంద్రానికి త్వరగా ప్రతిపాదనలు పంపాలన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: విద్యుత్ షాట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన సంఘటన శుక్రవారం జరిగింది. మోపాల్ మండలం బోర్గాం (పి) 5వ డివిజన్ కామర్స్ నడ్పి గంగారాం చెందిన ఇల్లు విద్యుత్ షాట్‌సర్క్యూట్‌తో దగ్ధం కావటంతో ఇంటిలోని వస్తువులన్ని ఖాళీ బూడిదయ్యాయి. బాధితులు తెలిపిన ప్రకారం బాబాయి కూతురు ఎంగేజ్‌మెంట్ ఉండటంతో ఆర్సపల్లికి వెళ్లిన మాకు ఇంటిలో మంటలు చెరగటంతో స్థానికులు సమాచారమివ్వగా హుటాహుటిన ఇంటి వద్దకు చేరుకున్నా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారని, అప్పటికే ఇంటిలో ఫ్రిడ్జ్ దగ్గర మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం కాలిపోయినట్లు తెలిపారు. ఇంట్లో వివాహం కోసం దాచుకున్న బంగారు నగలు డబ్బు అన్ని ఖాళీ బూడిదయ్యాయని తినడానికి సరుకులు లేక రోడ్డున పడ్డామని సుమారు తొమ్మిదిలక్షల వరకు ఆస్తి నష్టమైందని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

## వరినాట్లు ప్రారంభించిన రైతన్నలు



ప్రజాపక్షం/ఎడపలి: ఖరీఫ్ వరి పంట నూర్పిడి ముగియగానే రైతులు రబీ పంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గత నెల రోజుల క్రితం నుంచే వరి నారు సిద్ధం చేసుకున్నారు. ఎడపల్లి మండలంలో రబీ పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. బోరు బావుల వద్ద రైతులు వరి నారు మళ్లను సిద్ధంగా ఉంచుకొని రైతులు విత్తనాలు వేశారు. నారు పెరిగి పెద్దదవుతున్న తరుణంలో బోరు బావుల వద్ద సిద్ధం చేసుకున్న పంట పొలాల్లో వరి నాట్లు వేయడం ప్రారంభించారు.యూపీ, బీహార్ నుంచి వచ్చిన సుమారు వంద మంది కూలీలు ఎడపల్లి మండలంలోని అంబం, బాపునగర్ తదితర గ్రామ శివారులో నాట్లు వేయడం ప్రారంభించారు. వరినాట్లకు ఎకరాకు రూ. నాలుగు వేల చొప్పున కూలి చెల్లిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

## పింకీ కుమారికి సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి: ఫింగర్ ప్రింట్ బ్యూరోలో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పింకి కుమారికి సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి లభించినందు వలను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ 2020 తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి చేపట్టిన నియామకాలలో పింకి కుమారి పింగర్ ప్రింట్ బ్యూరోలో ఎ.ఎస్.ఐ గా నియాకమైన సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖలో గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డిజిపి షీకాగోయల్ రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది ఫింగర్ ప్రింట్ ఏ.ఎస్.ఐ లకు సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వెలువరిచారన్నారు. పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని సర్వీసులో ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని ఆశిస్తున్ననని పదోన్నతి పొందిన ఎస్ఐ కి శుభాకాంక్షలు తెలిపారు.

## బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు



ప్రజాపక్షం/పాపన్నపేట: బాల్య వివాహాల వల్ల సమాజంలో ఎన్నో అనార్థాలు జరుగుతున్నాయని విజన్ సొసైటీ ఆర్గనైజర్ కరాటే రవి అన్నారు. ఆయన శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు బాల కార్మికులు బాలికల వేధింపులు బాలల అక్రమ రవాణా అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## నేడు కామారెడ్డి జిల్లాలో మంత్రి జూపల్లి పర్యటన

ప్రజాపక్షం/నిజాంసాగర్: పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావ్‌లతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 8.30 గం.లకు మద్నూర్ మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన, మద్నూర్ ఏఎంసీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొంటారు. ఉదయం 11 గం.లకు కౌలాస్ కోటను సందర్శిస్తారు. 12.15 గం.లకు నిజాంసాగర్ ప్రాజెక్టు సందర్శన, 1.15 గం.లకు లింగంపేట్ నాగన్నబావి సందర్శన, 3.20 గం.లకు నాగిరెడ్డిపేట తాండూర్ గ్రామంలోని త్రిలింగేశ్వర స్వామివారిని వారు దర్శించుకోనున్నారు. సాయంత్రం 4 గం.లకు పోచారం ప్రాజెక్టును తిలకించనున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి.

# గృహ జ్యోతి పథకం వినియోగదారులకు వరం

కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి: గృహ జ్యోతి పథకం విద్యుత్ వినియోగదారుల పాలిట వరమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం మెదక్ పట్టణం టీఎస్ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు ఆరో రోజులో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గృహ జ్యోతి పథకం పై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 1 లక్ష, 26 వేల గృహాలకు 31.36 కోట్ల వరకు గృహ జ్యోతి విద్యుత్ వినియోగదారులు వినియోగించుకున్నారని, ఇంకను 12,000 మంది గృహ జ్యోతిలో నమోదు కావాల్సి ఉందని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులు నియమించి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు 92.72 కోట్లు ఎస్‌సి ఎస్‌టి వినియోగదారులకు 3.35 కోట్లు, నాయి బ్రాహ్మణులు, రజకులకు 3.22 విద్యుత్ వినియోగం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. జిల్లాలో వందశాతం గృహ జ్యోతి పథకం అమలైందని చెప్పారు. కరెంటు రైతులకు కోతలు లేకుండా నిరంతరాయ విద్యుత్ అందించి సమృద్ధిగా పంటలు పండించడం జరిగిందని పంజాబ్, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రేషన్ కార్డు కలిగి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు జీరో బిల్లు అందిస్తున్నట్టు చెప్పారు. పేదల సంక్షేమమే ఎజెండాగా రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీల పథకాలను అమలు చేస్తుందని కలెక్టర్ వివరించారు. రజకులకు ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు గృహ జ్యోతి ఉచిత విద్యుత్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లాలో 8 సబ్ స్టేషన్స్ కొత్తగా రావడం జరుగుతుందని 25 కెవి, 63, 160 ట్రాన్స్ఫార్మర్స్ లో వోల్టేజ్ నిర్మూలనకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి సమావేశాలలో మాట్లాడిన విధంగా ప్రభుత్వ పథకాల ద్వారా 500 రూపాయలకు వంట గ్యాస్, ఫ్రీ బస్ గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ ఈ పథకాల ద్వారా ఒక కుటుంబం నెలకు 10,000 ఆదాయం రాయితీ పొందుతున్నారని చెప్పారు. కరెంటు కోతలు లేకుండా నిరంతరాయ విద్యుత్ అందిస్తూ, విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పునరుద్ధరిస్తూ ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తూ విద్యుత్ శాఖ యొక్క సేవలు అభినందనీయమని కొనియాడారు.జిల్లాల గృహ జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శంకర్, డిఈ ఆపరేషన్ మెదక్ చాన్ షరీఫ్ బాషా, తూప్రాన్ డి.ఈ ఆపరేషన్ గరుత్మంత రాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అదనపు డిసిపి (అడ్మిన్)గా బస్వారెడ్డి బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : అదనపు డిసిపి (అడ్మిన్)గా బస్వారెడ్డి బాధ్యతలను శుక్రవారం సాయంత్రం కోటేశ్వర్‌రావు నుండి బాధ్యతలను పోలీసు కార్యాలయంలో స్వీకరించారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇన్స్‌పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ అధికారులు అతిథుల తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా మామడ మండలం పొన్కల్ ప్రభుత్వ పాఠశాల ఎన్ సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా విద్యార్థులో ప్రశ్నించే తత్వం, కొత్త విషయాలు నేర్చుకోవాలన్న కుతూహలం, శోధన, పరిశీలన వంటివి పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం రెండు రోజులపాటు కొనసాగుతుందని విద్యార్థులకు ఆచరణాత్మక విద్యను అందించడం ద్వారా సొంతంగా ఇటువంటి వైజ్ఞానిక అవిష్కరణలు తయారు చేయగలుగుతారని అన్నారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో జిల్లా లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుండి దాదాపు 800 మంది విద్యార్థులు తమ ప్రదర్శనలను ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం ఎన్ సిసి అధికారులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరినీ కలెక్టర్ అభినందించారు. ఈ



కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి పి.రామారావు, గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలి, తహసిల్దార్ రాజు, ఎసిజిఈ పద్మ, ఎస్ ఓ సలోమి కరుణ, విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం నాణ్యత, తేమ పరిశీలన



కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ప్రజాపక్షం/చింతలమానెపల్లి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం చింతలమానేపల్లి మండలంలో కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల తో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం నాణ్యతను పరిశీలించి, తేమ ఎక్కువ లేకుండా చూసుకోవాలని, మబ్బులు ఎక్కువగా వస్తుండడంతో ధాన్యం తడవకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, రైతులకు టార్పాలిన్లు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వరి ధాన్యం తీసుకువచ్చి ఎన్ని రోజులు అవుతుందని, కాంట కావడానికి ఇంకెన్ని రోజులు సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి అక్కడున్న సమస్యలను కార్యాలయ సిబ్బంది, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అలాగే రెవెన్యూ సమస్యలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం తదితర వివరాలను ఎంపిడిఓ, తాసిల్దారును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసిల్దార్ మునావర్ షరీఫ్, ఎంపిడిఓ కోట ప్రసాద్, ఎంపిఓ సుధాకర్ రెడ్డి, అయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పే స్కేల్ అమలు చేయాలని రిలే నిరాహార దీక్షలు..




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని శాంతియుత రిలే నిరాహార దీక్షలు నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ముందు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భూసరపు గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఈ నెల 6,7,9 తేదీలలో రాష్ట్రం లోని అన్ని జిల్లాలు శాంతియుత రిలే నిరాహార దీక్ష చేస్తున్నాము,ఒకవేళ డిసెంబర్ 9 లోపు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష రాష్ట్ర సంఘ సభ్యులను పిలిచి ఉద్యోగులదర్నీ క్రమబద్ధీకరిస్తున్నాము లేదా పే స్కూల్ అమలు చేస్తున్నాము అన్ని వ్యక్తం చేసే వరకు ఈ శాంతియుత నిరాహార దీక్షలు కొనసాగుతాయని ప్రతి జిల్లా తరపున ఆవేదనను వ్యక్తం చేస్తున్నాము,ప్రభుత్వం చర్చలకు పిలిచి అందరికీ న్యాయం చేయాలని కోరారు.అనంతరం నిర్మల్ జిల్లా ఉపాధ్యాయ సంఘం జిల్లా తపస్ సంఘం అధ్యక్షులు,కార్యదర్శులు నవీన్,వి.సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా సంఘం మీ శాంతియుత రిలే నిరాహారదీక్షలకు సంపూర్ణ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని తెలపారు.జిల్లా విద్యాశాఖ సమన్వయ కర్త లింబాద్రి వచ్చి ఉద్యోగులందరి తరుపున సంఘీభావం తెలుపుతున్నమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాంధారి రాజరత్నం,కోశాధికారి గజేందర్,నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో జిల్లా అధికారులు భేష్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కితాబు

ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం పనితీరు బేష్‌గా ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ప్రశంసించారు. ఇతర అన్ని జిల్లలతో పోలిస్తే ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పన మార్పులు, చేర్పులకు సంబంధించి దాఖలైన దరఖాస్తులు పరిష్కారం, రికార్డుల నిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని సంతృప్తి వెలిబుచ్చారు. జిల్లా పర్యటనకు హాజరైన సీఈఓ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో కొనసాగుతున్న రూరల్ నియోజకవర్గ ఈఆర్ఓ ఆఫీస్‌ను, బోధన్‌లోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని బోధన్ నియోజకవర్గ ఈఆర్ఓ ఆఫీస్‌లను సందర్శించారు.



నోటీసు బోర్డులపై అతికించిన ముసాయిదా ఓటరు జాబితాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, చిరునామాల మార్పు, పేర్ల తొలగింపు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంలో మార్గదర్శకాలు పాటించారా లేదా అని రికార్డులను పరిశీలించి నిర్ధారణ చేసుకున్నారు. జిల్లాకు అనుకుని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఉన్నందున పొరుగు రాష్ట్రంలో ఓటు హక్కు కలిగి ఉన్న పలువురు స్థానికంగా కూడా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశముంటుందన్నారు. అనంతరం వినాయక్‌నగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బియులు, సియులు, వివి ప్యాట్ల భద్రత ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్, బాన్సువాడ సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, కిరణ్మయి, మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్ ఉన్నారు.

## మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో యూత్ అధ్యక్షుడికి సన్మానం

ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల యూత్ అధ్యక్షుడుగా ఎన్నికైన లౌడ్యా రామచందర్ నాయక్ శుక్రవారం మైనంపల్లి హనుమంతరావు స్వగృహంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. మండల యూత్ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్ నాయక్ శాలువాతో సన్మానించి అభినందించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు పరశురాం గౌడ్, శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## భద్రత లేని బడి బస్సులు.. ప్రమాదంలో పిల్లల ప్రాణాలు ?

అటెండర్ లేకుండానే విద్యార్థులను తరలిస్తున్న వైనం




ప్రజాపక్షం/దండేపల్లి: దండేపల్లి మండలం మేదర్ పేటలోని బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా బడి పిల్లలను బస్సుల్లో తరలిస్తున్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం బడి పిల్లలను తరలించేందుకు పాఠశాలలు ఏర్పాటు చేసిన బస్సుల్లో డ్రైవర్ తో పాటు క్లీనర్ లేదా అటెండర్ తప్పని సరిగా ఉండాలి. కానీ మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాల యాజమాన్యం తమకు అవేమి పట్టవన్నట్లు వ్యవహరిస్తూ డోర్ వద్ద అటెండర్ లేకుండానే పిల్లలను బస్సుల్లో పాఠశాలకు తరలిస్తుంది. చిన్న వయస్సు ఉన్న పిల్లలు బస్సులో క్లీనర్ లేకుండా ఎక్కడం, దిగడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా బస్సు దిగిన అనంతరం రోడ్డు దాటించేందుకు ఎలాంటి సహాయకులు లేకపోవడంతో మెయిన్ రోడ్డున దిగిన పిల్లలు తమ ఇండ్లలోకి వెళ్ళాలంటే భయభయంగా రోడ్డుదాటాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ఇలాంటి నిర్లక్ష్యపు వైఖరిపై దృష్టిపెట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైన జిల్లా విద్యా శాఖ, రవాణా శాఖ అధికారులు మండలం లోని స్కూల్ బస్సులపై నిఘా పెట్టి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్కూల్ బస్సుల, ఇతర రవాణా సౌకర్యాలపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కళ్ళు మూసుకుని నిరాహార దీక్ష !



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ముందు చేపడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు రిలే నిరాహార దీక్షలు 5వ రోజుల చేరుకుంది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు భూక్య రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైన తమ కళ్ళు తెరిపించాలని, జిల్లా అధికారులు ఈరోజు బడ్జెట వస్తది రేపు వస్తది ఎల్లుండి వస్తది అంటూ సోయిలేని మాటలు మాట్లాడుతున్నారు. కాబట్టి మాటలు వినలేక కళ్ళు మూసుకొని ఈరోజు సిగ్గుచేటుగా భావించి నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ముందు కనులు మూసుకొని రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని అన్నారు. వంట కార్మిలకు జనవరి నుండి కోడిగుడ్ల బిల్లులు ఇంకా చెల్లించలేదని 2000 వేతనము జూన్ నుండి ఇవ్వాలని చెప్పేసి అదే రకంగా ప్రతి పాఠశాలలో వంట షెడ్లు వంట పాత్రలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. వంట పాత్రలకు బడ్జెట్ వచ్చి నెలలు గడుస్తున్న టెండరింగ్ అయింది. అంటూ అధికారులు చెబుతున్నాడు తప్ప ఇప్పటి వరకు ఒక్క పాఠశాలకు కూడా వంట పాత్రలు అందలేదు ఒక్కో విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం కోడి గుడ్డుకు ఐదు రూపాయలు చెల్లిస్తున్నది బహిరంగ మార్కెట్లో ఏడు రూపాయలకు కోడిగుడ్డు దొరుకుతున్నది నాణ్యమైన భోజనం పెట్టమంటున్నారు. ఈ గ్యాస్ సిలిండర్ కోడిగుడ్లు ప్రభుత్వమే సరపర చేయాలి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో చెప్పిన విధంగా నెలసరి వేతనం రూపాయలు 10000 ఇవ్వాలని వంట కార్మికులను పాఠశాలలలో ఉపాధ్యాయులు మనుషులుగా చూడాలని తక్షణమే కార్మికులకు గుర్తింపు కార్డులు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. యూనిఫామ్ కూడా ఇవ్వాలి పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఒక వంట కార్మికురాలను నియమించాలి. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు, మొనవ్వ రజిత, భాగ్య చిట్యాల లక్ష్మి , హంస మానస, ఉమా, ప్రమీల అన్ని మండల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహించాల్సిన విధానంపై మున్సిపల్ కమీషనర్లు, ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మొబైల్ యాప్‌ను వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సిన తీరును అంశం వారిగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఏయే అంశాలను పరిశీలించాలి, మొబైల్ యాప్‌లో వివరాలను ఏవిధంగా పొందుపర్చాలనే అంశాలను పీపీటీ ద్వారా ప్రయోగాత్మకంగా వివరించి కలెక్టర్ మాట్లాడారు.అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, మేనేజర్ కార్తీక్ పాల్గొన్నారు.

# క్రీడ

## పింక్ బాల్ టెస్టులో డే 1 పూర్తి

### తొలి రోజు ఆసీస్‌దే పైచేయి!



అడిలైడ్ వేదికగా భారత్ ఆస్ట్రేలియాతో మధ్య జరుగుతున్న డే/నైట్ టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. తొలి రోజు ఆట పూర్తయ్యే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 94 పరుగుల వెనకంజలో ఉంది. ప్రస్తుతం ఆసీస్ స్కోర్ 861. క్రీజులో నాథన్ మెక్‌స్వీనే (38 పరుగులు), మార్నస్ లబుషేన్ (20 పరుగులు) ఉన్నారు. భారత బౌలర్లలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఒక్కడికే తొలి రోజు వికెట్ దక్కింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులుకే ఆలౌటైంది. నితీశ్ కుమార్ రెడ్డి (42; 54 బంతుల్లో, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. కేఎల్ రాహుల్ (37; 64 బంతుల్లో, 6 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (31; 51 బంతుల్లో, 5 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (22; 22 బంతుల్లో, 3 ఫోర్లు), రిషభ్ పంత్ (21; 35 బంతుల్లో, 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (3 పరుగులు), స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (7 పరుగులు) నిరాశ పర్చారు. యంగ్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ (0) పరుగుల ఖాకా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6 వికెట్లతో విజృంభించాడు. ప్యాట్ కమిన్స్ , స్కాట్ బొలాండ్ చెరో 2 వికెట్లు దక్కించుకున్నారు. 2024లో టెస్టుల్లో 50 వికెట్ల మార్క్ అందుకున్న తొలి బౌలర్‌గా స్టార్ పేసర్ బుమ్రా నిలిచాడు. ఉస్మాన్ ఖవాజాను ఔట్ చేసిన బుమ్రా ఈ రికార్డు నెలకొల్పాడు. అలాగే ఓ క్యాలెండర్ ఇయర్‌లో టెస్టులో 50వికెట్లు పడగొట్టిన మూడో భారత పేసర్‌గా బుమ్రా చరిత్రకెక్కాడు. అంతకుముందు ఈ ఘనత కపిల్ దేవ్, జహీర్ ఖాన్ మాత్రమే అందుకున్నారు. కాగా, 31 ఏళ్ల బుమ్రా ఈ ఏడాది ఆడిన 11 టెస్టులో 50 వికెట్లు నేలకూల్చాడు. ఎకానమీ రేటు 3 మాత్రమే ఉండడం గమనార్హం.

## సిరాజ్ అత్యుత్సాహం..

### లబుషేన్‌ను బంతితో కొట్టిన డిఎస్‌పి!

టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ హద్దులు దాటాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో సిరాజ్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించాడు. సహనం కోల్పోయి ప్రత్యర్థి బ్యాటర్ పైకి బంతిని విసిరేసాడు. సిరాజ్ చర్య పట్ల అంపైర్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.



**అసలేం జరిగిందంటే..?**

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. మహమ్మద్ సిరాజ్ వేసిన 25వ ఓవర్ నాలుగో బంతిని ఆడేందుకు ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ మార్నస్ లబుషేన్ నిరాకరించాడు. సిరాజ్ రనప్ పూర్తి చేసి బంతి వేసే క్రమంలో క్రీజు నుంచి పక్కకు తప్పుకున్నాడు. దాంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సిరాజ్.. బ్యాటర్‌వైపు బంతిని విసిరేసాడు. దాంతో సహనం కోల్పోయిన లబుషేన్.. సిరాజ్‌తో వాగ్వాదానికి దిగాడు. ఫీల్డ్ అంపైర్ జోక్యం చేసుకొని ఇద్దరికి సర్ది చెప్పాడు. సిరాజ్‌ను మందలించాడు. సైట్ స్క్రీన్‌కు అడ్డంగా ఓ అభిమాని రావడంతో లబుషేన్ బ్యాటింగ్ చేసేందుకు నిరాకరించాడు. అయితే సిరాజ్ చేసిన పనిపై సర్వత్రా విమర్శలు వ్యక్త మవుతున్నాయి. హైదరాబాద్ డీఎస్పీ అయిన సిరాజ్ ఇలా క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించడం సరికా దని మండిపడుతున్నారు. ఈ మ్యాచ్ అనంతరం నిబంధనల మేరకు సిరాజ్‌పై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



## ముగిసిన జాతీయ సబ్ జూనియర్ హాకీ

### మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదికగా హైదరాబాద్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏడాది కాలంలోనే సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడారంగంలో సమూల మార్పులు సాధించామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు.ఈరోజు సికింద్రాబాద్ ఆర్ ఆర్ సి గ్రౌండ్ లో జరిగిన 14వ జాతీ య సబ్ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్ షిప్ ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి హాజరైనారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది సంవత్సరాల నుండి నిర్వీర్యం అయిపోయిన క్రీడారంగానికి జీవసత్వాలు కల్పించే దిశగా ఈ ఏడాది కాలంలో అనేక చర్యలు చేపట్టామని అన్నారు . హైదరాబాద్ ఖ్యాతిని పెంచేందుకు జాతీయ అం తర్జాతీయ పోటీలకు ఆతిథ్యం ఇస్తామని ఆయన తెలిపారు. ఒకవైపు మెగా టోర్న మెంట్లు నిర్వహిస్తూనే గ్రామీణ క్రీడాకారులకు చేయూతని అందిం చేందుకు సిఎం కప్ 20 24 ను నిర్వహిస్తున్నామని ఆయన తెలి పారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో దా దాపు 11 రోజు లపాటు 44 మ్యాచులు నిర్వహణ జరిగిందన్నారు. శుక్రవారం మధ్యప్రదేశ్ ఝార్ఖండ్ రాష్ట్రాల మధ్య జరిగిన ఫైనల్ పోటీలను ఆయన ప్రారం భించి,మ్యాచ్ ను తిలకించారు. ఫైనల్ లో నెగ్గిన జార్ఖండ్ జట్టుకు మూడు లక్ష ల రూపాయల నగదు బహుమతి, రెండో స్థానంలో నిలిచిన మధ్యప్రదేశ్ జట్టుకు 2 లక్షల రూపాయల పురస్కారం, మూడో స్థానంలో నిలిచిన మిజోరం జట్టుకు లక్ష రూపాయలు నగదు పురస్కారాన్ని స్పోర్ట్స్ అథారిటీ అందజే సింది. విజేతలకు ట్రోఫీతో పాటు మెడల్స్ ను బహుకరించారు. ఈ కార్య క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వ క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి,మైనారిటీ వి ద్యాసంస్థల వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి, హాకీ ఇండియా సెక్రెటరీ భోలేనాథ్ సింగ్ జి, కోశాధికారి శేఖర్ జె.మనోహరన్, సహా య కార్యదర్శి ఫిరోజ్ అన్సారి, సౌత్ సెంట్రల్ రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్ , తెలంగాణ హాకీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొండా విజయకుమార్ భీమ్ సింగ్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## భారతీయ సిని చరిత్రలో పుష్పగాడి రికార్డ్

టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారిన 'పుష్ప2' దేశవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ జీనియస్ సుకుమార్ ప్రేక్షకులకు సాలిడ్ ట్రీట్ ఇచ్చారు. ఇక ఈ సినిమాలోని కథ, బన్నీ నట విశ్వరూపం తో ప్రేక్షకులకు ఫుల్ మీల్స్ లభించాయి. ఇక ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎవరూ ఊహించని రికార్డులను క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు ఏకంగా రూ.294 కోట్ల వసూళ్లతో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటివరకు ఏ ఇండియన్ సినిమా కూడా ఈ స్థాయిలో ఓపెనింగ్ కలెక్షన్స్ రాబట్టలేదని మేకర్స్ తెలిపారు. దీంతో అల్లు అర్జున్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. ఇక ఈ సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఈ కలెక్షన్స్ మరింత పెరగడం ఖాయమని సినీ సర్కిల్స్ చెబుతున్నాయి. అటు హిందీ వర్షన్‌లోనూ ఈ సినిమా తొలిరోజు ఏకంగా రూ.72 కోట్ల వసూళ్లు సాధించి మరో రికార్డు క్రియేట్ చేసింది. ఇలా పుష్ప2 రికార్డులకు ఎసరు పెడుతుండటంతో, ఈ మూవీ ఎలాంటి విధ్వంసం క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

# రీల్

## పవర్ ప్యాక్డ్ యాక్షన్‌తో 'జాట్' టీజర్



టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని ప్రస్తుతం బాలీవుడ్ హీరో సన్నీ డియోల్‌తో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాకు 'జాట్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుండి మేకర్స్ తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ రివీల్ చేశారు. 'జాట్' చిత్ర టీజర్‌ను చిత్ర యూనిట్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఆద్యంతం పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో నింపేశాడు దర్శకుడు గోపీచంద్ మలినేని. యాక్షన్ హీరోగా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ఉన్న సన్నీ డియోల్‌ను విధ్వంసకరంగా ప్రెజెంట్ చేస్తున్నాడు మన తెలుగు డైరెక్టర్. హీరో ఎలివేషన్ మొదలుకొని, ఆయన చేసే యాక్షన్ సీన్స్, ఆయన చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో ఈ టీజర్ సాలిడ్‌గా ఉంది. ఇక ఈ టీజర్‌లో థమన్ మరోసారి తనదైన మార్క్ పవర్‌ఫుల్ బీజీఎంతో ఇంప్రెస్ చేశాడు. ఇక జాట్ చిత్రంలో మరో నటుడు రణ్‌దీప్ హూడా విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఇక ఈ సినిమాలో వినీత్ కుమార్ సింగ్, రెజీనా కాసాండ్ర, సయామీ ఖేర్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ నెలలో గ్రాండ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు.




## సూపర్ కూల్ లుక్స్‌తో రామ్ ఫస్ట్ లుక్..

మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో రామ్ పోతినేని హీరోగా నటించిన చిత్రం డబుల్ ఇస్మార్ట్ తో ఈ ఏడాది పలకరించిన సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా అనుకున్న రేంజ్ లో సక్సెస్ కాకపోవడంతో రామ్ కం బ్యాక్ కోసం ఇపుడు తన ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమా తర్వాత తాను తన కెరీర్ 22వ సినిమా దర్శకుడు మహేష్ తో అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి తో సాలిడ్ డెబ్యూ అందుకున్న ఈ యువ దర్శకుడు కాంబినేషన్ లో రీసెంట్ గా అనౌన్స్ చేశారు. మరి దీని నుంచి రామ్ పై లేటెస్ట్ గా ఒక సూపర్ కూల్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రామ్ సాగర్ అనే పాత్రలో నటిస్తుండగా ఒక సైకిల్, దానితో ఒక సింపుల్ లుక్ లో రామ్ జోవియల్ గా కనిపిస్తున్నాడు. మరి ఈ సాగర్ మీలో ఒకడు అంటూ పోస్ట్ చేశారు. మరి ఈ సినిమా ఎలాంటి ఎంటర్టైన్మెంట్ ఇస్తుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తుండగా షూటింగ్ పనులు జరుగుతున్నాయి.



## చిరంజీవితో సుకుమార్ టీం , నిర్మాతలు

టాలీవుడ్ ప్రెస్టీజియస్ సీక్వెల్ మూవీ 'పుష్ప2' ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర తాండవం చేస్తోంది. ఈ సినిమాతో ఐకాన్ అల్లు అర్జున్ తన యాక్టింగ్‌తో వేరే లెవెల్ ఎక్స్‌పీరియెన్స్ అందించాడని అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక ఈ సినిమాను జీనియస్ డైరెక్టర్ సుకుమార్ మలిచిన తీరుకి ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. 'పుష్ప2' మూవీకి అన్ని చోట్ల పాజిటివ్ రెస్పాన్స్ వస్తుండటంతో మేకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో చిత్ర దర్శకుడు సుకుమార్, మైత్రీ నిర్మాతలు రవి, నవీన్, సీఈవో చెర్రీ మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. మెగాస్టార్ ఆశీస్సులు తీసుకున్న 'పుష్ప2' టీమ్‌కి చిరంజీవి తన బెస్ట్ విషెస్ తెలిపారు. తెలుగు సినిమా స్థాయిని మరింత ముందుకు తీసుకుళ్తున్నందుకు సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇక సుకుమార్ తన నెక్స్ట్ చిత్రాన్ని గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో చేయనున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనులను త్వరలోనే ప్రారంభించనున్నాడు.

## 'బ్రాహ్మణ వెల్లెముల'తో... లక్ష ఎకరాలకు సాగునీరు

### *ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు ఉత్తమ్, కొమటిరెడ్డి, పొన్నం ప్రభకర్



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** నల్లగొండ జిల్లాలో కరువు ప్రాంతంగా తాండవం చేస్తున్న తరుణంలో ఉదయ సముద్రం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించే బ్రాహ్మణవెల్లెముల ప్రాజెక్టు కు శ్రీకారం చుట్టడం చారిత్రక ఘట్టమని రాష్ట్ర నీటి పారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా పర్యటన సందర్భంగా శుక్రవారం అయన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నాల ప్రభాకర్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి లతో కలిసి నార్కట్ పల్లి మండలం, బ్రాహ్మణ వెల్లెముల బాలెన్సింగ్ రిజర్వాయర్ ను సందర్శించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న బ్రాహ్మణ వెల్లెముల ప్రాజెక్టు పైలాన్ ను, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద నిర్వహించనున్న పూజా కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియా తో ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లెముల ప్రాజెక్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలల ప్రాజెక్టుగా అభివర్ణించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి శనివారం బ్రాహ్మణవెల్లెముల ప్రాజెక్టుకు ఉదయ సముద్రం నుండి బ్రాహ్మణ వెల్దములకు 0.3 టిఎంసి నీటిని విడుదల చేయనున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కు నిధులు, అనుమతులు, టెక్నికల్ శాంక్షన్ అన్నింటిని యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేస్తామని, వారం రోజుల్లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకుగాను మిగిలిపోయిన 730 ఎకరాల భూసేకరణ కూడా పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాగునీరు ఇస్తామని ,ఈ ప్రాంతంలో మొదటి విడుతన 50వేల ఎకరాలకు సాగునీరు రావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రాజెక్టుల పూర్తికి కంకణం కట్టుకున్నామని, ప్రత్యేకించి నల్లగొండ జిల్లా ను సస్యశ్యామలం చేసే ఎస్ఎల్ బీసీ టన్నెల్ పనులు పూర్తిచేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభమైన బ్రాహ్మణ వెల్లెముల ప్రాజెక్టు గత ప్రభుత్వ కాలంలో అసలు పట్టించుకోలేదని, ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్ట్ పూర్తి కావడం సంతోషంగా ఉందని ,పూర్తి ఎడారి ప్రాంతమైన బ్రాహ్మణ వెల్లెముల చుట్టుపక్కల 1500 ఫీట్లలో బోర్లు వేసిన చుక్క నీరు పడలేదని, అలాంటిది ఇప్పుడు ప్రాజెక్టులోకి నీరు వస్తే చుట్టుపక్కల బోర్లు రీఛార్జ్ అయ్యి 2 పంటలు పండడానికి అవకాశం ఉందని, అలాంటి ప్రాజెక్టుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి బ్రాహ్మణ వెల్లెముల ప్రాజెక్టుకు పూర్తి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ,జిల్లా ప్రాజెక్టుల సిఈ అజయ్ కుమార్, సిఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డిఓ అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మంత్రి హామీతో ఆటో కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, ఆటో యూనియన్ల జెఎసి నేతలు ప్రకటన

### 10వ తేదీ నాటికి ఆటో యూనియన్ల జెఎసితో చర్చలు జరుపుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటో కార్మికుల సమస్యల పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీతో శనివారం నిర్వహించతలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆటో కార్మికుల సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు ఆటో యూనియన్ జెఎసి నేతలు ప్రకటించారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో మగ్ధూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావును ఆటో యూనియన్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం (ఎఐటియుసి), పి.శ్రీకాంత్ (సిఐటియు), వి.ప్రవీణ్ (టియుసిఐ), వి.మారయ్య (బిఆర్‌టియు), ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్), ఎం.ఎ.సలీం (యుటిఎడబ్ల్యుఎ), సి.హెచ్.జంగయ్య, ఎస్.అశోక్, ఎం.డి.ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, సి.హెచ్.బాలనర్సింహ్మా తదితరులు కలిసి వారి పలు డిమాండ్లను వివరించారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని సాంబశివరావును వారు కోరారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు స్పందించి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 10వ తేదీ లోపు ఆటో యూనియన్ నేతలతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు హామీ ఇచ్చారు. దీంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు కూనంనేని సాంబశివరావుతో పాటు జెఎసి నేతలు ప్రకటించారు. ఈ చర్చలలో ప్రజాప్రతినిధులుగా తనతో పాటు, ఎంఎల్‌సి కోదండరామ్, ఆటో యూనియన్ జెఎసి నాయకులు పాల్గొని సామరస్యపూరిత వాతావరంలో చర్చలు జరుపుకుంటామని కూనంనేని సాంబశివరావు ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల సమస్యలు అనేకం ఉన్నప్పటికీ వాటిలో కొన్నింటికైనా పరిష్కారం లభిస్తున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. అవసరమైతే సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి దగ్గరికి కూడా వెళ్ళి చర్చలు జరుపుతామని సాంబశివరావు తెలిపారు. ఆటో కార్మికులు మహాలక్ష్మి పథకాన్ని తీసివేయాలని కోరడం లేదని, కానీ వారికి సంవత్సరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేయాలని, 50 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, వారి సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తదితర హామీలను పూర్తి చేయాలని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు.

## ఎవరికీ భయపడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నేరస్తులు, కబ్జాదారులతో ఫ్రెండ్లీగా ఉండటం కాదన్నారు. సమాజంలో అత్యధికంగా కష్టపడేది పోలీసులు అని, అత్యంత విమర్శలు ఎదుర్కునేది కూడా పోలీసులే అన్నారు. కొంతమంది పోలీసుల వలన అలాంటి చెడ్డ పేరు వస్తుందని.. పోలీసు శాఖపై ఉన్న చెడ్డ పేరును తొలగించుకోవాలని తెలిపారు. పోలీసులు ఎవ్వరికీ భయపడాల్సిన పనిలేదని, ప్రోటోకాల్స్ ఎంతవరకు పాటించాలో అంతే పాటించాలని సూచించారు. ఎవరైనా పోలీస్ స్టేషన్ కు వచ్చి హడావిడి చేయాలి అనుకుంటే ముందు వారిని లోపల వేయండని.. అలాంటి వారిని ఉపేక్షించేది లేదని వెల్లడించారు. ఏదైనా సమస్యలు వస్తే డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటాడని, ఎలాంటి సమస్యలైనా.. పరిష్కారాలు, సలహాలు, సూచనలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని సిఎం రేవంత్ రెడ్డి పోలీసు శాఖకు హామీ ఇచ్చారు. పోలీస్ శాఖలో దాదాపు15 వేల నియామక పత్రాలు అందించామన్నారు. డిసెంబర్ 6 హోంగార్డ్స్ రైజింగ్ డే సందర్భంగా జనవరి నుంచి హోమ్ గార్డుల దినభత్యాన్ని రూ.921 నుంచి రూ.1000కి పెంచుతున్నట్లు హోంగార్డులకు శుభవార్త చెప్పారు. అంబేద్కర్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఏడో గ్యారంటీగా స్వేచ్చను అందించామన్నారు.ట్రాన్స్ జెండర్స్ పై గత ప్రభుత్వాలు మానవీయ కోణంతో వ్యవహరించకపోవడం వల్ల వారు నిరాదరణకు గురయ్యారు.ఈ ప్రభుత్వం ట్రాన్స్ జెండర్స్ ను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని 15 మందిని ట్రాఫిక్ విభాగంలో నియమించేందుకు నియామక పత్రాలు సైతం అందించామన్నారు. స్కూల్స్, కాలేజీల్లో డ్రగ్స్ సంబంధిత వాటిని గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.






**తెలంగాణ విపత్తు నిర్వహణ దళంను ప్రారంభించిన సిఎం...**

తెలంగాణలో జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డిఆర్‌ఎఫ్) తరహాలో రాష్ట్ర విపత్తు స్పందన దళం రంగం(ఎస్‌డిఆర్‌ఎఫ్) అందుబాటులోకి రానుంది. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాన్ని సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌డిఆర్‌ఎఫ్‌ను ప్రారంభించారు. భారీ అగ్ని ప్రమాదాలు, వరదలు, భూకంపం వంటి విపత్తులు సంభవించినప్పుడు అత్యవసర సహాయ చర్యలు చేపట్టడానికి ఈ దళం అన్ని వేళలా సిద్ధంగా ఉంటుంది. తెలంగాణ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దాదాపు 2000 మంది సిబ్బందితో ఇది ఏర్పాటు కానుంది. అగ్నిమాపకశాఖలోని ఫైర్‌స్టేషన్లు ఇక నుంచి ఎస్డీఆర్‌ఎఫ్ స్టేషన్లుగా మార్పు చెందనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 137 ఫైర్‌స్టేషన్లలోని దాదాపు వెయ్యి మంది సిబ్బందితో పాటు తెలంగాణ ప్రత్యేక పోలీసు విభాగానికి చెందిన పది కంపెనీలతో కూడిన 1000 మంది సిబ్బంది ఈ దళంలో విధులు నిర్వర్తించనున్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది కోసం కొత్తగా 20 బస్సులు, ట్రక్కులు, బొలేరోల తో పాటు 40 వాటర్‌బోట్లు కొనుగోలు చేశారు. కాగా వీటన్నిటిని కాసేప టి క్రితం సీఎం ఆవిష్కరించారు. అగ్నిప్రమాదాల్లో సహాయ చర్యల కోసం సిబ్బందికి శిరస్త్రాణాలు, చేతి గ్లౌజ్లు, కంటి అద్దాలు, రెఫ్లెక్టివ్ , సేఫ్టీషూ, మెడికల్ ఫస్ట్ రెస్పాండర్కిట్లను కూడా సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్త, డిజిపి డాక్టర్ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శి వధర్‌రెడ్డి, ఫైర్ డిజిపి వై.నాగిరెడ్డి, పోలీసు కమిషనర్ సివి ఆనంద్‌ల, మేయర్ విజయలక్ష్మి తో పాటు పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ ఎఇఇకి 19 బ్యాంక్ లాకర్లు

(మొదటి పేజీ తరువాయి)

బంధువుల పేర్లపై ఉన్నాయని దర్యాప్తులో తేలింది. నికేష్‌కుమార్ పేరుపై ఉన్న రెండు లాకర్లను ఎసిబి అధికారులు శుక్రవారం తెరిచారు. ఇందులో ఉన్న రెండు కిలోల బంగారు ప్లాటీనం, డైమండ్స్ ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.రెండు కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇక బినామీ పేర్లపై ఉన్న 17 బ్యాంక్ లాకర్లను తెరవాల్సి ఉంది. కోర్టు అనుమతితో త్వరలో వీటిని కూడా తెరిచి పరిశీలిస్తే నికేష్ కుమార్ లాకర్ల మొత్తం భాగోతం బయటపడుతుంది.వారం రోజుల క్రితమే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నికేష్‌కుమార్‌కు చెందిన 19 ప్రాంతాల్లో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి సోవాల్లో 5 ఇళ్ల స్థలాలు, 6.5 ఎకరాల వ్యవసాయ భూమి, 6 ఫ్లాట్లు, 2 వాణిజ్య స్థలాలకు సంబంధించిన ఆస్తి పత్రాలు లభ్యమయ్యాయి. సోదాల్లో నికేష్‌కుమార్ చర, స్థిరాస్తులను గుర్తించారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.100 కోట్ల అని తేలింది. 2013 లో ఉద్యోగం పొందిన ఆయన వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. నీటిపారుదల శాఖలో ఎఇఇగా పనిచేస్తున్న నిఖేశ్ కుమార్ బఫర్‌జోన్ పరిధిలోని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారు.ఈ క్రమంలోనే బఫర్ జోన్‌లో భవన నిర్మాణం కోసం ఎన్‌ఓసి జారీ చేసేందుకు నికేష్‌కుమార్ ఓ వ్యక్తి నుంచి లంచం డబ్బులు తీసుకుంటుండగా ఈ ఏడాది మే 30న ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా అతని అక్రమాస్తులపై నిఘా పెట్టిన ఎసిబి అధికారులు వరుస దాడులు చేశారు. కేసు ఇంకా దర్యాప్తులో ఉందని ఎసిబి అధికారులు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com